




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 09 ఆదివారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 145

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur








# బీజేపీ అప్రతిహాత విజయం

- బీజేపీ క్లీన్ స్వీప్.. 48 స్థానాలతో విజయకేతనం
- 27 ఏళ్ల తర్వాత బీజేపీకి ఢిల్లీలో అధికార పగ్గాలు
- కాంగ్రెస్ పార్టీ హ్యాట్రిక్ జీరో
- ఆమ్ ఆద్మీ పార్టీ 22 సీట్లతో రెండోస్థానం
- కేజ్రీవాల్‌తో పాటు టాప్ 2 లీడర్స్ ఓటమి

2




**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. 70 అసెంబ్లీ స్థానాల్లో అధికారానికి అవసరమైన మెజారిటీ మార్క్ 36 స్థానాలను సునాయాసంగా దాటేసి 48 స్థానాలను సాధించింది. 22 స్థానాలతో ఆమ్ ఆద్మీ పార్టీ రెండో స్థానంలో నిలిచింది**

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

హోరాహోరీగా సాగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. 70 అసెంబ్లీ స్థానాల్లో అధికారానికి అవసరమైన మెజారిటీ మార్క్ 36 స్థానాలను సునాయాసంగా దాటేసి 48 స్థానాలను గెలుచుకుంది. 22 స్థానాలతో ఆమ్ ఆద్మీ పార్టీరెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ వరుసగా మూడోసారి కూడా ఒక్కసీటు కూడా గెలుచు కోకుండా హ్యాట్రిక్ 'జీరో'లతో చతికిలపడింది. బీజేపీ ఘనవిజయంతో 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికార పగ్గాలు చేపట్టబోతోంది.

సామాన్యుడినంటూ రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ 2015, 2026లో భారీ అధిక్యతతో అధికారం కొనసాగించగా, ఈసారి ముందస్తు ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల జాబితాల విడుదల, మరిన్ని ఉచిత హామీ పథకాలు ప్రకటించినప్పటికీ బీజేపీ వ్యూహాత్మక ప్రచారంతో కోలుకోలేని దెబ్బకొట్టింది. 2025లో టార్గెట్ ఫిక్స్ చేసుకుని మరీ మోదీ, అమిత్‌షా టీమ్ అనుకున్న లక్ష్యం సాధించింది. ఢిల్లీ ఎన్నికలకు ముందే బడ్జెట్‌ను (ఫిబ్రవరి 1)న బడ్జెట్ ప్రవేశపెట్టడం, మధ్యతరగతి వర్గానికి ఊరట కలిగించడం సహా అందుబాటులో ఉన్న అవకాశాలన్నింటినీ బీజేపీ ఉపయోగించుకుంది. దేశంలోనే కేజ్రీవాల్ అంత అవినీతిపరుడు, అబద్ధాలకోరును చూడలేదంటూ లిక్కర్ స్కామ్, శీష్ మహల్ వివాదాన్ని సమర్థవంతంగా ప్రచారం చేసింది. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఢిల్లీలో అమల్లో ఉన్న పథకాలను కొనసాగిస్తామని భరోసా ఇచ్చింది. యమునా జలాల్లో బీజేపీ విషం కలిగిందంటూ కేజ్రీవాల్ చివరి నిమిషంలో చేసిన ఆరోపణలను సైతం అంతే ధీటుగా తిప్పికొట్టింది. అవినీతికి చరమగీతం పాడతామని, అభివృద్ధికి పట్టం కడతామని ప్రజలను భరోసా ఇవ్వగలిగింది. బీజేపీ 'వికసిత్ ఢిల్లీ సంకల్ప్ పత్ర' మేనిఫెస్టో మంత్రం ఢిల్లీ ఓటర్లపై పనిచేయగా, అవినీతి మరకలు, కుంభకోణాలు ఆప్ పార్టీ పాలిట శాపంగా మారాయి. ఎగ్జిట్ పోల్స్‌లో చెప్పినట్టుగానే భారతీయ జనతా పార్టీకి ఢిల్లీ ప్రజలు పట్టంకట్టారు.

**టాప్-3 ఔట్**

అసెంబ్లీ ఎన్నికల్లో వెలివడిన ఫలితాలు ఆప్‌ను ఘోరంగా దెబ్బతీశాయి. టాప్-3లో ఉన్న అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్ ఓటమి చవిచూశారు. కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేల పైచిలుకు ఓట్లతో బీజేపీ అభ్యర్థి పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మ చేతిలో ఓడిపోయారు. మనీష్ సిసోడియా జంగ్‌పురలో బీజేపీ అభ్యర్థి తర్వీందర్ సింగ్ చేతిలో 600 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. షాకుర్ బస్తీలో బీజేపీ అభ్యర్థి కర్నాల్ సింగ్ చేతిలో 19,000 కు పైగా ఓట్ల తేడాతో సత్యేందర్ జైన్ ఓడిపోయారు. ఢిల్లీ సీఎం అతిషి మాత్రం తన సమీప బీజేపీ అభ్యర్థి రమష్ బిధూరిపై 3,521 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.

**ఢిల్లీ విజయం..** బీజేపీ గుప్పిట్లో ఎన్ని రాష్ట్రాలు ఉన్నాయంటే? ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ కోటపై బీజేపీ జెండా ఎగిరింది. 70 అసెంబ్లీ స్థానాల్లో అధికారానికి అవసరమైన మెజారిటీ మార్క్ 36 స్థానాలను దాటి 48 స్థానాలను కమలం పార్టీ కైవసం చేసుకుంది. 22 స్థానాలను ఆప్ సాధించింది. కాంగ్రెస్ పార్టీ వరుసగా మూడోసారి కూడా ఒక్కసీటు కూడా గెలుచుకోకుండా చతికిలపడింది. ఎగ్జిట్ పోల్స్‌లో చెప్పినట్టుగానే బీజేపీకి ఢిల్లీ ప్రజలు పట్టం కట్టారు. ఢిల్లీ విజయంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే భారత్‌లో బీజేపీ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. దేశంలోని చాలా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దక్షిణాది రాష్ట్రాలు తప్పిస్తే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ బీజేపీ దాని

## అభివృద్ధి గెలిచింది.. ప్రధాని మోదీ



బీజేపీ గెలుపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల శక్తి అత్యున్నతమని, అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయని అభివర్ణించారు. చారిత్రక విజయం అందించిన సోదర సోదరీమణులందరికీ అభినందనలు తెలిపారు. పార్టీని ఆశీర్వదించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. ఢిల్లీ అభివృద్ధి, జీవన ప్రమాణాల పెరుగుదలకు కట్టుబడి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. రేయింబవళ్లు గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలను చూసి గర్విస్తున్నానని ట్వీట్ చేశారు.

## ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం: కేజ్రీవాల్



ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నా మని ఎన్నికల్లో ఓటమి తర్వాత అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. గెలిచిన బీజేపీకి అభినందనలు తెలిపారు. పదేళ్ల పాటు ఢిల్లీ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడ్డామని, ఇక ప్రతిపక్షంగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చెప్పారు. ఎన్నికల్లో పోరాడిన ఆప్ నేతలు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఒక్కడు కాదు.. ముగ్గురు!

- భార్యను చంపింది గురుమూర్తి ఒక్కడే కాదు!
- మరో మలుపు తిరిగిన మీర్‌పేట్ మర్డర్ కేసు
- హత్యలో అతడికి ముగ్గురి సహకారం?
- అంతా కుటుంబసభ్యులే.. వీరిలో ఇద్దరు మహిళలు
- రిమాండ్ రిపోర్టులో పేర్లు?..పరారీలో ముగ్గురు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

మీర్‌పేట మర్డర్ కేసు మరో మలుపు తిరిగింది.. అచ్చంగా మలయాళం మూవీ సూక్షదర్శిని సినిమాలో మాదిరిగానే!! ఈ సినిమా స్ఫూర్తితోనే భార్య వెంకటమాధవిని హత్య చేసి.. మృతదేహాన్ని గురుమూర్తి మాయం చేశాడని అనుకున్నాం! ఆమెను చంపింది మొదలు.. మృత దేహాన్ని ముక్కలుగా నరకడం.. ఆ ముక్కలను వేడినీళ్లలో ఉడికించడం.. ఎముకల్ని కాల్చి, దంచి పొడిచేయడం.. ఆ అవశేషాలను చెరువులో కలిపేయడం.. ఇదంతా ఒక్కడే చేశాడనే ఇప్పటిదాకా తెలుసు! అయితే ఈ మొత్తం ప్రక్రియలో ఆయనకు కుటుంబసభ్యుల్లో ముగ్గురు సహకరించినట్లు తెలుస్తోంది. పోలీసు వర్గాల విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మీర్‌పేట మర్డర్ కేసుకు సంబంధించి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో గురుమూర్తిని ఏ-1గా పేర్కొన్న పోలీసులు, మరో ముగ్గురి పేర్లనూ చేర్చారు.

ఆ ముగ్గురూ పరారీలో ఉన్నట్లుగా తెలిసింది. ముగ్గురిలో ఇద్దరు మహిళలున్నట్లు సమాచారం. అయితే హత్యలో గురుమూర్తికి కొందరు సహకరించారన్న విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. కాగా గురుమూర్తిని నాలుగు రోజుల విచారణ నిమిత్తం శనివారం మీర్‌పేట పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కాగా హత్య కేసుకు సంబంధించి

# జమిలికి రూట్ క్లియర్

- ఢిల్లీ గెలుపుతో బీజేపీలో ఉత్సాహం
- 2027లో జమిలి ఎన్నికలకు ఊతం
- వన్ నేషన్..వన్ ఎలక్షన్‌కు ఊపు
- బీజేపీకి రాష్ట్రాలు పెరగడంతో జమిలికి అడ్డంకులుండవు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ప్రభంజనం కనిపించింది. ఆ పార్టీ అభ్యర్థులు అన్ని చోట్లా విజయఢంకా మోగిస్తోన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ మట్టికరిచింది. హస్తినా పురిలో తన ప్రాభవాన్ని, అధికారాన్ని కోల్పోయింది. కాంగ్రెస్ బోణీ కొట్టే పరిస్థితీ కనిపించట్లేదు. మొత్తం 70 నియోజకవర్గాలు ఉన్నాయి ఢిల్లీ అసెం బ్లీలో. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన మేజిక్ ఫిగర్.. 36. దీన్ని అందుకుంది బీజేపీ. 27 సంవత్సరాల తరువాత తొలిసారిగా హస్తినలో కమ్ బ్యాక్ ఇచ్చింది. గ్రాండ్‌గా ఎంట్రీ అయింది. ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి కావాల్సిన మెజారిటీని అందుకుంది. ఇప్పటివరకు ఓడిన వారిలో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్- న్యూఢిల్లీ, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా- జంగ్‌పురా, ధరంపాల్ చందేరా- రాజౌరీ గార్డెన్, సోమ్‌నాథ్ భారతి- మాలవీయ నగర్, ప్రవీణ్ జైన్- షాలిమార్ బాగ్, దినేష్ మోహానియా - సంగం విహార్ ఉన్నారు. ముఖ్యమంత్రి ఆతిషీ- చివరి రౌండ్‌లో గట్టెక్కారు. కల్కాజీలో బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరీపై విజయఢంకా మోగించారు. ఈ ఫలితాలు ఆమ్ ఆద్మీ పార్టీని నిరాశ నిస్పృహల్లోకి నెట్టాయి. మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం, పార్టీ కేంద్ర

# వైసీపీలోకి ఉండవల్లి?


- వైసీపీ దారి పడుతున్న కాంగ్రెస్ సీనియర్లు
- మొన్న శైలజానాథ్,ఇప్పుడు ఉండవల్లి
- వైసీపీ ఓటమితో రూటు మార్చిన జగన్
- వైఎస్సార్‌తో సన్నిహితంగా ఉన్న నేతలకు ఆహ్వానం
- వాగ్ధాటి ఉన్న ఉండవల్లి వస్తే పార్టీకి మేలు

2




**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. జగన్ లక్ష్యంగా కూటమి పార్టీల నేతలు వ్యూహాలు అమలు చేస్తున్నారు. అటు జగన్ ప్రభుత్వం పైన విమర్శల తీవ్రత పెంచారు. వైఎస్సార్ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతలు ఇప్పుడు వైసీపీ బాట పడుతున్నారు. తాజా గా మాజీ మంత్రి శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఇప్పుడు ఉండవల్లి అరుణ్ కుమార్ సైతం వైసీపీలో చేరుతున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ మేరకు చర్చలు పూర్తయినట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి మరి కొందరు సీనియర్లు సైతం వైసీపీలోకి రానున్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది. వైసీపీలో చేరికలు ఎన్నికల్లో ఓడిన తరువాత జగన్ కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వం పైన ప్రజల్లో అప్పుడే వ్యతిరేకత మొదలైందని జగన్ చెబుతున్నారు. ప్రభుత్వం పైన విమర్శలను ఎక్కు పెట్టారు. ఇటు పార్టీ కార్యకర్తల కోసం తాను గతం కంటే భిన్నంగా పని చేస్తానని హామీ ఇస్తున్నారు. ఉగాది నుంచి జిల్లాల పర్యటనలకు జగన్ సిద్ధం అవుతున్నారు. ఇటు వైసీపీలో ముఖ్య నేతలు పార్టీ వీడుతున్నారు. ఈ సమయంలోనే గత అనుభవాలు..

## ఒక్క అక్షరం మార్చి రూ.10 కోట్లు కొట్టేశారు.. ఏం దొంగ తెలివిరా అయ్యా..!

**హైదరాబాద్-నవభూమి:**ఒకప్పుడు ఇంట్లో డబ్బులు దాచుకుంటే దొంగల భయం ఉండేది. దీంతో చాలా మంది బ్యాంకుల్లో డబ్బులు దాచుకునేవారు. ఇప్పుడు అక్కడా భద్రత లేకుండా పోతుంది. సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో తరహా మోసం అమాయకుల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఈ కేవైసీలు, ఓటీపీల పేరుతో బురిడీ కొట్టించి డబ్బులు దోచుకుంటున్నారు. తాజాగా.. మరో కొత్త తరహా మోసానికి తెరలేపారు. మెయిల్స్ అక్షరాలు మార్చి డబ్బులు కొట్టేస్తున్నారు. ఇలా ఓ కంపెనీ మెయిల్‌లోని ఒక్క అక్షరం మార్చి.. అక్షరాల రూ. 10 కోట్లు కొట్టేశారు.హైదరాబాద్ నగరానికి చెందిన ఓ సంస్థను సైబర్ కేటుగాళ్లు నిండా ముంచారు. సంస్థ ఉద్యోగులను అక్షరాలతో ఏమార్చి రూ. 10 కోట్లు కోట్టేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన సదరు కంపెనీ..హాంకాంగ్ నుంచి తమకు కావాల్సిన ముడిసరుకు కొనుగోలు చేస్తుంటుంది. లావాదేవీలు పూర్తిగా ఈమెయిల్ ద్వారానే జరుపుతుంటారు. హాంకాంగ్ సంస్థ తరఫున robert@gmail.com ద్వారా హైదరాబాద్ కంపెనీతో సంప్రదింపులు జరిపేవారు. ఇటీవల సరుకు డెలివరీ పూర్తయిన తర్వాత ఒకరోజు హైదరాబాద్ సంస్థకు మెయిల్ వచ్చింది. ఆడిట్ కారణాల వల్ల తమ బ్యాంకు అకౌంట్ మార్చాల్సి వచ్చిందని మెయిల్‌లో పేర్కొన్నారు. తమకు రావాల్సిన బకాయిలు కొత్త బ్యాంకు అకౌంట్‌కు బదిలీ చేయాలని సూచించారు.వారి మెయిల్ చూసుకున్న హైదరాబాద్ సంస్థ కొత్త అకౌంట్‌కు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసింది. డబ్బులు పంపిన వారం తర్వాత తమకు ఇంకా డబ్బు రాలేదని హాంకాంగ్ సంస్థ నుంచి హైదరాబాద్ కంపెనీకి సమాచారం ఇచ్చింది. దాంతో ఖంగుతున్న హైదరాబాద్ సంస్థ ఉద్యోగులు వారం క్రితమే తాము డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశామని అందుకు సంబంధించిన వివరాలు పంపారు. అయితే ఆ అకౌంట్ తమది కాదని.. డబ్బు పంపాలని చెప్పిన ఈ-మెయిల్ కూడా తాము పంపలేదని హాంకాంగ్ సంస్థ



## కొత్త రేషన్ కార్డులపై బిగ్ అలర్ట్.. మీ సేవలో దరఖాస్తుల స్వీకరణకు బ్రేక్..?






**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటి వరకు ప్రజా పాలన, ప్రత్యేక గ్రామ సభల ద్వారా అర్హుల నుంచి అప్లికేషన్లు తీసుకున్నారు. మీ సేవ కేంద్రాల నుంచి కూడా అప్లికేషన్లు తీసుకుంటామని శుక్రవారం సర్కార్ ప్రకటించింది. ఈ మేరకు సివిల్ సప్లయ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మీసేవ కేంద్రాల ద్వారా రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు బ్రేక్ పడినట్లు తెలిసింది. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పనిచేసిన ఆహార భద్రత సర్వర్ ఆ తర్వాత నిలిచిపోయింది.ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంలో సమర్పించిన మాన్యువల్ దరఖాస్తులను పరిశీలించి, ఆ దరఖాస్తుల ఆధారంగానే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. అందుకే డూప్లికేట్ ప్రక్రియను నివారించేందుకు మీసేవా కేంద్రాల ద్వారా మరోసారి కొత్త దరఖాస్తుల స్వీకరణను నిలిపివేసినట్లు సమాచారం. ప్రజాపాలన, ప్రజావాణి అప్లికేషన్‌ల డేటా ఎంట్రీపై వివరణాత్మక సూచనలు త్వరలో జారీ చేయనున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుండి ఏదైనా తదుపరి సమాచారం అందిన తర్వాత తెలియజేస్తామని మీ సేవ నిర్వాహకులు ప్రజలకు తెలుపుతన్నారు.కాగా, రేషన్ కార్డులకు మీసేవ కేంద్రాల ద్వారా అప్లికేషన్లు తీసుకుంటామన్న ప్రభుత్వ ప్రకటనపై మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. దరఖాస్తుల పేరిట ఇంకెన్ని సార్లు ప్రజలను మోసం చేస్తారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. 'ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నరు. కుల గణనలో వివరాలు తీసుకున్నరు. గ్రామ సభల పేరిట డ్రామా చేశారు. ఇప్పుడు మల్లా మీసేవలో దరఖాస్తులు అంటున్నరు. పథకాల పేరిట ఇన్నాళ్లు మీరు చేసిన హడావుడి స్థానిక సంస్థల ఎన్నికల కోసం చేసిన గారడీనేనా? ప్రజా పాలన, గ్రామ సభల దరఖాస్తులకు విలువ లేదా?బీఆర్ఎస్ పాలనలో దరఖాస్తు లేకుండా, దస్త్రం లేకుండా తెలంగాణలో పథకాల అమలు జరిగింది. కాంగ్రెస్ పాలనలో దరఖాస్తులు అంటూ మోసం చేస్తున్నారు. జనాల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. పేదలకు రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలనే ఆలోచన కంటే, కోతలు పెట్టి ఎలా అందకుండా చేయలన్న దానిపైనే మీ ప్రభుత్వ దృష్టి ఉంది. దరఖాస్తుల పేరిట దగా చేయడం తప్ప, 14 నెలల పాలనలో మీరు చేసిందేముంది. దరఖాస్తుల పేరిట కాలం వెళ్లదీయడం మానేసి, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయండి. ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు, ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేసి, నిరుపేదలకు, రైతులకు బాసటగా నిలవండి.' అని హరీష్ ట్వీట్ చేశారు.

## ములుగు: ఎస్సై ఆత్మహత్య కేసులో ట్విస్టు.. 'ఆమె' పరిచయంతోనే..!

**ములుగు-నవభూమి:**ములుగు జిల్లాలో రెండ్రోజుల క్రితం ఎస్సై లక్ష్మీనర్సు సూసైడ్ చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే అతడి సూసైడ్‌కు ఓ మహిళ కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఓ మహిళతో ఎస్సైకు ఏర్పడిన పరిచయం.. ఆ విషయం భార్యకు తెలియటంతో గొడవలు జరిగి సూసైడ్ చేసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం ప్రసాలో రెండ్రోజుల క్రితం ఏఆర్ ఎస్సై సూసైడ్ చేసుకున్న సంగతి తెలిసిందే. సుర్ణపాక లక్ష్మీనర్సు అనే ఎస్సై.. ఉరివేసుకొని సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని 15వ బెటాలియన్‌కు చెందిన లక్ష్మీనర్సు.. కొత్తగూడెం జిల్లా బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబంతో కలిసి ములుగు జిల్లా గోవిందరావుపేట పస్రాలో నివాసం ఉంటున్నారు. ఆయన స్వస్థలం కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం మాణిక్యారం.

కాగా ఎస్సై ఆత్మహత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఓ మహిళ పరిచయంతోనే ఆయన సూసైడ్ చేసుకున్నట్లు తెలిసింది. ఆమె పరిచయం తర్వాత కాపురంలో గొడవలు మొదలై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎస్సై సూసైడ్ కేసులో విచారణ కొనసాగుతోంది. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. లక్ష్మీనర్సు, వినోద ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరి పెళ్లికి పెద్దలు కూడా అంగీకారం తెలిపారు. వినోద ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. పస్రాలో పదేళ్లకు పైగా అద్దె ఇంట్లో ఉన్న ఈ దంపతులు రెండేళ్ల క్రితం అక్కడే సొంతిల్లు కట్టుకున్నారు.అయితే లక్ష్మీనర్సుకు ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త హద్దులు దాటినట్లు తెలిసింది. ఈ విషయం కాస్త భార్య వినోదకు తెలియటంతో కాపురంలో గొడవలు మొదలయ్యాయి. బుధవారం కుటుంబ సమేతంగా మాణిక్యారం వెళ్లిన దంపతులు.. రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగ్గా.. లక్ష్మీనర్సు తన భార్యను ఇంటి నుంచి బయటకు పంపాడు. ఆ సమయంలో ఆమె బస్సు ఎక్కి హనుమకొండ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడే తెలిసినవారి ఇంటికి వెళ్లింది. అయితే భార్యకు ఫోన్ చేయగా స్పందించకపోవటంతో.. ఆమె ఏదైనా అఘాయిత్యానికి పాల్పడుతుందని లక్ష్మీనర్సు ఆందోళనకు గురైనట్లు తెలిసింది. ఆ టెన్షన్‌తోనే అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. లేదంటే పరిచయమైన మహిళ కారణంగా సూసైడ్ చేసుకొని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో టెన్షన్.. టెన్షన్..


**హైదరాబాద్-నవభూమి:** ఉస్మానియా యూనివర్సిటీ(లో శుక్రవారం అర్ధరాత్రి వరకు ఉద్రిక్తత నెలకొంది. సెమిస్టర్‌ను వాయిదా వేయాలని సైన్స్ విద్యార్థులు అడ్మిన్ బిల్డింగ్‌ను ముట్టడించారు. ఈ నెల 18 నుంచి మెదటి, మూడవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో పలు పోటీ పరీక్షలు ఉండడంతో ఈ సెమిస్టర్స్‌ను వాయిదా వేయాలని రెండు రోజులుగా విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆందోళనను ఉధృతం చేశారు.

# తీన్మార్ మల్లన్నపై కేసు ఎందుకు పెట్టలేదు..? రేవంత్ సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సొంత పార్టీ ఎమ్మెల్సీ అయిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గంపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు హస్తం నేతలను తీవ్ర ఆగ్రహానికి గురి చేయగా.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే రిపోర్టు విషయంలోనూ ఆయన తీరుపై రాష్ట్ర నాయకత్వం సీరియస్ అయ్యింది. ఈ మేరకు తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు కూడా పంపించింది. పార్టీ పంపించిన షోకాజ్ నోటీసులపై కూడా తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అయితే.. తీన్మార్ మల్లన్న విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్‌పై హైకోర్టు అసహనం వ్యక్తం చేయటం గమనార్హం.ఓ సామాజిక వర్గంపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఫిర్యాదు వచ్చినప్పటికీ ఆయనపై ఎందుకు కేసు నమోదు చేయలేదని రేవంత్ రెడ్డి సర్కారును హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై సిద్దిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదంటూ కే అరవింద్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై శుక్రవారం (ఫిబ్రవరి 07) రోజు జస్టిస్ కే శరత్ విచారణ జరిపారు. ఏఈఫిబ్రవరి 2వ తేదీన వరంగల్‌లో బీసీ సంఘం నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న ఓ కులాన్ని కించపరిచేలా తీవ్ర వ్యాఖ్యలు చేసినట్టు పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలపై సిద్దిపేట పోలీసులతో పాటు డీజీపీకి ఫిర్యాదు చేసినప్పటికీ తీన్మార్ మల్లన్నపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. పిటిషనర్ తరపు వాదనలు విన్న న్యాయస్థానం.. తీన్మార్ మల్లన్నపై ఎందుకు కేసు నమోదు చేయలేదో వివరణ ఇవ్వాలంటూ పోలీసులను జస్టిస్ శరత్ న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.అయితే.. ఇప్పటికే తీన్మార్ మల్లన్నపై సొంత పార్టీ నేతలే గుర్రుగా ఉన్నారు. పార్టీలో ఉంటూనే ప్రభుత్వంపై, రాష్ట్ర నాయకత్వంపై ఇష్టమొచ్చినట్టు కామెంట్లు చేస్తుండటంపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే.. కులగణన సర్వే రిపోర్టును కాల్చేయటంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తటంతో క్రమశిక్షణ కమిటీ చర్యలకు ఉపక్రమించి నోటీసులు పంపించింది. అయితే.. అంతకుముందే తీన్మార్ మల్లన్న పలుమార్లు ప్రభుత్వంపై వ్యతిరేక గళం వినిపించినా.. ఓ వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం ఇప్పుడు సొంత పార్టీ శ్రేణుల్లో కూడా కొంత అసహనం వ్యక్తమవుతోంది.

# తెలంగాణలో ఎలా పుంజుకున్నామో.. దేశవ్యాప్తంగా కూడా అలాగే గెలుస్తాం: కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్-నవభూమి:**దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికల ఫలితాలు విడుదలైన వేళ.. అటు దేశ రాజకీయాలతో పాటు ఇటు తెలంగాణ రాజకీయాలు కూడా రసవత్తరంగా మారాయి. అధికార కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమదైన శైలిలో సెటైర్లు వేస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన సెటైరికల్ కామెంట్స్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా.. ట్విట్టర్‌లో పోస్టు పెట్టారు.తాము కాంగ్రెస్ పార్టీ యోధులమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పుకొచ్చారు. తెలంగాణలో ఓటమి తర్వాత ఎలాగైతే తిరిగి పుంజుకొని విజయం సాధించామో.. అలాగే దేశవ్యాప్తంగా కూడా గెలుస్తామని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించడం కోసం.. సొంత పార్టీకి సున్నా సీట్లు అందించిన గొప్ప నాయకత్వం, పార్టీ బీఆర్ఎస్‌ది అంటూ విమర్శించారు. తెలంగాణలో బీజేపీకి 8 సీట్లు అందించిన బీఆర్ఎస్‌కు అభినందనలు అంటూ రివర్స్ కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు ఎవరైనా కారణమంటే అది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీ ఘనతే అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ట్విట్‌లో పేర్కొన్నారు.అంతకుముందు.. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ తనదైన శైలిలో స్పందించారు. ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సెటైర్లు సంధించారు. "కంగ్రాట్స్ రాహుల్ గాంధీ" అంటూ సెటైర్లు వేశారు. మరోసారి బీజేపీని గెలిపించిన రాహుల్ గాంధీకి అభినందనలని కేటీఆర్ ట్వీట్ చేశారు. అయితే.. ఇందుకు సంబంధించి సంవత్సరం కింద కేటీఆర్ చెప్పిన విషయానికి సంబంధించిన వీడియోను ఓ నెటిజన్ షేర్ చేయగా.. ఆ ట్వీట్‌ను కేటీఆర్ తన పోస్టుకు జత చేశారు. కాగా.. ఈ పోస్టును బీఆర్ఎస్ శ్రేణులు తెగ వైరల్ చేసేస్తున్నారు. ఆ తర్వాత తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలోనూ.. రేవంత్ రెడ్డి ఓ ఐరెన్ లెగ్ అని.. మొన్న హర్యానాకు వెళ్తే అక్కడ ఓడిపోయిందని.. నిన్న మహారాష్ట్ర ప్రచారం చేస్తే అదే పరిస్థితి నెలకొందని.. ఇప్పుడు ఢిల్లీలనూ అదే సీన్ రిపీటయ్యిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# బీజేపీ అప్రతిహత విజయం

(1వపేజీ తరువాయి)మిత్ర పక్షాలతో కలిసి పాగా వేసింది. తాజాగా ఢిల్లీలో గెలిచి దేశంలోని 21 రాష్ట్రాలను బీజేపీ తన గుప్పిట్లో పెట్టుకుంది. దేశంలో మిత్ర రాష్ట్రాలతో కలిసి మొత్తం 21 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్గఢ్, హర్యానా, గుజరాత్, గోవా, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ, మణిపూర్, పుదుచ్చేరి, సిక్కిం, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ లలో బీజేపీకి మద్దతు ప్రభుత్వాలు ఉండగా.. తాజాగా ఢిల్లీ ఆ జాబితాలో చేరింది. ఈ విధంగా మొత్తం బీజేపీ, మిత్ర రాష్ట్రాలు కలిసి 21 రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేసింది. ఇదిలా ఉండగా.. కేవలం మూడు రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ అధికారంలో ఉంది. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. మరోవైపు త్వరలోనే హిమాచల్ ప్రదేశ్‌లో కూడా శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ కూడా పాగా వేస్తామని బీజేపీ ఇప్పటికే ధీమా వ్యక్తం చేస్తోంది. తమిళనాడు, కేరళ, జార?ండ్, పశ్చిమ బెంగాల్, జమ్మూకాశ్మీర్ లలో స్థానిక ప్రభుత్వాలు తమ పాలనను కొనసాగిస్తున్నాయి. రుణపడి ఉంటా..:ప్రధాని మోడీ ఢిల్లీలో భారీ విజయాన్ని కట్టబెట్టినందుకు ప్రజలకు ప్రధాని మోడీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని.. అన్ని విధాలుగా ఢిల్లీని అభివృద్ధి చేస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. ఇది మోడీ గ్యారంటీ అంటూ పేర్కొన్నారు. ప్రజలు సౌకర్యవంతంగా జీవించేలా కృషిచేస్తామన్నారు. దేశాభివృద్ధిలో ఢిల్లీని భాగం చేస్తామని ప్రధాని పేర్కొన్నారు. రేయింబవళ్లు గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలను ప్రధాని మోడీ అభినందించారు.

**సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ కితాబు..**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మెచ్చుకున్నారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పాల్గొనడంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. కూటమి పొత్తులో భాగంగా ఢిల్లీలోని తెలుగువారున్న నియోజకవర్గాల్లో ఆయన ప్రచారం చేయడం ఎంతో కలిసి వచ్చిందని చెప్పారు. టీడీపీ ఎంపీలు, పార్టీ శ్రేణులతో ప్రచారం చేయించడం విజయానికి దోహదం చేసిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సుపరిపాలనతో చంద్రబాబు తన ట్రాక్ రికార్డ్ స్థాపించారని ప్రధాని కొనియాడారు. ఎక్కడైతే నాయకులు అభివృద్ధి మార్గాన్ని ఎంచుకున్నారో అక్కడ మంచి ఫలితాలు వస్తాయని మోదీ చెప్పుకొచ్చారు.

కేంద్రంలో ఎన్డీయే కూటమి ఉండడంతో ఏపీకి మరింత లబ్ధి చేకూరుతుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడక ముందు తీవ్రమైన నీటి ఎద్దడి ఉండి వ్యవసాయం చేయడం గగనంగా ఉండేదని చెప్పారు. కానీ నేడు అదే గుజరాత్ వ్యవసాయంలో అద్భుతాలు సృష్టిస్తోందని తెలిపారు. ఒకప్పుడు బిహార్‌లో భయంకరమైన పరిస్థితులు రాజ్యమేలేవని, కానీ నితీశ్ కుమార్‌తో బీజేపీ జతకట్టాక పరిపాలన, అభివృద్ధిలో సమూల మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. ప్రజల జీవితాల్లో మార్పులు ఎన్డీయేతోనే సాధ్యమని, దేశం వికసిత్ భారత్ లక్ష్యాలను సాధిస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

**సీఎం చంద్రబాబు ఏమన్నారంటే..**

మరోవైపు ప్రధాని మోదీ ప్రసంగాని కంటే ముందే ఢిల్లీ విజయంపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. ఢిల్లీ ఎన్నికల్లో 27 ఏళ్ల తర్వాత బీజేపీ విజయం చరిత్రాత్మకమని చంద్రబాబు కొనియాడారు. పీపుల్స్ ఫస్ట్ అనే నినాదం అక్కడి ఎన్నికల్లో బాగా వర్కౌట్ అయ్యిందని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై నమ్మకంతోనే ఢిల్లీ ప్రజలు బీజేపీని గెలిపించారని చెప్పారు. ఢిల్లీలో వాయు కాలుష్యం పెద్ద సమస్యగా మారిందని, త్వరలో ఆ రాష్ట్ర సమస్యలన్నీ తీరిపోతాయని చెప్పుకొచ్చారు. భారత్‌కు సరైన సమయంలో వచ్చిన సరైన నాయకుడు మోదీ అని చంద్రబాబు సైతం మోదీకి కితాబు ఇచ్చారు. ఆయన స్థిరమైన పాలన, పాలసీలు గుజరాత్ అభివృద్ధికి కారణం అయ్యాయని, అలాగే దేశాన్ని సైతం ప్రగతిపథంలో నడుపుతున్నాయని చెప్పుకొచ్చారు.

# తెలంగాణలో కొత్త రేషన్ కార్డులకు ఎన్నికల సంఘం బ్రేక్

**మీ సేవ కేంద్రాల్లో రేషన్ కార్డులకు దరఖాస్తుకు ప్రభుత్వం వెసులుబాటు**

**తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు**

**ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేయాలని ఈసీ ఆదేశాలు**

**హైదరాబాద్-నవభూమి**

తెలంగాణ కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు కేంద్ర ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. కానీ ఈరోజు రేషన్ కార్డుల దరఖాస్తులపై ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది.

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో దరఖాస్తులను నిలిపివేసింది. కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల దరఖాస్తు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వానికి ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోని వారు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం నిన్న శుభవార్త చెప్పింది.

రేషన్ కార్డులు కలిగి ఉన్న వారు కూడా మీసేవ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు బ్రేక్ వేస్తున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

# వైసీపీలోకి ఉండవల్లి?

(1వపేజీ తరువాయి) ఓటమితో జగన్ వ్యూహం మార్చారు. నాడు వైఎస్సార్‌తో సన్నిహితంగా ఉన్న సీనియర్లను తన పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు బెంగళూరు కేంద్రంగా చర్చలు సాగుతున్నాయి. అందులో భాగంగానే ముందుగా మాజీ మంత్రి శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఇప్పుడు మాజీ ఎంపీ ఉండవల్లి వైసీపీలో చేరుతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. 2014లో రాష్ట్ర విభజన తరువాత ఉండవల్లి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. విభజన బిల్లు వ్యతిరేకించటంతో నాడు కాంగ్రెస్ ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఆ తరువాత క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటూ.. విభజన సమస్యల పైన పోరాటం చేస్తున్నారు. జగన్ సీఎం అయిన సమయం లో పూర్తి మద్దతుగా నిలిచారు. ఆ తరువాత జగన్ పైన విమర్శలు చేసారు. తాజాగా జగన్ ఓడిన తరువాత పరిమితంగానే స్పందిస్తున్నారు. పోలవరంపైన ఉండవల్లి ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రభుత్వానికి సూచనలు చేస్తున్నారు. ఉండవల్లి వస్తున్నారంటూ బీజేపీకి తొలి నుంచి వ్యతిరేకిగా ముద్ర పడిన ఉండవల్లి.. ప్రస్తుతం వైసీపీలోకి రావాలంటూ ఆ పార్టీ ముఖ్య నేతలు ఆహ్వానించినట్లు తెలుస్తోంది. వైఎస్ సన్నిహితుడుగా పేరున్న ఉండవల్లి రాకతో పార్టీకి మంచి వాయిస్ ఉంటుందని భావిస్తున్నారు. ఉండవల్లి ఈ నెల 26 తరువాత వైసీపీలో చేరుతారనే ప్రచారం పార్టీలో జరుగుతోంది. కానీ, రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఉండవల్లి నిజంగా వైసీపీలో చేరేందుకు సిద్దంగా ఉన్నారా లేదా అనేది ఆయన నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఇక, కాంగ్రెస్ లో సీనియర్లుగా ఉన్న తూర్పు గోదావరి, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన నేతలు వైసీపీలో చేరటం ఖాయమైందని సమాచారం. దశల వారీగా పార్టీలో సీనియర్ల చేరికలు ఉంటాయని చెబుతున్నారు. దీంతో, వైసీపీలో చేరికల అంశం ఇప్పుడు రాజకీయంగా ఆసక్తి కరంగా మారుతోంది.

## ఒక్కడు కాదు..ముగ్గురు!

(1వపేజీ తరువాయి) మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో పోలీసలు అన్వేషిస్తున్నారు. గురుమూర్తి విచారణ పూర్తయ్యేలోపు మిగతా నిందితులనూ పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## జమిలికి రూట్ క్లియర్

(1వపేజీ తరువాయి) కార్యాలయం బోసిపోయాయి. కంచుకోటలు సైతం కుప్పకూలిపోవడం పట్ల దిగ్భ్రాంతికి గురైందా పార్టీ. స్వయానా కేజ్రీవాలే మట్టికరవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. బీజేపీ అందుకున్న ఈ ఘనవిజయం.. దేశ రాజకీయాలను సైతం మలుపు తిప్పడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో బీజేపీ వన్ నేషన్- వన్ ఎలక్షన్ దిశగా అడుగు ముందుకు వేయడానికి అవసరమైన బలాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ఇచ్చినట్టయింది. 2027 నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ దేశంలో జమిలి ఎన్నికలు రావొచ్చనడానికి ఊతమిచ్చింది.'కేజ్రీవాల్ తొలి ప్రకటనే సంచలనం కదా" ప్రస్తుతం జమిలి ఎన్నికల బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉన్న విషయం తెలిసిందే. 27 మందితో లోక్‌సభ, 12 మందితో రాజ్యసభ జేపీసీ ఏర్పాటైంది. అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలతో పాటు స్థానిక సంస్థలకూ ఒకేసారి మధ్యంతర ఎన్నికలను నిర్వహించడానికి ఉద్దేశించిన బిల్లు ఇది. జమిలి ఎన్నికల బిల్లులో ఏవైనా సవరణలు ఉంటే ఈ జాయింట్ పార్లమెంటరీ కమిటీ సూచనలు, సలహాలను అందజేస్తుంది. దానికి అనుగుణంగా ఇందులో మార్పులు చేర్పులు చోటు చేసుకోవచ్చు. ఇది అమలులోకి వస్తే 2027 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఒకేసారి అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభకు ఎన్నికలు జరిగే అవకాశాలు లేకపోలేదు. దేశంలో జమిలి ఎన్నికలు కొత్తేమీ కాదు. 1951 నుండి 1967 వరకు లోక్‌సభ, అన్ని రాష్ట్రా శాసనసభలకు ఎన్నికలు ఒకేసారి జరిగాయి. 1951- 52లో తొలిసారిగా లోక్‌సభ, శాసనసభలకు మొదటిసారిగా సార్వత్రిక ఎన్నికలను నిర్వహించారు. 1957, 1962, 1967 నాటి ఎన్నికల వరకూ అదే సంప్రదాయం కొనసాగింది. కొన్ని రాష్ట్రాల శాసనసభలు మధ్యంతర ఎన్నికలకు వెళ్లాల్సి రావడం వల్ల 1968- 69 మధ్యకాలంలో జమిలికి తొలిసారిగా బ్రేక్ పడింది. 1970 నాటి లోక్‌సభ కూడా ముందస్తుగా రద్దయింది. ఆ తరువాత 1971లో లోక్‌సభకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి జమిలి మళ్లీ పునరుద్ధరణకు నోచుకోలేదు. ఇప్పుడు మళ్లీ కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది.

## దేవినేనికి దెబ్బ.. చంద్రబాబు కీలక నిర్ణయం

**విజయవాడ-నవభూమి:**గత ప్రభుత్వంలో అవినాశ్ తండ్రి దేవినేని రాజశేఖర్ కు గుర్తుగా విజయవాడలోని మహానాడు రోడ్డుకు దేవినేని రాజశేఖర్ రోడ్డుగా పేరు పెట్టారు. వైసీపీ నేత దేవినేని అవినాశ్ కు కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గత ప్రభుత్వంలో అవినాశ్ తండ్రి దేవినేని రాజశేఖర్ కు గుర్తుగా విజయవాడలోని మహానాడు రోడ్డుకు దేవినేని రాజశేఖర్ రోడ్డుగా పేరు పెట్టారు. అయితే ఎంతో చరిత్ర కలిగిన మహానాడు రోడ్డు పేరు మార్చడంపై స్థానికుల నుంచి అభ్యంతరాలు రావడంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానాన్ని రద్దు చేస్తూ ఆదేశాలు వెలువరించింది. దేవినేని రాజశేఖర్ రోడ్డు పేరు తొలగింపుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. దేవినేని అవినాశ్ ప్రస్తుతం వైసీపీలో ఉన్నా ఆయన తండ్రి దేవినేని రాజశేఖర్ టీడీపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా అంతా గుర్తు చేస్తున్నారు. తమ పార్టీ వ్యవస్థాపక సభ్యుడి పేరుతో ఉన్న రోడ్డు పేరు తొలగించడాన్ని రాజకీయంగా అనేక కోణాల్లో చూస్తున్నారు. విజయవాడలో దేవినేని అవినాశ్ కు చెక్ చెప్పడంతోపాటు దేవినేని ఆనవాళ్లు లేకుండా చేయాలనే ఆలోచన కూడా ఉందని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. బండి అయితే కూటమి ప్రభుత్వం మాత్రం మహానాడు రోడ్డు పేరు పునరుద్ధరణకు రాజకీయ కోణం ఏమీ లేదని చెబుతోంది. దేవినేని రాజశేఖర్ రోడ్డుగా పేరు మార్చడం స్థానికులకు ఇష్టం లేదని, అందుకే మహానాడు రోడ్డుగా పునరుద్ధరించాలని పెద్ద ఎత్తున లేఖలు అందాయని చెబుతోంది. స్థానికుల కోరిక మేరకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు సైతం ప్రభుత్వానికి లేఖ రాశారు. దేవినేని రాజశేఖర్ పేరు తొలగించి మహానాడు రోడ్డు పేరు పునరుద్ధరించాలని కోరారు. దీంతో ప్రభుత్వం ప్రజాభిప్రాయానికే కట్టుబడాల్సివచ్చిందని అంటున్నారు. దీంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానాన్ని రద్దు చేసిందంటున్నారు. మొత్తానికి దేవినేని పేరు తొలగింపు రాజకీయంగా దుమారం రేపే సూచనలు కనిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీని స్థాపించడంలో కీలకపాత్ర పోషించిన దేవినేని రాజశేఖర్ ను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంటే బాగుండేదని టీడీపీలోనే ఉన్న ఆయన సన్నిహితులు సూచిస్తున్నారు. టీడీపీలో రాజకీయ జీవితం ప్రారంభించిన దేవినేని 1995లో ఎన్టీఆర్ ను గద్దె దించడాన్ని జీర్ణించుకోలేక ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుతో విభేదించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన రాష్ట్ర విభజన తర్వాత మళ్లీ టీడీపీలో చేరారు. తాను మరణించేటప్పుడు టీడీపీ జెండా కప్పాలని కోరుకున్న దేవినేని.. తుది శ్వాస విడిచే సమయానికి పార్టీలోనే ఉన్నారని గుర్తు చేస్తున్నారు.



# ఢిల్లీ ఫలితాలను శాసించిన మిడిల్ క్లాస్.. ఇదీ కామన్

**న్యూఢిల్లీ-నవభూమి:**అరవింద్ కేజ్రీవాల్.. దేశ రాజకీయాల్లో ఈ పేరు ఒక సంచలనం. అవినీతికి వ్యతిరేకంగా జన్‌లోక్‌పాల్ వ్యవస్థను తీసుకురావాలని గాంధేయవాది అన్నా హజారే చేసిన దీక్షతో ఒక్కసారిగా క్రేజ్ సంపాదించారు కేజ్రీవాల్. మధ్యతరగతికి ప్రతిబింబంగా అందరి దృష్టిని ఆకర్షించిన ఆయన.. అన్నా హజారే ఉద్యమంతో ఎదిగి ఆ తర్వాత ఆప్‌ను నెలకొల్పి ఢిల్లీ గద్దెనెక్కారు. కామన్ మ్యాన్ ప్రోత్సాహంతో సింహాసనాన్ని అధిష్టించిన కేజ్రీవాల్.. ఇప్పుడు వాళ్లు కొట్టిన దెబ్బకు తల్లడిల్లుతున్నారు. తాజా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఈ మాజీ



సీఎం దారుణ ఓటమిని మూటగట్టుకున్నారు. ఢిల్లీలో మధ్యతరగతి ప్రజలు ఎక్కువ. దేశం నలుమూలల నుంచి వచ్చిన మిడిల్ క్లాస్ జనాల్లో చైతన్యం కూడా ఎక్కువే. అందుకే మార్పుకు శ్రీకారం చుడతారు, తమ జీవితాలు మారుస్తారనే నమ్మకంతో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్‌కు మద్దతుగా నిలిచారు. కానీ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో ఆప్ జాతీయ కన్వీనర్ పూర్తిగా విఫలమయ్యారు. అవినీతిని నిర్మూలిస్తారని అనుకుంటే అదే ఆరోపణలతో పరువు పోగొట్టుకున్నారు. లిక్కర్ స్కామ్‌తో ఏకంగా జైలుకు వెళ్లొచ్చారు. కేజ్రీవాల్‌తో పాటు ఆప్ ముఖ్య నేతలు మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ కూడా కటకటాల పాలయ్యారు. దీనికి తోడు ఢిల్లీ సీఎం అధికార నివాసానికి సుమారుగా రూ.33 కోట్ల ప్రజాధనంతో మరమ్మతులు చేపట్టినట్లు కాగ్ నివేదికలో తేలింది.

## ఢిల్లీ విజయాన్ని కట్టబెట్టిన బీజేపీ వ్యూహం ఇదీ!




**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీపై ఆప్ ఆధిపత్యానికి గండికొట్టి విజయం దిశగా నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ దూసుకుపోతోంది. 45 పైచిలుకు స్థానాల్లో బీజేపీ ముందంజలో ఉండగా ఆప్ మాత్రం కేవలం 21 స్థానాల్లోనే మెరుగైన స్థితిలో ఉంది. ఆప్ అధినేత కేజ్రీవాల్, మరో కీలక నేత మనీశ్ శిశోడియా బరిలోకి దిగిన న్యూఢిల్లీ, ప్రతాప్‌గంజ్ స్థానాలు కూడా బీజేపీ అకౌంట్‌లోకి చేరాయి. 26 ఏళ్ల తరువాత దేశ రాజధాని బీజేపీ చేతుల్లోకి వెళ్లడం దాదాపుగా ఖరారైపోయింది. అయితే, బీజేపీ గెలుపు విషయం అటుంచితే 2020లో కేవలం 8 సీట్లకు పరిమితమైన కాషాయం పార్టీ కేవలం ఐదేళ్లల్లో ఆప్‌ను మట్టి కరిపించి తిరుగులేని ఆధిపత్యాన్ని సొంతం చేసుకోవడంపై విశ్లేషకులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లకే పరిమితమైంది. ఆప్ ఏకంగా 62 స్థానాల్లో విజయఢంకా ఎగరవేసింది. దీంతో, సునాయసంగా రెండోసారి ఢిల్లీ పగ్గాలు చేపట్టింది. 1993లో ఒక పర్యాయం మినహా బీజేపీ దేశరాజధానిలో ఎప్పుడూ వెనకంజలోనే ఉంది. అప్పట్లో కమలం పార్టీ ఏకంగా 49 స్థానాలు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ కేవలం 14 సీట్లకు పరిమితమైంది. కానీ 1998 తరువాత మాత్రం బీజేపీ ట్రాక్ రికార్డు సైలెంట్ అయిపోయింది. 1998 నాటి ఎన్నికల్లో బీజేపీ 15 సీట్లకు పరిమితం కాగా కాంగ్రెస్ మాత్రం 52 సీట్లల్లో జయకేతనం ఎగురవేసింది. ఇక 2003 ఎన్నికల్లో బీజేపీ కొద్దిగా పుంజుకుని 20 సీట్లు దక్కించుకుంది. ఆ తరువాత జరిగిన సాధారణ ఎన్నికల్లో బీజేపీ సీట్ల సంఖ్య 23కు చేరింది.

ఇక 2013 నాటికి సీన్‌లోకి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంట్రీ ఇచ్చింది. ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్ కాషాయం పార్టీకి ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా మారారు. నాటి ఎన్నికల్లో బీజేపీ 31 సీట్లు ఆప్ 28 సీట్లు గెలిచుకున్నాయి. ఆ తరువాత కేజ్రీవాల్ కాంగ్రెస్‌తో చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అయితే, ఈ పొత్తు రెండేళ్లకు మించిన మనలేకపోయింది. 2015 ఆప్ కాంగ్రెస్‌కు గుడ్డై చెప్పి ఒంటరిగా ఎన్నికల్లో దిగి సొంతంగా మెజారిటీ సాధించింది. ఇక నాటి ఎన్నికల్లో బీజేపీ కేవలం మూడు సీట్లకే పరిమితమైంది. 2020 ఎన్నికల్లో ఆప్ ఏకంగా 62 సీట్లు గెలుచుకుని అజేయంగా నిలిచింది. బీజేపీ ఎనిమిది సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.


బీజేపీ గెలుపునకు కారణాలు..డబుల్ ఇంజన్ ప్రభుత్వం నినాదంతో ఈసారి ఎన్నికల బరిలోకి దిగిన బీజేపీకి ఈ వ్యూహం బాగా కలిసొచ్చింది. ప్రధాని మోదీ విస్తృత ప్రచారం కూడా పార్టీ విజయానికి మరో ప్రధాన కారణంగా నిలిచింది. మునుపటి ప్రభుత్వ పథకాలు కొనసాగిస్తామంటూనే ఆయన ఆప్ అవినీతికి ముగింపు పలుకుతామన్న హామీతో ఓటర్ల మద్దతు కూడగట్టారు. దేశ రాజధానిలో డబుల్ ఇంజన్ అభివృద్ధి ఉంటుందని భరోసా ఇచ్చారు. వీటికి తోడు ఢిల్లీ ఎన్నికల్లో కీలకంగా ఉన్న మిడిల్ క్లాస్ వర్గం బీజేపీకి జైకొట్టడం పార్టీని విజయ తీరానికి చేర్చింది.

## ముస్లింల ఖిల్లా ముస్తఫాబాద్‌లో చక్రం తిప్పిన బీజేపీ



**న్యూఢిల్లీ-నవభూమి:**అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ హవా కొనసాగిస్తోంది. మెజారిటీ మార్క్‌ను దాటి 46 సీట్లలో విజయానికి మార్గం సుగమం చేసుకుంది. ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న ముస్తఫాబాద్ లో బీజేపీ ఈసారి చక్రం తప్పింది. బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే మోహన్ సింగ్ బిస్ట్ తన సమీప ప్రత్యర్థిపై 42,000కు పైగా ఓట్లకు పైగా ఆధిక్యంతో విజయాన్ని ఖరారు చేసుకున్నారు. మోహన్ సింగ్ బిస్ట్ ప్రస్తుతం కర్వాల్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే కపిల్ మిశ్రాను ఈసారి కర్వాల్ నగర్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా బీజేపీ నిలిపింది. దీంతో మోహన్ సింగ్ బిస్ట్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వెంటనే బీజేపీ మరో జాబితా విడుదల చేస్తూ ముస్తఫాబాద్ సెగ్మెంట్ నుంచి ఆయనను తమ అభ్యర్థిగా ప్రకటించింది. డీలిమిటేషన్ కమిషన్ సిఫారసులతో 2008లో ముస్తఫాబాద్ నియోజకవర్గం ఏర్పడింది. 2008, 2013లో కాంగ్రెస్ ఇక్కడ గెలిచింది. తొలి ఎన్నికలో బీజేపీ అభ్యర్థి హసన్ అహ్మద్‌పై కాంగ్రెస్ అభ్యర్థి హసన్ అహ్మద్ 978 ఓట్ల అధిక్యంతో గెలిచారు. 2013లో బీజేపీ అభ్యర్థి జగదీష్ ప్రధాన్‌పై 2,000 ఓట్ల ఆధిక్యంతో హసన్ గెలిచారు. 2019లో కాంగ్రెస్, బీజేపీ ఆధిపత్యానికి 'ఆప్' గండికొట్టింది. బీజేపీ అభ్యర్థి ప్రధాన్, హసన్ కుమారుడు అలి మెహన్దిని ఆప్ అభ్యర్థి చిత్తుచేశారు. కాగా, 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ముస్తఫాబాద్ నుంచి అరవింద్ కేజ్రీవాల్ సన్నిహితుడు అదిల్ అహ్మద్ ఖాన్ పోటీ చేయగా, కాంగ్రెస్ అభ్యర్థిగా అలి మేహంది, బీజేపీ నుంచి మోహన్ సింగ్ బిస్ట్ పోటీ చేశారు. ఎంఐఎం సైతం తమ అభ్యర్థిగా ఢిల్లీ అల్లర్ల నిందితుడు తాహిర్ హుస్సేన్‌ను బరిలోకి దింపింది.

## పడిపోయిన క్యాబేజీ ధర.. కిలో రూ.2 మాత్రమే



**చెన్నై-నవభూమి:** క్యాబేజీ కిలో రూ.2కు పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈరోడ్ జిల్లా తాళవాడి కొండ గ్రామాల్లో రైతులు సుమారు మూడువేల ఎకరాల్లో క్యాబేజీ సాగుచేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.80 వేల వరకు రైతులు ఖర్చు పెడుతున్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో ఈ ఏడాది దిగుబడి పెరిగింది. ఈ నేపథ్యంలో, కొద్ది రోజులుగా క్యాబేజీ కిలో రూ.10 నుంచి రూ.20 వరకు ఉండగా, ప్రస్తుతం కిలో రూ.2కు పడిపోయింది. ఈ ధరకు ఇస్తే కూలీల ఖర్చు కూడా రాదని, అలాగని పంట విక్రయించకపోతే పూర్తిగా దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల నుంచి క్యాబేజీ కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జైలుకెళ్లొచ్చిన సోరెన్ మళ్లీ సీఎం అయ్యాడు.. కానీ కేజ్రీవాల్ ఎందుకు ఓడాడు? తేడా కొట్టిన అంశాలివే..!



**న్యూఢిల్లీ-నవభూమి:**జైలుకు వెళ్లొచ్చిన తర్వాత పాలిటిక్స్‌లో హీరో కావడం అనేది ఇటీవలి కాలంలో ఓ సెంటిమెంట్‌గా మారింది. ఏపీలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్, టీడీపీ చీఫ్ నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణలో రేవంత్ రెడ్డి, కన్నడ నాట డీకే శివ కుమార్, కశ్మీరాన ఒమర్ అబ్దుల్లా, జార్కండ్‌లో హేమంత్ సోరెన్ దీనికి ఉదాహరణలుగా చెప్పొచ్చు. అయితే జైలుకెళ్లొచ్చిన కేజ్రీవాల్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకొని రాలేకపోవడమే కాదు.. కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేకపోయారు. పైన పేర్కొన్న నేతలు జైలుకు వెళ్లింది నిజమే. కానీ వీరిలో హేమంత్ సోరెన్ మినహా మిగతా నేతలంతా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అరెస్టయ్యి జైలుకెళ్లారు. జగన్ పార్టీ పెట్టిన కొత్తలోనే జైలుకు వెళ్లి 16 నెలల తర్వాత బయటకొచ్చారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయ్యి రాజమండ్రి జైల్లో ఉండాల్సి వచ్చింది. ఇక ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి కూడా జైలుకు వెళ్లొచ్చారు. దక్షిణాదిన కాంగ్రెస్ కీలక నేతగా మారిన డీకే శివకుమార్ సైతం ఎన్నో కేసులను ఎదుర్కోవాల్సి వచ్చింది.

జార్కండ్ సీఎం హేమంత్ సోరెన్ మాత్రం ముఖ్యమంత్రిగా ఉండగానే మనీ లాండరింగ్ కేసులో 2024 జనవరి 31న అరెస్టయ్యారు. దీనికి ముందే హేమంత్ తన పదవికి రాజీనామా చేయగా.. చంపై సోరెన్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. సుమారు 6 నెలల తర్వాత.. 2024 జూన్ 28న బెయిల్ మీద బయటకొచ్చిన హేమంత్ సోరెన్ తిరిగి సీఎం అయ్యారు. 2024 నవంబర్లో జరిగిన జార?ండ్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత హేమంత్ సోరెన్ మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే జార్కండ్‌లో ఆయన ఒంటరిగా కాకుండా.. కాంగ్రెస్, ఆర్జేడీ తదితర పార్టీలతో కలిసి 'మహాఘట్ బంధన్'గా బరిలోకి దిగారు. జార?ండ్ అసెంబ్లీలో 81 సీట్లు ఉండగా.. మహాఘట్ బంధన్‌కు 56 సీట్లు వచ్చాయి. అందులో హేమంత్ సోరెన్ సొంత పార్టీ జార్కండ్ ముక్తి మోర్చా 34 సీట్లు గెలుపొందింది. మరో వైపు బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి 24 సీట్లు సాధించింది. ఎన్నికల ముందు చంపై సోరెన్ బీజేపీలో చేరినా.. హేమంత్ విజయాన్ని అడ్డుకోలేకపోయారు.

ఢిల్లీ తరహాలోనే జార్కండ్ ఎన్నికల్లోనూ పార్టీలు పోటాపోటీగా సంక్షేమ పథకాలను, ఉచితాలను ప్రకటించాయి. జార్కండ్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలతోపాటు ఆదివాసీల భూమి హక్కు ప్రచారాంశంగా మారింది. అధికారంలో ఉండగానే అరెస్టయి బెయిల్ మీద బయటకొచ్చిన హేమంత్ సోరెన్ ప్రజలు ఆదరించడానికి చాలా కారణాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జార్కండ్‌లో 86 లక్షల మంది ఆదివాసీలు ఉన్నారు. ఆ రాష్ట్ర జనాభాలో ఇది 26.2 శాతం. వీరు జేఎంఎంకు అండగా నిలిచారు. సంక్షేమ పథకాలతో మహిళా ఓటర్లు సైతం హేమంత్ సోరెన్‌కు మద్దతు పలికారు. జైలుకు వెళ్లి రావడంతో ఆయన పట్ల సానుభూతి ఏర్పడింది. హేమంత్ భార్య కల్పన ఇమేజ్ కూడా జేఎంఎం కూటమికి కలిసొచ్చింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు అని బీజేపీ చేసిన ప్రచారాన్ని హేమంత్ సోరెన్ తెలివిగా తిప్పి కొట్టారు. సరిహద్దుల నుంచి అక్రమంగా వలసలు అనేది కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైఫల్యం అని సోరెన్ తెలివిగా ప్రచారం చేశారు. ఈ వాదనతో జనం ఏకీభవించారు. గ్రామీణ ఓటర్లు ఎక్కువగా ఉండటం, ఆదివాసీలు, మైనార్టీలు అండగా ఉండటం లాంటి అంశాలు హేమంత్ సోరెన్‌కు ఈ ఎన్నికల్లో కలిసొచ్చాయి. ఇక ఢిల్లీ ఎన్నికల విషయానికి వస్తే.. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఎన్నికల ముందు అరెస్టయ్యారు. అదే లిక్కర్ స్కామ్‌లో ఢిల్లీ డిప్యూటీ సీఎం, ఆప్‌లో నంబర్ 2గా పరిగణించే మనీష్ సిసోడియా చాలా కాలం జైలు జీవితం గడిపారు. జైలుకు వెళ్లినప్పుడు హేమంత్ సీఎం పదవికి రాజీనామా చేయగా.. అరవింద్ కేజ్రీవాల్ దానికి భిన్నంగా జైలు నుంచే పాలనా వ్యవహారాలను తన ప్రతినిధి ఆతిశీ సాయంతో చక్కబెట్టారు. జైలు నుంచి బయటకొచ్చాక మాత్రం ఆయన సీఎం పదవికి రాజీనామా చేసి ఆతిశీకి ఆ బాధ్యతలు అప్పగించారు. ఢిల్లీ, జార్కండ్.. రెండు రాష్ట్రాల ఓటర్ల ఆలోచన సరళి భిన్నంగా ఉంటుంది. గ్రామీణ ఓటర్ల సానుభూతి పొందడం తేలిక. కానీ పట్టణ ఓటర్లు మాత్రం ఆలోచిస్తారు. సీఎం స్థాయి వ్యక్తి జైలుకు వెళ్లాడంటే.. అదేమంత ఆషామాషీ వ్యవహారం కాదని విద్యావంతులకు తెలుసు. దీంతో కేజ్రీవాల్‌కు సానుభూతి పొందే అవకాశం లేకుండా పోయింది లేదా తక్కువగా ఉంది. అంతే కాకుండా సంక్షేమ పథకాలు, ఉచితాల విషయంలో చూపిన శ్రద్ధను ఆప్ సర్కారు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన విషయంలో చూపెట్టలేకపోయింది. దీంతో ఢిల్లీలో పొల్యూషన్ పెద్ద సమస్యగా మారింది. ట్రాఫిక్ చిక్కులు, తాగునీటి కష్టాలు కూడా పెరిగాయి. ఇవన్నీ ఢిల్లీ ప్రజలను ఆప్‌కు దూరం చేశాయి. లెఫ్టినెంట్ గవర్నర్ వల్ల ఆప్ సర్కారు సైతం పనుల్లో దూకుడు చూపలేకపోయిందని చెబుతారు. అంతే కాదు ఈసారి ఎలాగైనా గెలవాలనే కసితో ఉన్న బీజేపీ సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించింది. క్షేత్ర స్థాయిలో ఓటర్లను తమవైపు తిప్పుకోవడం కోసం ఆరెస్సెస్ సైతం రంగంలోకి దిగింది. చివర్లో మధ్యతరగతి ఓటర్లను ఆకట్టుకోవడం కోసం రూ.12 లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారిని ఆదాయపన్ను నుంచి మినహాయించారు. ఆప్‌కు పోటీగా కమలం పార్టీ సైతం ఉచితాలు ప్రకటించింది. ఇవన్నీ బీజేపీకి కలిసి వచ్చాయి. మరోవైపు ఓవర్ కాన్ఫిడెన్స్‌కు పోయిన కేజ్రీవాల్ కాంగ్రెస్‌ను కలుపుకొని వెళ్లే ప్రయత్నం చేయలేదు. దీంతో ఢిల్లీలో గెలవడం కాదు.. ఆప్‌ను దెబ్బతీయడమే లక్ష్యం అన్నట్టుగా క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ శ్రేణులు పని చేశాయి. కాంగ్రెస్ ఓట్లు చీలకపోయి ఉంటే.. అంటే ఆప్, కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరి ఉంటే.. పోరు హోరాహోరీగా జరిగి ఉండేది. కానీ ఆప్ ఆ అవకాశాన్ని కాదనుకుంది. ఇవన్నీ కలిసి కేజ్రీవాల్ ఓటమికి దారి తీశాయి. మరో కీలక విషయం ఏంటంటే.. జార్కండ్‌లో జేఎంఎం కూటమి ఐదేళ్లు అధికారంలో ఉండి రెండోసారి తిరిగి అధికారంలోకి వచ్చారు. ఆప్ మాత్రం ఇప్పటికే రెండుసార్లు గెలిచి మూడోసారి హ్యాట్రిక్ సాధించే క్రమంలో ఓడింది. అంటే హేమంత్ సోరెన్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకతతో పోలిస్తే.. ఆప్ ప్రభుత్వం పట్ల ప్రజావ్యతిరేకత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

### తల్లి ఓటమికి రివెంజ్ తీర్చుకున్నాడు..

## ఓడిపోయినా కేజ్రీవాల్‌పై గెలిచాడు!



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఓటమి పాలయ్యారు. అయితే ఈయనపై బీజేపీ అభ్యర్థి విజయం సాధించగా.. కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ సైతం ఓడిపోయారు. న్యూఢిల్లీ స్థానాన్ని గెలుచుకోలేక పోయినప్పటికీ.. తల్లిని ఓడించిన కేజ్రీవాల్ ఓటమికి కారణం అయ్యారు. ఇలా కేజ్రీవాల్‌పై పగ తీర్చుకున్న సందీప్ దీక్షిత్.. ఢిల్లీ ఎన్నికల "బాజీగర్"గా నిలిచారు. అయితే కేజ్రీవాల్ ఓటమికి ఈయన ఎలా కారణం అయ్యారో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎవరూ ఊహించని విధంగా ఆప్ అధినేత అర్విoద్ కేజ్రీవాల్ ఓటమి పాలయ్యారు. అయితే ఆయన ఓడిపోవడానికి చాలానే కారణాలు ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ కూడా అందులో ఒకరు. గతంలో తన తల్లి ఓటమికి కారణం అయిన కేజ్రీవాల్‌ను చిత్తుగా ఓడించడం వెనుక ఆయన హస్తం కూడా ఉంది. న్యూఢిల్లీ స్థానంలో సందీప్ దీక్షిత్ ఓడిపోయినప్పటికీ.. కేజ్రీవాల్‌పై గెలిచి తన పగ తీర్చుకున్నారు. మరి ఆప్ అధినేత ఓటమికి సందీప్ దీక్షిత్ ఎలా కారణం అయ్యారో మనం ఇప్పుడు తెలుసుకుందాం." గెలవడం అంటే విజయం సాధించడం మాత్రమే కాదు.. ప్రత్యర్థిని ఓడించడం కూడా గెలుపే అవుతుంది. అలాంటి పనే చేశాడు న్యూఢిల్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన సందీప్ దీక్షిత్. ఈ స్థానం నుంచి ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ నుంచి పర్వేశ్ వర్మల మధ్య పెద్ద ఎత్తున యుద్ధం జరిగినప్పటకీ.. కేజ్రీవాల్ ఓటమికి సందీప్ దీక్షిత్ చాలా ఉపయోగపడ్డారు. ముఖ్యంగా మూడు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన తన తల్లి, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్‌ను ఓడించిన ప్రత్యర్థి కేజ్రీవాల్‌పై పగ తీర్చుకున్నారు.

దీంట్లో సందీప్ దీక్షిత్ పాత్ర చూస్తుంటే.. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ హిట్ సినిమా "బాజీగర్"యే గుర్తుకు వస్తుంది. ముఖ్యంగా అందులో షారుక్ ఖాన్ పాత్ర శత్రువును ఓడించేందుకు తాను కావాలనే ఓడిపోతుంది. సరిగ్గా ఇప్పుడు కూడా ఢిల్లీ ఎన్నికల్లో ఇదే జరిగింది. ప్రధానంగా బీజేపీ, ఆప్‌ల మధ్యే పోటీ ఉండగా.. కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగిన సందీప్ దీక్షిత్ కేజ్రీవాల్‌కు గట్టి షాక్ ఇచ్చేందుకు పెద్ద ఎత్తునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా న్యూఢిల్లీ స్థానంలో అరవింద్ కేజ్రీవాల్‌కు 22,057 ఓట్లు వచ్చాయి. అలాగే బీజేపీకి చెందిన పర్వేశ్ వర్మకు 25,057 ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి చెందిన సందీప్ దీక్షిత్‌కు 3,873 ఓట్లు వచ్చాయి. అయితే సందీప్ దీక్షిత్ పోటీ చేయకుండా ఉండి ఉంటే.. ఈ ఓట్లు అన్నీ కేజ్రీవాల్‌కే మళ్లి ఉండేవి. కానీ అలా జరగకూడదనే ఉద్దేశంతోనే ఓడిపోతానని తెలిసినా సందీప్ దీక్షిత్ బరిలోకి దిగారు. కేజ్రీవాల్ ఓటమే లక్ష్యంగా.. ప్రచార కార్యక్రమాల్లోనూ ఆయనపై పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే.. అందులో కేజ్రీవాల్ పాత్రను వివరించారు. ఇలా కేజ్రీవాల్ ఓటమే లక్ష్యంగా పని చేసిన సందీప్ దీక్షిత్.. చివరకు అనుకున్నది సాధించారు. తన తల్లిని ఓడించిన కేజ్రీవాల్‌పై పగ తీర్చుకున్నారు.

## కేజ్రీవాల్ ఢిల్లీలో ఓడిపోవడంతో.. ద్రౌపదీ పోస్ట్ వైరల్..



**న్యూఢిల్లీ-నవభూమి:**దశాబ్దకాలంగా దేశరాజధాని ఢిల్లీని పరిపాలిస్తూ వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ పాలనకు తాజా అసెంబ్లీ ఎన్నికలు తెరదించాయి. 'కేజ్రీవాల్ కీ గ్యారంటీ 'ని ఈసారి ఢిల్లీ ఓటర్లు విశ్వసించలేదు. కాంగ్రెస్, ఆప్ పార్టీలు కూటమిగా కలిసి విడివిడిగా పోటీచేయడం కూడా బీజేపీకి కలిసొచ్చిందనే చెప్పాలి. ఎన్నికల ప్రచారంలో బీజేపీ పార్చీ చెప్పినట్టుగానే 26 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో గెలుపు సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెల్లడించినట్టే అధికారం కైవసం చేసుకుంది. పక్కా ప్లాన్ ప్రకారం ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌కు చెక్ పెట్టింది. దేశమంతటా పార్టీని విస్తరించాలని భావించిన కేజ్రీవాల్ కలలకు కళ్లెం వేస్తూ సొంత రాష్ట్రంలోనే చీపురు పార్టీని ఊడ్చిపారేసింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ ఓటమిని ఉద్దేశిస్తూ రాజ్యసభ ఎంపీ స్వాతీ మలివాల్ పెట్టిన పోస్ట్ తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒకప్పుడు కేజ్రీవాల్ కు సన్నిహితురాలిగా ఉన్నారు రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్. ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. కానీ, ఇటీవలి కాలంలో కేజ్రీవాల్ నాయకత్వాన్ని, ఆప్ పార్టీని విమర్శించే వారిలో ఒకరిగా ఎదిగారు. గతేడాది కేజ్రీవాల్ సన్నిహితుడు బిభవ్ కుమార్ ఆయన ఇంట్లోనే తనపై దాడి చేశారని, తీవ్రంగా కొట్టారని ఆరోపణలు చేసిన తర్వాత ఆప్ పార్టీకి రెబెల్‌గా మారారు. కేజ్రీవాల్ ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌కు ద్రోహం చేశారని, తద్వారా కూటమి నుండి ఓట్లను మళ్లించారని శ్రీమతి మలివాల్ ఆరోపించారు. ఢిల్లీ ఎన్నికలకు ముందు యమునా నదిని శుభ్రం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కేజ్రీవాల్ నివాసం ముందు నిరసన కూడా చేశారు. ఢిల్లీలో చెత్త సంక్షోభం, మూసుకుపోయిన డ్రైనేజీలు మరియు క్షీణిస్తున్న మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి హామీలను విస్మరించిందనే విషయాలనూ ఆమె హైలైట్ చేశారు. కేజ్రీవాల్ ఓటమిని ఉద్దేశించి.. ద్రౌపదీ వస్త్రాపహరణం పోస్ట్..ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి వరసగా నాలుగోసారి పోటీచేసిన కేజ్రీవాల్ అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ చేతిలో అనూహ్యంగా పరాజయం పాలయ్యారు. ఆప్ నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో దిగిన కేజ్రీవాల్‌కు ఓటర్లు ఝలక్ ఇచ్చారు. సామాన్యుడిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి అవినీతి మరకలతో అప్రతిష్ఠ మూటగట్టుకున్న కేజ్రీవాల్‌ను ఈ సారి మాత్రం జనం విశ్వసించలేదు. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఓటమిని ఉద్దేశిస్తూ రాజ్యసభ ఎంపీ స్వాతీ మలీవాల్ మహభారత ఇతిహాసం నుంచి 'ద్రౌపదీ వస్త్రాపహరణం' పెయింటింగ్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

**'రావణుడి గర్వం కూడా ముక్కలైంది.. ఇప్పుడు కేజ్రీవాల్'..**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ మాట్లాడుతూ, "ఎవరి గర్వం కూడా ఎక్కువ కాలం ఉండదు. రావణుడి గర్వం కూడా చెదిరిపోయింది. ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ వంతు. నేడు ఢిల్లీ పూర్తిగా చెత్త కుప్పగా మారింది. రోడ్లు తెగిపోయాయి, ప్రజలకు నీరు అందడం లేదు. వాయు కాలుష్యం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. యమునా నదిని శుభ్రం చేయలేదు. ఈ సమస్యలతో ఇబ్బంది పడిన తర్వాత ప్రజలు ఈ తీర్పు ఇచ్చారు" అని అన్నారు.

### హర్యానాలో ఆప్ కొట్టిన దెబ్బకు..

## ఢిల్లీలో లెక్క సరిచేసిన కాంగ్రెస్!



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి మింగుడుపడని ఫలితాలు వచ్చాయి. ఆ పార్టీని ఢిల్లీ ఓటర్లు తిరస్కరించారు. ఇక, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవలేకపోయింది. పెద్దగా ప్రభావం చూపించలేకపోయిన హస్తం పార్టీ.. ఓట్ల పరంగా మూడోస్థానానికి పరిమితమైంది. అయితే, ఢిల్లీలో ఆప్ ఓడిపోవడానికి ఓ విధంగా కాంగ్రెస్ కారణమైంది. అన్ని చోట్ల ఆ పార్టీ మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి.. ఆప్ విజయవకాశాలకు గండికొట్టింది. గతేడాది అక్టోబరులో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ దెబ్బకొడితే.. ఢిల్లీలో కాంగ్రెస్ దానిని సరిచేసింది. హర్యానాలో కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకున్న కేజ్రీవాల్‌కు.. ఢిల్లీ ఎన్నికల్లో లెక్క సరిచేసింది. పంజాబ్ సరిహద్దు జిల్లాల్లోని హర్యానా అసెంబ్లీ స్థానాల్లో 12 చోట్ల కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఆప్ అభ్యర్థులే కారణం. దీంతో పదేళ్ల తర్వాత అధికారంలోకి వస్తారనుకున్న కాంగ్రెస్ నేతల ఆశలు అడియాశలయ్యాయి.

హర్యానాలో కాంగ్రెస్ పార్టీదే విజయమని అన్ని సర్వేలు ఢంకా బజాయించాయి. కానీ, తుది ఫలితాల్లో కాంగ్రెస్ మరోసారి ప్రతిపక్షంతోనే సరిపెట్టుకుంది. మొత్తం 90 స్థానాలున్న హర్యానాలో కాంగ్రెస్‌కు 37 సీట్లు రాగా.. బీజేపీ 50 స్థానాల్లో గెలిచి అధికారం నిలబెట్టుకుంది. ఇప్పుడు ఢిల్లీలో బీజేపీ గెలుపునకు, ఆప్ ఓటమికి కారణం కాంగ్రెస్ అభ్యర్థులే. ఆయా నియోజకవర్గాల్లో ఆప్ 3 వేలలోపు ఓట్లతో ఓడిపోయారు. ఆ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు 5 నుంచి 6 వేల వరకు ఓట్లను చీల్చారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సైతం ఈ విధంగా ఓడిపోవాల్సి వచ్చింది. అక్కడ కాంగ్రెస్ నుంచి పోటీచేసిన ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దాదాపు 7 వేల ఓట్లు సాధించారు. దీంతో కేజ్రీవాల్‌పై బీజేపీ అభ్యర్థి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ 3 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు.

ఇక, లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆప్.. అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా ముందుకెళ్లింది. ఇదే సమయంలో ప్రతిపక్ష కూటమి భాగస్వామ్య పక్షాలుగా ఉన్న ఎస్పీ, టీఎంసీ సహా మరికొన్ని పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. ఢిల్లీలో ఆప్ గెలిస్తే..కాంగ్రెస్ లేని మరో కూటమిని ఏర్పాటు చేసి, దానికి నాయకత్వం వహించాలనేది కేజ్రీవాల్ ఆలోచనగా తెలుస్తోంది. కానీ, ఢిల్లీలో ఆప్ గెలిస్తే తమ రాజకీయ భవిష్యత్తుకు మరింత ఇబ్బందుల్లో పడుతోందని గ్రహించిన కాంగ్రెస్.. తాము గెలవకున్నా.. ఆప్ ఓడిపోవాలనే లక్ష్యంతో పనిచేసినట్లు సమాచారం. ఒకే దెబ్బకు కాంగ్రెస్ రెండు పిట్టలను కొట్టినట్టయ్యింది. అటు హర్యానా ఎన్నికల్లో ఓటమి బదులు.. ఇటు ఇండియా కూటమి పగ్గాలు చేజారకుండా ఒడిసిపట్టునట్టయ్యింది.

ఆప్ ఓడిపోతే కేజ్రీవాల్ సహా ఇండియా కూటమిలోని మిగతా పక్షాలు కాంగ్రెస్ నేతృత్వంలో నడిచే అవకాశం ఉంది. ఢిల్లీ ఎన్నికల్లో ఖాతా తెరవకపోయినా ఆప్‌ను ఓడించాలనే విషయంలో మాత్రం కాంగ్రెస్ గెలిచినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, కాంగ్రెస్, ఆప్‌లు విడివిడిగా పోటీచేసి.. నష్టపోయాయి. ఇదే విషయాన్ని జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సైతం ఎత్తిచూపారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ.. మనం మనం కొట్టుకుంటే ఫలితాలు ఇలాగే ఉంటాయని రెండు పార్టీలకు చురకలు వేశారు.

## తాబేళ్ల కళేబరాల పోస్టుమార్టంపై వెటర్నరీ వైద్యులకు శిక్షణ

**చెన్నై-నవభూమి:** మృతిచెందిన తాబేళ్లకు పోస్టుమార్టం నిర్వహించడంపై వెటర్నరీ వైద్యులకు అటవీశాఖ నిపుణులు శిక్షణ ఇచ్చారు. సముద్రం నుంచి తాబేళ్లు తీరానికి చేరుకొని ఇసుకలో గుంతలు తవ్వి గుడ్లు పెట్టి వెళుతుంటాయి. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా సుమారు వెయ్యికి పైగా తాబేళ్లు మృతిచెంది తీరానికి కొట్టుకొచ్చాయి. తాబేళ్ల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించిన అటవీ శాఖ అధికారులు, వాటిని తీరంలోనే పూడ్చిపెడుతున్నారు.

ఈ నేపథ్యంలో వండలూరు జూ పార్క్(%గశీశ్రీఖుతీని%)లో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో తాబేళ్ల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించడంపై వెటర్నరీ వైద్యులకు శిక్షణ ఇచ్చారు. గాయపడిన తాబేళ్లకు చికిత్స, మృతిచెందిన వాటికి పోస్టుమార్టం నిర్వహించడం తదితరాలపై శిక్షణలో వివరించడంతో పాటు ప్రాక్టికల్‌గా చేసి చూపారు. ఈ శిక్షణలో సుమారు 25 మందికి పైగా వెటర్నరీ వైద్యులు పాల్గొన్నారు.

## కేజ్రీవాల్‌పై అన్నా హజారే సంచలన వ్యాఖ్యలు.. 'ఆప్' అందుకే ఓడిందంటూ..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం దిశగా దూసుకుపోతోంది. మొత్తం 70 స్థానాలు ఉండగా.. మెజారిటీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. అయితే ఈ క్రమంలో సమాజిక కార్యకర్త అన్నా హజారే.. ఆమ్ ఆద్మీ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికార దాహంతోనే మాజీ సీఎం కేజ్రీవాల్ ఓడిపోయారన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి.ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి ధన బలం, అధికార దాహమే కారణమని అన్నా హజారే అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో ఆరపణలు వస్తుంటాయని, అయితే ప్రజల ముందు వాటిని రుజువు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి ప్రవర్తన, ఆలోచనలు స్వచ్ఛంగా ఉండాలన్నారు.జీవితం మొత్తం ఎలాంటి నిందలు లేకుండా ఉండడంతో పాటూ త్యాగాలు చేసేలా ఉండాలని తెలిపారు. ఇలాంటి లక్షణాలు అభ్యర్థులపై ఓటర్లకు నమ్మకం కలిగిస్తాయన్నారు. మాజీ సీఎం కేజ్రీవాల్‌కు తాను ఈ విషయాలన్నీ చెప్పానని, కానీ ఆయన పట్టించుకోలేదని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌తో కేజ్రీవాల్ అప్రతిష్ఠపాలయ్యారన్నారు. ఇలాంటి తప్పులు చేయడం వల్లే ఆ పార్టీని ప్రజలు ఓడించారని తన మనసులోని మాటను బయటపెట్టారు.

## ట్రంప్ అమానుషం

తిక్కోడికి పెత్తనమిస్తే ఉన్న ఇంటి మొత్తాన్ని ఊడబెరికాడట! రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహార తీరు ఆ రీతిన సాగుతోంది. ఎడతెరిపి లేని ఏకపక్ష నిర్ణయాలతో స్వదేశంలోనూ, ప్రపంచ దేశాల్లోనూ ట్రంప్ సృష్టిస్తున్న ప్రకంపనలు చివరికి ఏ దరికి చేరతాయో, ఏ దారుణాలకు దారి తీస్తాయో చూడాలి! 'అమెరికా ఫస్ట్', 'అమెరికాకు పూర్వ వైభవం' వంటి వీరావేశ ప్రసంగాలతో గెలుపొందిన ట్రంప్ ఇతర దేశాలతో పేచీలకు దిగటమే పెద్ద అభివృద్ధి మార్గంగా ఎంచుకోవటం అహంభావపూరితమే కాదుబీ అర్థరహితం కూడా! ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధాలకు ఢంకా మోగించటం, దిగుమతి సుంకాల పెంపు పేరుతో బెదిరింపులకు దిగటం దిగుజారుడు చర్య తప్ప మరొకటి కాదు.

తగిన పత్రాలు లేని వలసదారుల గెంటివేత ద్వారా తాజాగా అమెరికా చేపట్టిన బహిష్కరణ పర్వం ఆ దేశ చరిత్రలోనే అతి పెద్దది. ఈ తంతుకు బలయ్యేవారిలో 7.25 లక్షల మంది భారతీయులు ఉండగా, ప్రస్తుతానికి 17,940 మందిని ఇండియాకు పంపటానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో 104 మందిని బేడీలు వేసి, అమెరికా సైనిక విమానం బుధవారం నాడు అమృతసర్‌లో దించిపోయింది! తమ పౌరులను సైనిక విమానంలో పంపటం భావ్యం కాదని కొలంబియా లాంటి చిన్న దేశం అభ్యంతరం చెప్పినా కానీ, మేరా భారత్ మహాన్ అని ఉపన్యాసాలు దంచే మోడీ గొంతు మాత్రం కనీసంగా కూడా పెగల్లేదు. పైగా, అక్రమ వలసలు కాబట్టి ఈ గెంటివేతను సగౌరవంగా స్వాగతిస్తున్నట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ ఘనంగా ప్రకటించారు. అమెరికా అమానవీయ వైఖరికి నిరసనగా ప్రతిపక్షాలు పార్లమెంటును స్తంభింపచేయడం భారత ప్రజల మనోభావాల వ్యక్తీకరణే! అమెరికా అదనపు సుంకాల విధింపుపై చైనా దీటుగా స్పందించింది. మెక్సికో మాట్లాడింది. ఇతర దేశాలూ నోరు విప్పాయి. ట్రంప్ తన తలతిక్క నిర్ణయాలతో మన దేశ ప్రయోజనాలకు చిల్లు పెడుతున్నా సరే, చిన్నపాటి స్పందన కూడా చూపనిది మన ప్రధాని మోడీనే.

ప్రపంచంలోని అత్యధిక సంపద అతికొద్దిమంది దగ్గరకి చేరిపోయి, అత్యధికులు రోజువారీ జీవనానికే నానా తంటాలు పడుతున్న సంక్షుభిత కాలం ఇది. అత్యధిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంపద పున:పంపిణీ విధానాలు చేపడితేనే ఆర్థిక సంక్షోభం నుంచి విముక్తి. కానీ, కార్పొరేట్ సంపన్నులు మరింత లాభపడే అపసవ్య విధానాలతోనే పెట్టుబడిదారీ పాలక వ్యవస్థ నడుస్తోంది. ఆ ఇనుప కాళ్ల కర్కశ నడకలో నలిగిపోయే అత్యధిక ప్రజల అసంతృప్తిని, ఆవేదననీ పక్కదోవ పట్టించటానికి పాలకపక్షాలు ఇతర దేశాలను, మతాలను బూచిగా చూపించే బూటకపు వైఖరిని అవలంబిస్తున్నాయి. ఇప్పుడు అమెరికా పనిగట్టుకొని చేస్తున్న ప్రయత్నం ఇదే! దీని అమల్లో విద్వేషం, విపరీత ప్రవర్తన పొటమరించిన ట్రంప్ దూకుడు మరింత ఎక్కువగా కనిపిస్తోంది. గాజాను స్వాధీనం చేసుకుంటామని, దానిని పునర్మిస్తామని ట్రంప్ చేసిన ప్రకటన అమెరికా ఆధిపత్య ధోరణికి ఆనవాలు. సాయం పేరుతో చొరబడి, సర్వ పెత్తనం చేస్తామన్న అహంకారం ఆ మాటల్లో ధ్వనించింది. దీనిపై గాజా, హమాస్ అభ్యంతరం వ్యక్తం చేయగా, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్వాగతగీతం పాడడం దురాక్రమణ బుద్ధికి నిదర్శనం. పాలస్తీనా విధ్వంసానికి కారకుడైన నెతన్యాహు ముక్కు పిండి, మూల్యాన్ని రాబట్టి గాజాను పునర్నిర్మించాలి. అలా కాక జోడు తోడేళ్లు మాదిరి కూడబలుక్కొని ట్రంప్, నెతన్యాహు ఒకరి ఉద్దేశాలకు ఒకరు వంత పాడడంలోనే వారి దుర్బుద్ధి బయటపడుతోంది. ఇలాంటి ఆధిపత్య అంగలకు కొద్ది మాత్రంగానైనా అడ్డు పడుతున్నాయనే ఐక్య రాజ్య సమితి అన్నా, ఇతర ప్రపంచ వేదికలన్నా యుద్ధోన్మాద ట్రంప్‌కి గుర్రు. బ్రిక్స్ దేశాలపైనా, ఐరోపా సమాఖ్య పైనా దిగుమతి సుంకాలు విధిస్తామన్న బెదిరింపు, కొన్ని దేశాలపై ఇప్పటికే విధించిన వైనమూ తన పీఠం కదిలిపోతుందన్న అమెరికా భయానికి నిదర్శనం. వాస్తవానికి ఏ దేశమైనా తనకు కావాల్సిన వస్తువులనే దిగుమతి చేసుకుంటుంది. వాటిపై విధించే సుంకాల వల్ల ధరలు పెరిగి ఆ భారం ఆ దేశ పౌరులపైనే పడుతుంది. సుంకాల పెంపు ఘట్టం తాత్కాలికంగా ఎగుమతి దేశాలకు కొంత నష్టం కలిగించినా- ఆ వాణిజ్య యుద్ధం కొనసాగింపులో అమెరికా శాశ్వత మూల్యం చెల్లించక తప్పదు! బ్రిక్స్, ఇయూ వంటి కూటములు బలపడడం ద్వారా అమెరికా దూకుడుకు, దుర్మార్గ బుద్ధికి కళ్లెం వేయటం ఇప్పటి చారిత్రిక అవసరం. ఆ కర్తవ్యంలో భారత్ తగినంత పాత్ర పోషించాలి.

# ఆధునిక భారతదేశ గాంధీ 'ఆమ్టే'



**ఫిబ్రవరి 9, బాబా ఆమ్టే వర్ధంతి సందర్భంగా..**

దీపావళి పండగ నాడు మిఠాయిలు, టపాసులు కొనుక్కోమని తన తల్లి ఇచ్చిన నాణేలతో దుకాణానికి పరిగెడుతున్న బాలుడికి 'ఈ అంధుడికి ఒక్కపైసా ఇవ్వండి భగవాన్' అన్న అంధుని ఆర్తనాదాలు చెవిన పడ్డాయి. ఆ బాలుడు తన దగ్గరున్న పెద్దమొత్తంలో ఉన్న నాణేలన్నీ ఆ బిచ్చగాడి డబ్బాలో వేయగా, ఆ బిచ్చగాడు ' నాకు చూపులేదని నాడబ్బాలో దయచేసి రాళ్ళు వేయొద్దు బాబు ! ' అన్నాడు. ఇవి రాళ్ళు కాదు నిజంగా డబ్బులే , కావాలంటే చేతితో తడిమి చూసుకో అన్న ఆ బాలుడు మాటలు విని బిచ్చగాడు తడిమి చూసి అవి నాణేలు అని తెలియగానే తన కళ్ళవెంట ఆనందభాష్పాలు రాల్చాడు ! ఆ సంఘటన చూసి బాలుడు ఏడుపు ఆపుకోలేక ఇంటికి పరిగెత్తి 'ఇలాంటి వారికోసం పెద్ద అయిన తరువాత ఏదైనా చేయాలి ' అని ఆ పసి హృదయంలో ముద్రించుకున్నాడు. ఆయన ఎవరో కాదు ! ఆయనే బాబా ఆమ్టే ! ఇప్పటి తరానికి ఈయన తెలికపోవచ్చు ! కానీ తెలియపర్చాల్సిన బాధ్యత మన మీద ఉంది.

**కుష్టు వ్యాధిపై యుద్ధం:**

బాబా ఆమ్టే అసలు పేరు మురళీధర్ దేవీదాస్ ఆమ్టే. ఆయన తల్లిదండ్రులు ముద్దుగా ' బాబా ' అని పిలిచేవారు. 26 డిసెంబర్ 1914లో మహారాష్ట్రలోని హింగన్‌ఘాట్‌లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబంలో జన్మించారు. ఆయన చిన్నప్పుడు చాలా విలాసవంతమైన జీవితంలో పెరిగారు. ఉన్నత కుటుంబంలో జన్మించి కూడా భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన అతని కృషి మరవలేనిది. బాహ్య ప్రపంచంలో ప్రజల బాధలను చూడకుండా ఉండటానికి ఏర్పాటు చేయబడిన భారీ అడ్డంకులకు వ్యతిరేకంగా అతను తిరుగుబాటు చేశారు.

కుష్టు వ్యాధిని ఒక వ్యాధిగా చికిత్స చేయడం చుట్టూ ఉండే అజ్ఞానాన్ని తొలగించడానికి అతను పోరాడారు. కుష్టు వ్యాధి అత్యంత అంటువ్యాధి అనే విస్తృతమైన భావనను తోసిపుచ్చే ప్రయత్నంలో అతను కుష్టురోగి నుండి బాసిల్లిని తనలోకి ఇంజెక్ట్ చేయడానికి కూడా అంగీకరించారు. కుష్టు వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల సంరక్షణ, చికిత్సకు ప్రాధాన్యత ఇచ్చి వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చారు. బాధితుల మధ్య నివసించారు. వారికి వైద్య సంరక్షణ లభించేలా చూసుకున్నారు. ఇది వారి వ్యాధి దుఃఖానికి ముగింపు పలికింది. చికిత్స పొంది కోలుకున్న రోగుల కోసం చిన్న తరహా హస్తకళల తయారీ, వృత్తి శిక్షణను ఏర్పాటు చేసి, వారు తయారు చేసిన వస్తువులను సేకరించి విక్రయించి వారికి ఆర్థిక స్వావలంబన కలిగించారు.


**మూడు ఆశ్రమాలు స్థాపన:**

మహారాష్ట్రలో కుష్టు రోగులు, దివ్యాంగులు, నిరుపేద సాధారణ ప్రజల సంరక్షణ, పునరావాసం కోసం మూడు ఆశ్రమాలను స్థాపించారు. 1949 ఆగస్టు 15న తన భార్య సాధన ఆమ్టేతో కలిసి ఆనందవన్లో ఒక చెట్టు కింద కుష్టువ్యాధి ఆసుపత్రిని స్థాపించారు. ఇది కుష్టు, ఆర్థోపెడిక్ వైకల్యాలు, దృష్టి, వినికిడి లోపాలు ఉన్నవారు, ఆదిమ గిరిజన సభ్యులతో సహా వేలాది మంది వెనుకబడిన వ్యక్తులు తమను తాము పోషించుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడింది. 1973లో గడ్చిరోలి జిల్లాలోని మాడియా గోండ్ గిరిజన ప్రజల కోసం ఆమ్టే లోక్ బిరాదరి ప్రకల్ప్‌ను స్థాపించారు.

**ఆధునిక భారతదేశ గాంధీ :**

బాబాఆమ్టే గాంధీజీ సిద్ధాంతాలను నమ్మి పూర్తిగా ఆచరించిన మహనీయుడు. గాంధీజీతో పరిచయమైన తరువాత అతనితో పాటు కొద్ది రోజులు సేవాగ్రామ్ ఆశ్రమంలో గడిపి గాంధీజీ శిష్యుడిగా మారి, ఆయన సిద్ధాంతాలను పూర్తిగా వంటపట్టించుకున్నారు. న్యాయ శాస్త్రంలో శిక్షణ పొందిన ఆయన భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో వలస ప్రభుత్వం ఖైదు చేసిన భారత నాయకులకు డిఫెన్స్ న్యాయవాదిగా పనిచేసారు. ఆ సమయంలోనే గాంధీజీ బాబాఆమ్టేకు అభయ సాధక్ అనే బిరుదు ఇచ్చారు. కుష్టురోగులకు భయపడక వారి సంక్షేమానికి ఇతను చేస్తున్న కృషి ఫలితమే ఆ బిరుదు. ఆ తరువాత బాబా ఆమ్టే సిద్ధాంతాలపై కూడా గాంధీజీ ప్రభావం చాలా పడింది. శేషజీవితం అణగారిన వర్గాల కొరకే గడపడమే కాకుండా, వస్త్రధారణలో ఖద్దరు బట్టలనే ధరించడం ఇత్యాది విషయాలలో ఆ ఇద్దరిలో సామ్యముంది. అంతేకాదు ఆశ్రమాల్లో గడుపుతూ పూర్తి శాకాహార భోజనం చేస్తూ జీవనం గడిపారు. స్వయంసమృద్ధి గ్రామాలు ఉండాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వ అవినీతి, అసమర్థత, నాసిరకం, దూరదృష్టితో కూడిన ప్రణాళికను ఎదుర్కోవడానికి ఆమ్టే గాంధీ మార్గాన్ని అనుసరించారు.

ఆయనను ఆధునిక భారతదేశ గాంధీ అని కూడా పిలుస్తారు.



**ఎన్నో పోరాటాలు ఆరాటాలు:**

బాబా ఆమ్టే ఇతర సామాజిక కారణ కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు. 1985లో ఆయన మొదటి నిట్ ఇండియా మిషన్ ఫర్ పీస్‌ను ప్రారంభించారు. 72 సంవత్సరాల వయసులో ఆయన కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 3000 మైళ్లకు పైగా నడిచి, భారతీయ ప్రజలలో ఐక్యతను ప్రేరేపించారు. మూడు సంవత్సరాల తరువాత అస్సాం నుండి గుజరాత్ వరకు 1800 మైళ్లకు పైగా ప్రయాణించి రెండవ మార్చ్ నిర్వహించారు. గాంధీజీ బ్రిటీష్ వారిపై అహింసా పోరాటం జరిపినట్లే మేధాపాట్కర్తో కలిసి,

నర్మదా నదిపై సర్దార్ సరోవర్ ఆనకట్ట నిర్మాణం కారణంగా స్థానిక నివాసితుల అన్యాయమైన స్థానభ్రంశం, పర్యావరణానికి జరిగిన నష్టానికి వ్యతిరేకంగా నర్మదా బచావో ఉద్యమంలో కూడా ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా అహింసాయుత పోరాటం కొనసాగించారు. అంతేకాక పర్యావరణ సామరస్యం, వన్యప్రాణుల సంరక్షణ విలువ గురించి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలతో సహా వివిధ సామాజిక సమస్యలకు ఆమ్టే తన జీవితాన్ని అంకితం చేశారు.

**ఆయన కుటుంబమూ అంతే :**

బాబా కుమారులైన వికాస్, ప్రకాష్ ఇద్దరూ కూడా తండ్రి వలె సమాజసేవకై పాటు పడుతున్నారు. ప్రకాష్ ఆమ్టే జీవన సహచరియైన మందాకిని ఆమ్టేతో కలపి సంయుక్తంగా 2008లో రామన్ మెగసెసే అవార్డు పొందారు.

**అనేక అవార్డులు:**


ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన ఆయన కృషి మరవలేనిది. అనేక దశాబ్దాల పాటు దీనజన ప్రజల కోసం కృషిసల్పిన బాబా ఆమ్టేకు అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. అవార్డులతో పాటు లభించిన నగదును సాంఘిక కార్యకలాపాల కోసమే వినియోగించారు. ఆయన చేసిన సేవలుకు గాను 1971లో పద్మశ్రీ, 1985లో రామన్ మెగ్సేసే, 1986లో భారత పద్మవిభూషణ్, 1999లో గాంధీ శాంతి బహుమతి అవార్డులు బహుకరించబడ్డాయి.

**కీర్తి శేషులు:**

2008 ఫిబ్రవరి 9 ఉదయం 4.15 గంటలకు తన ఆశ్రమం ఆనంద్‌వన్‌లో బాబా ఆమ్టే శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన అడుగుజాడల్లో మనమందరం పయణించాలి.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

# వర్సీటీల ప్రమాణాల్ని దిగజార్చే నిర్ణయాలు




ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మానవవనరుల అభివృద్ధిలో కీలకభూమిక పోషించవలసిన అవసరం ఉంది. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో ఉన్నత విద్యారంగం అధోగతిపాల్కైన సంగతి ప్రజానీకానికి తెలిసిందే. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఉన్నత విద్యారంగం పటిష్టంగా అవతరిస్తుందని మొత్తంగా మేధోవర్గం ఆశించింది. అయితే నూతన విద్యావిధానంతో వచ్చిన సంస్కరణలు గందరగోళం సృష్టించగా, యూజీసీ మార్గదర్శకాలు-2025 మరింత వివాదాస్పదంగా మారాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు కూడా అధ్యాపక, ఉద్యోగ వర్గాల్లో, విద్యార్థి సంఘాల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి.

రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లోని సీనియర్ ఆచార్యుల్ని పక్కనబెట్టి సాంప్రదాయ విశ్వవిద్యాలయాలకు ఐఐటీల నుంచి, ఎన్ఐటీల నుంచి ఉపకులపతుల్ని నియమించే దిశగా సెర్చ్ కమిటీల సిఫారసులు జరుగుతుండటం దిగ్భ్రాంతికరం. సాంకేతిక నిపుణుల్ని ఉపకులపతులుగా తీసుకొచ్చే ప్రయత్నంలో ప్రభుత్వం తలమునకలు కావడం రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఆచార్యుల్ని ఆందోళనకు గురిచేస్తున్నది. సామాజిక శాస్త్రాలు, భాషా సాహిత్యాలు, చిత్రకళలు, ప్రదర్శనకళలు, న్యాయశాస్త్రం, విద్యాబోధన కళాశాలలు, కామర్స్, మేనేజ్‌మెంట్, పరిశోధన కేంద్రాలు, దూరవిద్య కేంద్రాలు, క్రీడలు, వ్యాయమవిద్య విభాగాలు వంటి సమస్త మానవశాస్త్రాలు గల రాష్ట్ర విశ్వవిద్యాలయాల విషయంలో ప్రభుత్వ తీసుకుంటున్న ఈ నిర్ణయం సరైనది కాదు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్ని ప్రక్షాళన చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు ఐఐటీ, ఎన్ఐటీ ఆచార్యుల్ని ఉపకులపతులుగా నియమించడం ఒక్కటే పరిష్కారం కాదు. విశ్వవిద్యాలయాలు అంటే కేవలం ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే కాదు, ఇక్కడ సకలశాస్త్రాలు వుంటాయి.

వీటికి తోడు రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించే యూజీసీ - 2025 ముసాయిదా పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధమైన ఈ నిర్ణయం రాష్ట్ర విశ్వవిద్యాలయాల మీద జరుగుతున్న పెద్ద కుట్రగా మేధోవర్గం పేర్కొంటుంది. యూజీసీ మార్గదర్శకాలు-2025తో విశ్వవిద్యాలయాల్లో నియామకాలు, పదోన్నతుల్లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. జాతీయ విద్యావిధానం సిఫార్సు మేరకు కాలానుగుణంగా ఉన్నతవిద్యలో సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అయితే రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక సిబ్బంది కొరత తీవ్రలోటుగా వుంది. దేశ ఉజ్వల భవిత కోసం ప్రతిభ గల అధ్యాపకుల్ని నియమించి యువతను తీర్చిదిద్దాలని యూజీసీ సిఫార్సు చేసింది. ఇందుకు రాష్ట్ర విశ్వవిద్యాలయాలు చొరవ తీసుకోలేకపోతున్నాయి. 2008 నుంచి ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలకు 2017లో చంద్రబాబునాయుడు నాయకత్వంలోని అప్పటి ప్రభుత్వం రెండు ప్రకటనలు ఇచ్చి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించింది. ఇవి న్యాయస్థానాల్లో కేసుల కారణంగా భర్తీ చేయలేకపోయింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2024 ఎన్నికలకు ఆరు నెలల ముందు అస్తవ్యస్తంగా ఒక ప్రకటన విడుదల చేసి నిరుద్యోగుల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టి దుకాణం బంద్ చేసింది. చెదురుమదురుగా ప్రత్యామ్నాయదారుల్లో అక్కడక్కడా వచ్చిన ఏక సంఖ్య అధ్యాపకులు మినహా సుమారు పదిహేడేళ్ళ నుంచి ఏపీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక ఉద్యోగాల భర్తీ జరగలేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఆలోచన చేయకుండా పదిమంది చేసే పనిని ఒక్కరి మీదకే నెట్టి, విశ్వవిద్యాలయాలు ర్యాంకులు సాధించాలంటే సాధ్యం కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ టు బి యూనివర్శిటీల నుంచి ఆచార్యులను రాష్ట్ర విశ్వవిద్యాలయాల నియామకాల సెర్చ్ కమిటీల్లో సభ్యులుగా నియమించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఆచార్యులు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు సెర్చ్ కమిటీ సభ్యులుగా వుండి ఉపకులపతుల్ని ఎంపిక చేస్తారా! ఇదేమి వింత సంప్రదాయం! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులే ఎక్కువశాతం మంది ప్రవేశిస్తున్నారు. వీరిలో తెలుగు మీడియం విద్యార్థులే అధికశాతం మంది ఉన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్నవారి శాతమే ఎక్కువ. వీరు ఉపకారవేతనాలతో చదువులు కొనసాగిస్తున్నారు. యూజీసీ, ఇతర ఫండింగ్ ఏజెన్సీల స్కాలర్‌షిప్పులు, ఫెలోషిప్‌లతో చదువులు, పరిశోధనలు కొనసాగించేవారి సంఖ్య నామమాత్రమే. అంతేగాకుండా రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వాలు సమకూర్చే మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే. ఇన్ని అడ్డంకులను అధిగమించి ఏపీ విశ్వవిద్యాలయాల్ని ప్రగతిపథంలో నడిపించాలంటే ప్రభుత్వం మేధావుల సూచనలను పరిగణలోకి తీసుకొని అమలు చేయాలి. అప్పుడే ప్రజలూ, ప్రభుత్వ ఆకాంక్షలు నెరవేరుతాయి.

## భక్తి

## స్థిరమైన బుద్ధి




మన జీవిత ప్రయాణంలో మనం ఎన్నో విషయాలను వింటూ ఉంటాం. వాటిలో ఒకే అంశం గురించి విరుద్ధమైన అభిప్రాయాలు ఉంటాయి. ఇది మనకు కలవరపాటు కలిగిస్తాయి. వార్తలు కావచ్చు, ఇతరుల అనుభవాలు కావచ్చు, నమ్మకాలు కావచ్చు. వాటి మీద వివిధ అభిప్రాయాలు, వాదనలు విన్నప్పుడు కూడా మన బుద్ధి స్థిరంగా ఉన్నప్పుడే అత్యున్నతమైన యోగ స్థితిని పొందుతామని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు బోధించాడు. దీనిలోని అంతరార్థాన్ని అవగాహన చేసుకోవడానికి చెట్టు సరైన ఉదాహరణ. చెట్టు పైభాగం మనకు కనిపిస్తుంది. దాని కింది భాగం వేర్ల మూల వ్యవస్థతో కూడి ఉంటుంది. అది బయటకు కనిపించదు. పైభాగం తీవ్రమైన గాలులకు ఊగుతూ ఉంటుంది. కానీ దానివల్ల వేర్ల వ్యవస్థ ప్రభావితం కాదు. ఎగువ భాగం బాహ్య శక్తుల ప్రభావంతో ఊగిపోతూ ఉంటే... దిగువ భాగం నిశ్చలంగా, సమాధి స్థితిలో ఉన్నట్టు ఉంటుంది. అది స్థిరంగా ఉడడంతోపాటు మొత్తం చెట్టుకు పోషకాహారాన్ని అందించే బాధ్యతను నిర్వహిస్తుంది. బాహ్యభాగం ఊగిసలాడుతూ... అంతర్గతంగా నిశ్చలంగా ఉండడమే చెట్టుకు యోగ స్థితి. అజ్ఞాన స్థితిలో ఉన్నప్పుడు మన బుద్ధి చంచలంగా ఉంటుంది. అది బయటి విషయాల ప్రభావానికి గురై దానంతట అదే ఊగిసలాడుతూ ఉంటుంది. తాత్కాలికమైన స్పందనలు, ఉద్వేగాలు, కోపాల రూపంలో ఈ ఊగిసలాట మన నుంచి బయటకు వస్తుంది. మన జీవితాలను సమస్యాత్మకం చేస్తుంది. మన వ్యక్తిగత జీవితాలనే కాదు, మన కుటుంబ సభ్యుల జీవితాలను, మనం పని చేసే చోట తోటి వారి జీవితాలను కూడా ఇది సమస్యాత్మకంగా మారుస్తుంది. కొందరు ఈ ఊగిసలాటను అణచివెయ్యడం కోసం ముఖానికి ఒక ముసుగు తొడుక్కుంటారు. అందరిముందూ ధైర్యంగా, ఆహ్లాదంగా ఉన్నట్టు ప్రవర్తిస్తారు. కానీ ఇది ఎక్కువకాలం సాగదు. ఈ బాహ్యమైన ఊగిసలాటలు అనిత్యమైనవని తెలుసుకొని... నిశ్చలంగా ఉన్న అంతరాత్మను చేరుకోవడమే దీనికి పరిష్కారమని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు.

## కళ్ల కింద నలుపు తగ్గాలంటే...



రాత్రి పడుకునేముందు రెండు చెంచాల ఆలివ్ నూనెని కొద్దిగా వేడి చేసి కళ్ల చుట్టూ రాయాలి. వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే కళ్ల చుట్టూ రక్త ప్రసరణ మెరుగై నలుపుదనం తగ్గుతుంది.ఒక చెంచా శనగపిండిలో రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల కింద రాసి పది నిమిషాలు ఆరిన తరవాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తే నల్లని వలయాలు తొలగిపోతాయి.కలబంద గుజ్జును తీసుకుని చల్లని నీళ్లలో ముంచి దానిని కళ్ల చుట్టూ పట్టించాలి. పదిహేను నిమిషాల తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారం రోజులు చేస్తే ఫలితం కనిపిస్తుందిరెండు చెంచాల బియ్యం పిండిలో మూడు చెంచాల నీళ్లు పోసి ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ పరచాలి. ఇరవై నిమిషాలు ఆరిన తరవాత నీళ్లతో శుభ్రం చేసుకుంటే చాలు.అరకప్పు టమాటా రసంలో రెండు చెంచాల శనగపిండి కలపాలి. ఈ మిశ్రమంతో కళ్ల కింద మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకుంటే ప్రయోజనం కనిపిస్తుంది.రాత్రి పడుకునేముందు కళ్ల కింద కొబ్బరి నూనె రాసుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే సమస్య తగ్గుతుంది.

# పడిలేచిన కెరటం



దాదాపు ఏడాదిన్నర కిందట... యూఎస్ ఓపెన్ సెమీఫైనల్. అవతలివైపు రెండో సీడ్ అరినా సబలెంక. పదిహేడో సీడ్‌గా బరిలోకి దిగిన మాడిసన్ కీస్... అంచనాలను తలకిందులు చేస్తూ తొలి సెట్‌ను ఏకపక్షంగా గెలుచుకుంది. రెండో సెట్... ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా తట్టుకొని... 5-4తో ముందుకు సాగింది. ఇంకొక్క గేమ్! గెలిస్తే ఫైనల్స్ బెర్త్. కీస్... సర్వీస్. స్టేడియం అంతా ఊపిరి బిగబట్టి వీక్షిస్తోంది. ఇంతలో ఊహించని మలుపు. సబలెంక మెరుపు దాడికి కీస్ కుదేలైంది. టైబ్రేకర్‌తో ఆ సెట్‌నే కాదు... తరువాతి సెట్‌ను కూడా ప్రత్యర్థికి కోల్పోయి... చేతులోకి వచ్చిన మ్యాచ్‌ను చేజార్చుకుంది కీస్. ఆటలో సరిజోడీగా పోటీపడినా... కీలక సమయంలో ఒత్తిడికి తల వంచింది. కానీ ఆ పరాజయం ఆమెలో మరింత కసి పెంచింది. విజయానికి దాన్ని ఒక సోపానంగా భావించింది. ‘ఈ మ్యాచ్‌ను సానుకూలంగా తీసుకొంటే ఓటమిని గెలుపుగా మలచడం అసాధ్యమేమీ కాదు’ అంటూ నాడు మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైంది కీస్. చెప్పినట్టే సరిగ్గా 16 నెలలు తిరక్కుండానే ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలుచుకుంది. ఫైనల్లో డబుల్ డిఫెండింగ్ చాంపియన్, నెంబర్ వన్ సీడ్... సబలెంకాను ఓడించి కొత్త ఏడాది అద్భుత ఆరంభాన్ని అందుకుంది.

ఓటమి కొత్తకాదు...వాస్తవానికి అంతిమ సమరంలో తడబడడం కీస్‌కు కొత్తేమీ కాదు. ఏడేళ్ల కిందట 2017లో కూడా యూఎస్ ఓపెన్ ఫైనల్ దాకా వచ్చి, టైటిల్ చేజార్చుకుంది. కెరీర్‌లో పది టైటిల్స్ సాధించిన ఆమె... గ్రాండ్‌స్లామ్ పోటీలకు వచ్చేసరికి తీవ్ర ఒత్తిడికి లోనవుతుంది. ఇదే ఆఖరి నిమిషంలో గెలుపును దూరం చేస్తోంది. దీని నుంచి బయటపడడానికి ఎంతోమంది మానసిక నిపుణులను సంప్రతించింది. వారి సూచనలతో ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ అదే పరిస్థితి. భర్త, కోచ్ బిజోర్న్ ఫ్రాటాంజెలో నేతృత్వంలో పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకొని, శారీరకంగా, మానసికంగా తనను తాను మార్చుకోవాలని నిశ్చయించుకుంది. అప్పటివరకు పొట్టి హ్యాండిల్ ఉన్న విల్సన్ రాకెట్‌తో ఆడిన ఆమె... కాస్త పొడుగు హ్యాండిల్ గల యోనెక్స్ రాకెట్‌ను పట్టుకుంది. గత సీజన్‌లో సగానికిపైగా మ్యాచ్‌లను దానికి అవాటుపడటానికి కేటాయించింది. స్పోర్ట్స్ సైకాలజిస్టును కలిసి మానసికంగా తాను ఎదుర్కొంటున్న సమస్యలను అతడి ముందు పెట్టింది.

ఆత్మసమీక్ష చేసుకొని...‘గతంలో ఎన్నో స్పోర్ట్స్ థెరపీలు తీసుకున్నా. అవన్నీ ఆట నుంచి దృష్టి మరలకుండా మనల్ని మనం నియంత్రించుకోగలగడం గురించి. అయితే దానికన్నా ప్రస్తుతం అనుసరిస్తున్న థెరపీ మరింత మెరుగైన ఫలితాలను ఇస్తోంది. ఇందులో నా గురించి నేను ఏమనుకొంటున్నాను? నా పట్ల నేను ఎంత నిజాయతీగా ఉన్నాను? అనేది తెలుసుకోగలగడం ప్రధానం. నిజంగా ఇది చాలా కష్టం. ఎందుకంటే మానసిక ఆందోళనకు గురవుతున్నాననే విషయం నేను చాలా రోజులు అంగీకరించలేకపోయాను. నిజాయతీగా ఆత్మసమీక్ష చేసుకున్నాక నా దృక్పథంలో మార్పు వచ్చింది. సన్నిహితులతో కూడా ఈ విషయాలపై దాపరికం లేకుండా చర్చించడం మొదలుపెట్టాను’ అంటున్న కీస్‌లో ఇప్పుడు మైదానంలో మునుపెన్నడూ లేనంతగా ఆత్మవిశ్వాసంతో దూసుకుపోతోంది.

ఫెదరర్ స్ఫూర్తితో...ఇలినాయిసలోని రాక్ ఐలాండ్‌లో పుట్టిన కీస్... టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌కు వీరాభిమాని. అతడి స్ఫూర్తితోనే ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా ఎదిగింది. టీవీలో వింబుల్డన్ చూస్తూ ఆటపై మక్కువ పెంచుకున్న ఆమె... నాలుగేళ్ల వయసులోనే టెన్నిస్ కోర్టులోకి అడుగుపెట్టింది. ఆమె తండ్రి రిక్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు. నలుగురు కూతుళ్లలో రెండో సంతానం కీస్. ‘క్రిస్ ఎవర్ట్ టెన్నిస్ అకాడమీ’లో శిక్షణ పొందింది. ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా 2009లో కెరీర్‌ను ప్రారంభించి, ఏడాది తిరక్కుండానే తొలి ఐటీఎఫ్ టైటిల్ సాధించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచింది. 2017 యూఎస్ గ్రాండ్‌స్లామ్‌లో ఫైనల్స్‌కు చేరి అందర్నీ ఆశ్చర్చపరిచింది. రెండేళ్ల తరువాత సిన్సినాటీ టైటిల్ నెగ్గిన ఆమె... ఆ తరువాత మరింత దూకుడు పెంచింది. 2023లో ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్10లో స్థానం సంపాదించింది. అప్పటి నుంచీ అద్భుతమైన ఫామ్‌తో అదరగొడుతూ... ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగుపెట్టింది. గతవారం ముగిసిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కీస్ ఆట మరో స్థాయిలో ఉందనేది మాజీల మాట. మూడో రౌండ్‌లో పదో సీడ్ కొలిన్స్‌ను ఇంటి దారి పట్టించిన ఆమె... నాలుగో రౌండ్‌లో ఆరో సీడ్ ఎలెనా రిబికినాను ఓడించింది. సెమీసలో రెండో సీడ్, పోలండ్ స్టార్ ఇగా స్వియటెక్‌పై గెలిచి, తుది పోరులో టాప్‌సీడ్ సబలెంకాను ఓడించి, కెరీర్‌లో మొట్టమొదటి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడింది. తొలి,, రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ మధ్య దాదాపు ఎనిమిదేళ్ల విరామం ఉంది. గ్రాండ్‌స్లామ్ చరిత్రలో ఇదే సుదీర్ఘ విరామం. అంతేకాదు... పెనెట్టా (49), బర్తోలి (47) తరువాత అత్యంత పెద్ద వయసులో గ్రాండ్‌స్లామ్ సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది.

**గాయాలు వేధించినా...**

గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భుజం గాయంతో ఇబ్బంది పడిన కీస్, ఆ తరువాత తొడ కండరాల సమస్యతో వింబుల్డన్ నాలుగో రౌండ్ నుంచే నిష్క్రమించింది. ముఖ్యమైన టోర్నీల్లో గాయాలు వేధించినా, మధ్యలోనే తప్పుకోవాల్సిన పరిస్థితులు ఎదురైనా ఆమె దిగులు పడలేదు. అలాంటి క్లిష్ట సమయంలో భర్త అండతో... అతడి మార్గదర్శకత్వంలో గాయాల నుంచి కోలుకుంది. రెట్టించిన ఉత్సాహంతో తిరిగి బరిలోకి దిగింది. ఇప్పుడు టెన్నిస్ కోర్టులో పాదరసంలా కదులుతూ ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అత్యంత కీలక దశల్లో ఒత్తిడిని జయించి విజృంభిస్తోంది.

# మాయలో మైమరచిపోవద్దు



మన అందరి కలా ఒక్కటే. జీవితం సుఖ సంతోషాలతో సాగిపోవాలన్నదే మనందరికీ ఉన్న అతి సరళమైన వాంఛ. కానీ ఈ చిన్న విషయాన్ని అందరూ ఎంతో సులువుగా మరచిపోతున్నారు. మనం బాగా చదువుకుంటే పెద్దయ్యాక బాగా డబ్బు సంపాదించవచ్చని ఎంతో మంది పెద్దలు మనకు చిన్నతనం నుంచి బాగా నూరిపోస్తారు. ఆ ధోరణితోనే మనం పెరిగి పెద్దవుతాం. అదే మనకు మహా మంత్రంలా మారిపోతుంది. ‘ఇది చేయాలి, అది చేయాలి, ఏదో చేయాలి’ అని పరితపిస్తూ ఉంటాం. కానీ మనం తప్పనిసరిగా నెరవేర్చుకోవాల్సిన కల ఏమిటి? మనం గమనించి నట్ట యితే... వాస్తవానికి మన అందరి కలా ఒక్కటే. జీవితం సుఖ సంతోషాలతో సాగిపోవా లన్నదే మనందరికీ ఉన్న అతి సరళమైన వాంఛ. కానీ ఈ చిన్న విషయాన్ని అందరూ ఎంతో సులువుగా మరచిపో తున్నారు. శాంతి కొరవడితే... అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే – మనం లోలోపల సంతృప్తిగా ఉన్నట్టయితే, ఏ విషయంలోనూ గొడవపడం. అంటే, మనిషికి మౌలిక అవసరాలు తీరడం ముఖ్యం. అవే తీరని స్థితిలో ఉంటే మనిషికి తాను పేదవాణ్ణనే భావన కలుగుతుంది. ఆఫ్రికాలో నేనొక విషయం గమనించాను. అక్కడ కొంతమంది చిన్న పిల్లలు... వాళ్ళ కాళ్ళకు చెప్పులు ఉండవు. చిరిగిన దుస్తులతో, చింపిరి జుత్తుతో కనిపిస్తారు. కానీ ఒక సైకిల్ చక్రం తీసుకొని, దానితో హాయిగా నవ్వుతూ ఆడుకుంటున్నప్పుడు... వాళ్ళ ముఖాలలో కనిపించే చిరునవ్వు చూస్తుంటే ఎంతో ముచ్చటేస్తుంది. మనిషి మౌలిక అవసరాలు తీరితే ఆనందంగా ఉండగలడు. అదే కడుపులో ఆకలి వేధిస్తూ ఉంటే చిరునవ్వు కనిపించదు. కేవలం కన్నీళ్ళు మాత్రమే కనిపిస్తాయి. మనం చూస్తున్నవన్నీ కేవలం మనం సృష్టించుకున్నవే. ఎవరైనా తమనితాము నిరుపేదలుగా భావించుకుంటూ ఉంటే... అందుకు కారణం కూడా మనిషేనని గుర్తించాలి. ఈ విషయాలను మనం అర్థం చేసుకోకపోతే ముందుకి సాగలేం. సమాజం అనే అమరిక విచ్ఛిన్నమవుతుంది. ఈనాడు జరుగుతున్నది అదే కదా! దాన్ని ఏకం చేసి పట్టి ఉంచగలిగేది కేవలం శాంతి మాత్రమే. మన జీవితాల్లో శాంతి కొరవడితే... ప్రతిదీ ఛిన్నాభిన్నం అవుతుంది. కుటుంబాలు, మనుషులు ఛిన్నాభిన్నం అవుతారు.

వాటి విలువ గుర్తించండి...‘తనని తాను తెలుసుకోవడం’ అనేది ఎంతో ప్రధానం. ఎలా తెలుసుకున్నప్పుడు మాత్రమే మీలో దయాగుణం కూడా నిండి ఉందని గుర్తిస్తారు. మనల్ని మనం తెలుసుకోలేనప్పుడు... మన దగ్గర ఉన్న వాటి గురించి కూడా తెలుసుకోలేం. మీలో జ్ఞానం ఉంది, చీకటిని పారద్రోలగలిగే ప్రకాశం మీ హృదయంలో ఉంది. మీకు కావలసినవన్నీ మీలోనే ఉన్నాయి. కానీ ఒకవేళ మిమ్మల్ని మీరు తెలుసుకోలేకపోతే... మీ దగ్గర ఉన్నవాటిని కూడా మీరు తెలుసుకోలేరు. కాబట్టి అన్నిటికన్నా ముందు ‘నిన్ను నువ్వు తెలుసుకో’! మీలో ఉన్న సద్గుణాలను గుర్తించి, మీ జీవితాల్లో ముందడుగు వేయండి. ఏది ఏమైనా ఈ ప్రాపంచిక మాయలో పడి మైమరచిపోవద్దు. మీలోంచి వస్తున్న శ్వాస వేరెవరిదో కాదు... అది మీదే. అందులో దాగి ఉన్న ఆనందం కూడా వేరెవరిదో కాదు, మీ ఆనందమే. వీటన్నిటి విలువను గుర్తించండి.

# కోటి మంది కుటుంబం

ముగ్గురు పిల్లల ఆలనా పాలనా చూసుకొంటూ, గృహిణిగా బాధ్యత లు నిర్వర్తిస్తూ... ఏ కార్పొరేట్ కొలువుకూ తీసిపోనంతగా సంపాది స్తోంది కొమ్ముల సౌమ్యారెడ్డి ఉరఫ్ సౌమ్య. స్వతంత్రంగా ఎదగాలన్న పట్టుదల... తనకంటూ గుర్తింపు తెచ్చుకొని... గృహిణులకు స్ఫూర్తిమంత్రం కావాలన్న తపన... ఇవే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. ‘వి5 ఫ్యామిలీ షో’ యూట్యూబ్ చానల్ నెలకొల్పి... రెండేళ్లలో కోటిమంది సబ్‌స్క్రైబర్స్‌ను సంపాదించుకున్న సౌమ్య కథ ఇది.

“ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీజీ చేశాను. ఇష్టపడి చదివి ఇంట్లో కూర్చోవడం... అదీ ఒక సాధారణ గృహిణిగా మిగిలిపోవడం... నాకు అస్సలు నచ్చలేదు. తలుచుకున్నప్పుడల్లా ఒకటే దిగులు. నాకంటూ ఒక గుర్తింపు లేదనే బాధ. ఏదో వెలితిగా ఉండేది. కుటుంబ బాధ్యతల నేపథ్యంలో బయటకు వెళ్లి ఉద్యోగం చేసే అవకాశం లేదు. మరి ఎలా? పిల్లల్ని చూసుకొంటూ, ఇంట్లో నుంచే ఏదైనా చెయ్యాలని అనుకున్నాను. అలా ఆలోచిస్తుంటే తట్టిందే యూట్యూబ్. అయితే చానల్ ఎలా ప్రారంభించాలనేది నాకు తెలియదు. ఇంటర్నెట్‌లో వెతికాను. చాలా విషయాలపై అవగాహన వచ్చింది. చివరకు 2018లో ‘వి5 ఫ్యామిలీ షో-తెలుగు’ పేరిట యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. ఈ నేపథ్యంలో ఒక రోజు పేపర్‌లో వచ్చిన ఓ యూట్యూబర్ ఇంటర్వ్యూ నన్ను బాగా ఆకట్టుకుంది. ఒక తల్లి ఆడుకొంటున్న తన పిల్లల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టిందని, తరువాత అదే ఆమెకు ఆదాయ వనరుగా మారిందనేది దాని సారాంశం. ఆ స్ఫూర్తితో నా ముగ్గురు పిల్లల ఆటపాటలను కంటెంట్‌గా తీసుకుందామని అనుకున్నా. కానీ వాళ్ల వీడియోలు పెడతానంటే... ‘ఇబ్బందులు ఏవైనా ఎదురవుతాయేమో’ అని మావారు సందేహం వ్యక్తం చేశారు. దాంతో మళ్లీ ఆలోచనలో పడ్డాను. తరువాత రకరకాల రూబిక్ క్యూబ్స్‌ను ఎలా పరిష్కరించాలో చెబుతూ చిన్న చిన్న చిట్కాలతో వీడియో ఒకటి అప్‌లోడ్ చేశాను. అందరికంటే నేను బాగా వివరించి చెబుతున్నానని, నా వీడియోల కోసం పిల్లలు వేచి చూస్తున్నారని... ఇలా చాలామంది కామెంట్లలో రాశారు. అవి నాకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి.

**పిల్లల్ని చూసుకొంటూనే...**

నా వీడియోలకు మంచి కామెంట్స్ అయితే వచ్చాయి కానీ అనుకున్నంత ఆదరణ లభించలేదు. ఒకరోజు యూట్యూబ్‌లో సాయి రమేష్ ఇంటర్వ్యూ ఒకటి చూశాను. ఆయన్ను కలిశాక ఎలాంటి కంటెంట్ పెట్టాలనేదానిపై అవగాహన వచ్చింది. అప్పుడు మా పిల్లలు చాలా చిన్నవారు. వాళ్లు బడికి వెళ్లడం మొదలయ్యాక చానల్‌పై పూర్తి శ్రద్ధ పెడదామని అనుకున్నా. అదే సమయంలో కరోనా వచ్చింది. రెండేళ్ల విరామం తరువాత 2023 ఫిబ్రవరిలో కొత్త చానల్ ప్రారంభించాను. పాత చానల్ పేరులో ‘తెలుగు’ తీసేసి ‘వి5 ఫ్యామిలీ షో’ అని పెట్టుకున్నా.

ఇంట్లో జరిగే ఘటనలే...నా కంటెంట్‌లో ఎక్కువగా ఇంట్లో అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు, కుటుంబంలో కనిపించే భావోద్వేగాలు, నీతి కథలతో పాటు పిల్లలకు వండిపెట్టే వంటలకు సంబంధించిన అంశాలు ఉంటాయి. అంటే ఇంట్లో నిత్యం జరిగే ఘటనలనే ఒక చిన్న వీడియోలో సరదాగా చూపించే ప్రయత్నం. తద్వారా చిన్నారులకు ఈ సమాజం గురించి, మానవ సంబంధాలు, విలువల గురించి తెలియజెప్ప డం నా ఉద్దేశం. నాకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడి పేరు కృష్ణప్రీతమ్. ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. చిన్నోడు సౌర్యనందన్ ఐదు, పాప... దియా 2వ తరగతిలో ఉన్నారు. మావారు వెంకట్‌రెడ్డి ట్యాక్స్ కన్సల్టెంట్. సొంత వ్యాపారం నిర్వహిస్తున్నారు. మా కంటెంట్‌లో మా పిల్లలు, నేను, మావారితో పాటు మా అత్తమ్మ, అమ్మ కూడా కనిపిస్తుంటారు.



**కోటి దాటింది...**

యూట్యూబ్‌లో మా కంటెంట్ సూపర్ హిట్ అయింది. చానల్ ప్రారంభించి ఇంకా రెండేళ్లు పూర్తి కాలేదు. కానీ సబ్‌స్క్రైబర్స్ సంఖ్య కోటి దాటింది. ప్రస్తుతం మా చానల్‌కు 10.4 మిలియన్లమంది సబ్‌స్క్రైబ్ చేశారు. రోజుకు దాదాపు ముప్ఫై వేల మంది కొత్తవారు వస్తున్నారు. వరుసగా ఐదారు రోజులు మంచి వీడియోలు పడితే సబ్‌స్క్రైబర్స్ కూడా పెరుగుతారు. ఇప్పటివరకు 800కు పైగా వీడియోలు అప్‌లోడ్ చేశాను. నేను పెట్టిన ‘ఈజీ గణేష్ డ్రాయింగ్’ వీడియోను అత్యధికంగా నాలుగు కోట్లమందికి పైగా చూశారు. గణేష్ డ్రాయింగ్‌ను సులువుగా ఎలా వేయాలో అందులో చూపించాను. డ్రాయింగ్, డ్యాన్సింగ్, పేరెంటింగ్, పిల్లల హ్యాండ్ రైటింగ్... ఇలా ఎన్నో విషయాలు యూట్యూబ్‌లో చెబుతుంటాను. ఇంకో విశేషమేమంటే... మా చానల్‌ను రోజుకు దాదాపు మూడు కోట్ల మంది వీక్షిస్తారు. భారత్‌లోని టాప్600 యూట్యూబ్ చానల్స్‌లో మాది ఒకటి.

**మా స్టార్ తనే...**

మా చానల్ విజయవంతం కావడానికి ప్రధాన కారణం విభిన్నమైన కంటెంట్. అలాగే మా అమ్మాయి. తనకు అభిమానులు ఎక్కువ. మాలో స్టార్ తనే. ఇక మా షార్ట్ వీడియోల్లో మాటలు ఉండవు. నటనతోనే కథ చెబుతాను. అందుకే సబ్‌స్క్రైబర్స్‌లో తెలుగువారే కాకుండా ఇతర దేశాలవారు కూడా ఉన్నారు. షూటింగ్, ఎడిటింగ్, టైటిలింగ్ తదితర పనులన్నీ నేనే చేసుకొంటాను. ఎక్కువ భాగం మొబైల్‌తోనే షూట్ చేస్తాం. ఇక్కడ మన ఆలోచనలు, సృజనాత్మకతే పెట్టుబడి. యూట్యూబ్ చానల్ పెట్టాలనుకున్న మహిళలకు నేను చెప్పేది ఏంటంటే... మన నైపుణ్యం ఏంటో మనం తెలుసుకోవాలి. దానికి పదును పెట్టి,విభిన్నంగా, వినూత్నంగా ఆలోచించాలి. అప్పుడే మంచి కంటెంట్ వస్తుంది.

**అదే అతిపెద్ద సవాలు...**

మా పిల్లలు చదువులోనూ, ఆటల్లోనూ ఫస్టే. వీడియోల్లో నటించినంతమాత్రాన వాళ్ల చదువు పాడైపోతుందని కొందరు అనుకొంటారు. అలాంటిదేమీ లేదు. రోజుకు ఒక గంట వారు దీనికి కేటాయిస్తారు. ఆటలు, చదువులో వాళ్లు సాధిం చిన మెడల్స్, సర్టిఫికెట్లు అన్నీ మా చానల్‌లో చూపిస్తుం టాను. అన్నం తిన్నా తినకపోయినా... నిద్రపోయినా పోకపోయినా రోజూ ఒక వీడియో పెట్టాల్సిందే. మా చానల్ ఇంత వేగంగా అభివృద్ధి సాధించడానికి కారణం అదే. కానీ ఇది అంత సులువు కాదు. ప్రతి రోజూ కంటెంట్ తేవడమే ఒక సవాలైతే... అందులో కొత్తదనం ఉండేలా చూసుకోవడం, అదీ ఆకట్టుకొనేలా రూపొందించడం అతిపెద్ద సవాలు. వీటన్నిటినీ అధిగమించాను కనుకనే ఇవాళ నా పేరు ఇంతమందికి పరిచయమయింది.

**నా సంకల్పం నెరవేరింది...**

మాది ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం. సిరిసిల్ల జిల్లా ముస్కానిపేట్ స్వస్థలం. మా అమ్మ లక్ష్మి, నాన్న నర్సింహారెడ్డి... వ్యవసాయం చేసే వారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టూనే మా అన్నయ్యను ఎంబీబీఎస్ చదివించారు. అన్నయ్య కూడా అంతే కష్టపడి డాక్టర్ అయ్యాడు. ఇప్పుడు అపోలోలో ఒక టీమ్‌ను లీడ్ చేస్తాడు. తన గురించి ఎప్పుడూ గొప్పగా చెప్పుకొంటా. కానీ నేను ఏమీ సాధించలేదన్న వెలితి నాలో ఉండేది. పీజీ మొదటి సంవత్సరంలో ఉండగానే నాకు పెళ్లయింది. తరువాత చదువు కొనసాగించాను. 2010లో పీజీ పూర్తయ్యాక హైదరాబాద్‌కు వచ్చేశాను. కానీ ఉద్యోగాలేవీ చేయలేదు. పదేళ్లు పిల్లలతోనే సరిపోయింది. వెనక్కి తిరిగి చూసుకొంటే నేనంటూ సాధించిందేమీ లేదు. ‘గృహిణి అయినంతమాత్రాన ఏమీ చేయలేమా?’ అనే ఆలోచన నాకు నిద్రపట్టనివ్వలేదు. అంకితభావంతో ప్రయత్నిస్తే అనుకున్నది సాధించవచ్చని చెప్పాలనుకున్నా. నాలాంటి గృహిణులు అందరికీ ఒక స్ఫూర్తిమంత్రం అవ్వాలని కోరుకున్నా. ఆ సంకల్పంతోనే నన్ను నేను నిరూపించుకున్నాను. ఇవాళ సొంత వ్యాపారం చేస్తున్న మావారితోనే కాదు... డాక్టర్ అయిన మా అన్నయ్యతో కూడా పోటీపడి సంపాదిస్తున్నా. మా పిల్లలకు నెల నెలా జీతం ఇస్తున్నా. ఇల్లు, భర్త, పిల్లలు... అన్నిటినీ చూసుకొంటూ నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నా. ఇంతకు మించిన సంతృప్తి, సంతోషం ఇంకేముంటుంది!”

# ఇలా చేస్తే వెంటనే ఉపశమనం



**వాంతులు**

చిన్న గ్లాసు నీళ్లలో నాలుగు లవంగాలు వేసి బాగా మరిగించాలి. గోరువెచ్చగా చల్లారిన తరవాత ఈ నీళ్లను వడకట్టి తాగితే వెంటనే వాంతులు ఆగిపోతాయి.

**కడుపునొప్పి**

స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల వాము వేసి దోరగా వేయించాలి. దీనికి అరచెంచా నల్ల ఉప్పు కలిపి కొద్ది కొద్దిగా నోట్లో వేసుకుంటూ బాగా నమిలి తినాలి. పావుగంటలో కడుపు నొప్పి, అపానవాయువుల సమస్యలు తగ్గిపోతాయి. కడుపులో జీర్ణక్రియ మెరుగవుతుంది కూడా.

**తలతిరగడం**

రెండు చెంచాల సోంపులో ఒక చెంచా పటిక బెల్లం కలిపి తినాలి. వెంటనే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరిగి తలతిరగడం తగ్గుతుంది. తక్షణ శక్తి కూడా లభిస్తుంది.

**విరేచనాలు**

అరకప్పు కమ్మని పెరుగులో ఒక చెంచా మెంతులు కలుపుకొని మెల్లగా తినాలి. పది నిమిషాల్లో విరేచనాలు తగ్గిపోతాయి. ఒక చెంచా పంచదారలో రెండు చుక్కల నీళ్లు కలిపి వేడిచేస్తే వచ్చే పాకం తిన్నా కూడా మంచి ఫలితం కనిపిస్తుంది.

**న్యుమోనియా**

అరగ్లాసు గోరువెచ్చని నీటిలో చిటికెడు ఇంగువ కలుపుకొని తాగితే ముక్కులో శ్లేష్మం తగ్గి వెంటనే ఉపశమనం కలుగుతుంది.

**పంటి నొప్పి**

చిన్న అల్లం ముక్కను తొక్కు తీసి సన్నగా తురమాలి. ఈ తురుముని వేళ్లతో పిండితే రసం వస్తుంది. రోజుకు రెండుసార్లు ఒక చెంచా అల్లం రసం తీసుకుంటే పంటినొప్పి, చిగుళ్ల వాపు క్రమంగా తగ్గుతాయి. ఈ రసాన్ని కొద్దిగా వేడిచేసి దాన్ని నొప్పి ఉన్న ప్రదేశంలో రాసినా ప్రయోజనం ఉంటుంది.

**గాయాలు**

కూరలు తరిగేటపుడు చాకుతో వేలు కోసుకున్నా, పిల్లలు ఆడుకుంటూ దెబ్బలు తగిలించుకున్నా ఇలా ఏ చిన్న గాయమైనా వాటిపై కొద్దిగా పసుపును అద్దాలి. పసుపు యాంటీబయటిక్‌లా పనిచేసి గాయాన్ని త్వరగా మాన్పుతుంది.

## సిగ్నిఫై బ్రాండ్ అంబాసిడర్‌గా రష్మిక మందన్న







**న్యూఢిల్లీ-నవభూమి:**లైటింగ్‌లో ప్రపంచ అగ్రగామి డైనమిక్ సూపర్‌స్టార్, నేషనల్ క్రష్ రష్మిక మందన్నను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుని, తన అనుబంధాన్ని ప్రకటించింది. వేసవి కాలానికి ముందస్తుగా చేసుకున్న ఈ భాగస్వామ్యం, సిగ్నిఫై ఆవిష్కరణ, ఇంధన సామర్థ్యం మరియు వినియోగదారు కేంద్రీకృత నిబద్ధతను బలోపేతం చేస్తుంది.తన అద్భుతమైన ప్రదర్శనలు, శైలి, పాన్-ఇండియా ఆకర్షణతో గుర్తింపు దక్కించుకున్న రష్మిక మందన్నతో, సిగ్నిఫై దేశ వినియోగ కథలో ప్రముఖ పాత్ర పోషిస్తూ, యువతను ఆకట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భాగస్వామ్యం ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది. ఇది భారతదేశంలోని వినియోగదారులను ప్రేరేపించేందుకు, వేడుక చేసుకునేందుకు మరియు వారితో నిమగ్నమయ్యేందుకు బ్రాండ్ నిబద్ధతను బలపరుస్తుంది.ఈ భాగస్వామ్యం గురించి సిగ్నిఫై గ్రేటర్ ఇండియా సీఈఓ మరియు మేనేజింగ్ డైరెక్టర్ సుమిత్ జోషి మాట్లాడుతూ, "సిగ్నిఫైలో, మా #%BrighterLivesBetterWorld% దృష్టికి అనుగుణంగా మా వినియోగదారులకు అత్యుత్తమ ఆవిష్కరణలను తీసుకురావడంలో పట్ల మేము విశ్వాసాన్ని కలిగి ఉన్నాము. మా ఎకోలింక్, ఫిలిప్స్ బ్రాండ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌గా రష్మిక మందన్నను సిగ్నిఫై కుటుంబానికి స్వాగతిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము. ఆమె శక్తివంతమైన వ్యక్తిత్వం, ఆమె చేస్తున్న పని పట్ల నిబద్ధతకు మా ఆవిష్కరణ, అత్యున్నత నాణ్యత, తరతరాలుగా కొనసాగడం అనే సూత్రాలతో కచ్చితంగా సరిపోతాయి.




## కుమారుడి పెళ్లి వేళ గౌతమ్ అదానీ గొప్ప మనసు.. స్కూల్స్, హాస్పిటల్స్ కోసం రూ. 10 వేల కోట్ల గిఫ్ట్!



**న్యూఢిల్లీ-నవభూమి:**ముందుగా చెప్పినట్లుగానే దిగ్గజ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ.. తన రెండో కుమారుడు జీత్ అదానీ పెళ్లిని నిరాడంబరంగా నిర్వహించారు. శుక్రవారం రోజు.. గుజరాత్ అహ్మదాబాద్‌లోని అదానీ టౌన్‌షిప్‌లో పలువురు బంధుమిత్రుల నడుమ చాలా సాదాసీదాగా వివాహం జరిగింది. గుజరాత్ డైమండ్ మర్చంట్ జైమిన్ షా కుమార్తె అయిన దివా జైమిన్ షా మెడలో తాళి కట్టారు జీత్ అదానీ. వివాహం జరిగిన తర్వాత.. పెళ్లి ఫొటోలు పంచుకుంటూ గౌతమ్ అదానీ స్వయంగా ట్వీట్ చేశారు. గుజరాతీ, జైన్ సంప్రదాయాలతో.. కొద్ది మంది బంధుమిత్రుల సమక్షంలో సింపుల్‌గా వివాహం నిర్వహించామని అన్నారు. అందరు శ్రేయోభిలాషుల్ని ఆహ్వానించలేకపోయినందుకు క్షమాపణలు చెప్పారు.అయితే.. తన కుమారుడి వివాహం వేళ గౌతమ్ అదానీ తన ఉదారగుణాన్ని మరోసారి చాటుకున్నారు. కుమారుడికి పెళ్లి గిఫ్ట్‌గా.. సమాజానికి సేవ చేసేందుకు నడుం బిగించారు. ఏకంగా రూ. 10 వేల కోట్లను విరాళంగా ప్రకటించినట్లు తెలిసింది. దీనిపై పలు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. దీనిని వివిధ సామాజిక కారణాల కోసం ఉపయోగించనున్నట్లు గౌతమ్ అదానీని ఉటంకిస్తూ పేర్కొన్నాయి. అయితే అదానీ నేరుగా పెళ్లి సమయంలో ప్రకటన చేసినట్లు కొన్ని మీడియాల్లో వచ్చింది.

ఇక అదానీకి అత్యంత సన్నిహిత వ్యక్తి ఈ విషయం చెప్పినట్లు మరి కొన్ని రిపోర్టులు వెల్లడించాయి. ' సామాన్య ప్రజలకు పలు విధాలుగా ఉపయోగపడేలా పెద్ద మొత్తంలో విరాళం ఇవ్వాలని అదానీ నిర్ణయించుకున్నారు.' అని ఆయన అన్నట్లు ఉటంకించాయి. పేరు బయటకు చెప్పడానికి ఇష్టపడని ఆయన మాటల ప్రకారం.. 'ఈ విరాళంలో పెద్ద మొత్తం ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి భారీ మౌలిక సదుపాయాల కార్యక్రమాలకు నిధులు సమకూర్చాలని భావిస్తున్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో వరల్డ్ క్లాస్ హాస్పిటల్స్‌లో వైద్యం, టాప్ స్కూళ్లలో విద్య, నైపుణ్యాలు అందించండపై దృష్టి సారించారు.'అయితే ఈ పెళ్లికి ముందు జీత్ అదానీ కూడా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఏటా 500 మంది దివ్యాంగ మహిళలకు వారి పెళ్లి నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున అందించనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని వివరిస్తూ స్వయంగా అదానీనే ట్వీట్ చేశారు.మహా కుంభమేళాకు గత నెలలో వెళ్లిన సమయంలోనే.. ఫిబ్రవరి 7న జీత్ అదానీ- దివా పెళ్లి జరుగుతుందని.. సింపుల్‌గా నిర్వహిస్తామని చెప్పారు. సెలబ్రిటీల్ని ఆహ్వానించి అంగరంగ వైభవంగా చేస్తారన్న ఊహాగానాలకు దీనితో తెరపడింది. చెప్పినట్లుగానే నిరాడంబరంగానే వివాహం జరిపించినట్లు తెలుస్తోంది.

## పైపైకి పసిడి, వెండి రేట్లు.. ఎంతకు చేరాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో బడ్జెట్ 2025 తర్వాత బంగారం వెండి ధరలు క్రమంగా పైపైకి చేరుతున్నాయి. దీనికి ముందు బులియన్ మార్కెట్లో 80 వేల లోపు ఉన్న పసిడి ధరలు, ఇప్పుడు 85 వేలు దాటి దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలోనే నేడు (ఫిబ్రవరి 8, 2025న) ఉదయం 6.25 గంటల నాటికి **https://bullions.co.in** వెబ్‌సైట్ ప్రకారం ఇంఫాల్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 85,210కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 78,109కు చేరింది.

ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి రేటు రూ. 84,710కి చేరగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 77,651కు చేరుకుంది. ఇదే సమయంలో హైదరాబాద్, విజయవాడలో 10 గ్రాముల బంగారం 24 క్యారెట్లకు రూ. 84,990గా ఉండగా, 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.77,908 స్థాయికి చేరుకుంది.

వెండి రేట్లు ఎలా ఉన్నాయంటే..ఇక నేటి వెండి రేట్ల విషయానికి వస్తే వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 95,300కి చేరుకోగా, హైదరాబాద్, విజయవాడలో కేజీ వెండి రేటు రూ. 95,610కి చేరింది.

దేశంలోని ప్రధాన నగరాల్లో 22 క్యారెట్, 24 క్యారెట్ బంగారం ధరలు
చెన్నైలో రూ. 78,008, రూ. 85,100
ముంబైలో రూ. 77,779, రూ. 84,850
కోల్‌కతాలో రూ. 77,678, రూ. 84,740
బెంగళూరులో రూ. 77,843, రూ. 84,920
మధురైలో రూ. 78,008, రూ. 85,100
మణిపూర్‌లో రూ. 78,109, రూ. 85,210
ఢిల్లీలో రూ. 77,651, రూ. 84,710
హైదరాబాద్‌లో రూ. 77,908, రూ. 84,990
విజయవాడలో రూ. 77,908, రూ. 84,990
పాట్నాలో రూ. 77,743, రూ. 84,810

హాల్‌మార్క్ ఉన్నవి కొంటున్నారా లేదా..

బంగారాన్ని కొనుగోలు చేసేటప్పుడు, ప్రజలు దీని నాణ్యత గురించి ఆలోచించాలి. కచ్చితంగా హాల్‌మార్క్ గుర్తు ఉన్న పసిడి మాత్రమే కొనుగోలు చేయాలి. హాల్‌మార్క్ అనేది బంగారంపై ప్రభుత్వ హామీతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ద్వారా నిర్ణయించబడుతుంది. ఈ క్రమంలో బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి %ISO% (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్క్ ఇస్తుంది.

24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌పై 916, 21 క్యారెట్‌పై 875, 18 క్యారెట్‌పై 750 వంటి నంబర్లను ఇస్తారు. ఎక్కువగా బంగారాన్ని 22 క్యారెట్లలో విక్రయిస్తుండగా, కొందరు 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తారు. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారంలో 9% రాగి, వెండి, జింక్ వంటి ఇతర లోహాలను కలిపి ఆభరణాలు తయారు చేస్తారు.

# రుణగ్రహీతలకు రిలీఫ్



**ముంబై-నవభూమి:** రుణగ్రహీతలకు శుభవార్త. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లతో పాటు ఇప్పటికే తీసుకున్న రెపో ప్రామాణిక రుణాలపై ఈఎంఐల భారం కూడా తగ్గనుంది. ఎందుకంటే, కీలక వడ్డీ (రెపో) రేటును 0.25 శాతం తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించింది. దాంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగివచ్చింది. రెపో రేటును తగ్గించడం ఐదేళ్ల (2020 మే) తర్వాత ఇదే తొలిసారి. రెండున్నరేళ్ల సుదీర్ఘ యథాతథ స్థితి తర్వాత రెపోను సవరించడం కూడా ఇదే మొదటిసారి. అంతేకాదు, ఆర్‌బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు చేపట్టాక నిర్వహించిన తొలి ద్రవ్యపరపతి సమీక్షలోనే రేటు తగ్గింపునకు శ్రీకారం చుట్టడం మరో విశేషం.ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో భాగంగా సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజులపాటు సమావేశమైంది. వృద్ధికి ఊతమిచ్చేందుకు వడ్డీ రేటును పావు శాతం తగ్గించాలని సభ్యులు ఏకగ్రీవంగా ఓటేశారు. పరపతి విధానంపై తటస్థ వైఖరిని మాత్రం అలాగే కొనసాగించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. అత్తెసరు ఆదాయం, ధరాఘాతంతో సతమవుతున్న మధ్య తరగతి వర్గాలపై కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో వరాల జల్లు కురిపించింది. కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి రూ.12 లక్షల వరకు వార్షికాదాయంపై పన్ను ఊరట కల్పించింది. తాజాగా ఆర్‌బీఐ సైతం రుణగ్రహీతల కోసం వడ్డీ భారాన్ని తగ్గించింది. ఈ ఏడాది ఏప్రిల్ 7-9 తేదీల్లో తదుపరి సమీక్షను నిర్వహించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. చాలాకాలంగా ఎదురు చూస్తున్న రుణగ్రహీతలకు రెపో తగ్గింపుతో కొంత ఉపశమనం లభించనుందని, ఆర్థిక వృద్ధికి సైతం ఈ నిర్ణయం దోహదపడనుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ఆర్‌బీఐ నిర్ణయాన్ని పారిశ్రామిక వర్గాలు స్వాగతించాయి. ముమ్ముందు రెపో మరింత తగ్గేందుకు పునాదులు వేసిందన్నారు. పన్ను ఊరట ద్వారా వినియోగం పెంచేందుకు బడ్జెట్లో ప్రకటించిన చర్యలకు రెపో తగ్గింపు మరింత తోడ్పడనుందన్నారు. ఆర్థిక పునరుద్ధరణకు దోహదపడనుందన్నారు. రెపో పావు శాతం తగ్గింపుతో రియల్టీ రంగానికి ప్రత్యక్ష ప్రయోజనం కొంతేనని.. గృహాలకు డిమాండ్ పుంజుకునేందుకు వడ్డీ రేట్లు మరింత తగ్గాల్సిన అవసరం ఉందని క్రెడాయ్ అభిప్రాయపడింది. వాహన రంగం మాత్రం సంతోషం వ్యక్తం చేసింది. టూవీలర్లు, చిన్న కార్ల విక్రయాలు పెరిగేందుకు తోడ్పడవచ్చని అభిప్రాయపడింది.

**ధరలు తగ్గుముఖం**

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సగటు 4.2 శాతానికి తగ్గవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2024-25 ద్రవ్యోల్బణం అంచనాను మాత్రం యథాతథంగా 4.8 శాతంగా కొనసాగించింది. సరఫరా అవాంతరాలు ఎదురుకాని పక్షంలో, మెరుగైన ఖరీఫ్ దిగుబడితో ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టవచ్చని ఆర్‌బీఐ గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ట్రంప్ సుంకాల దెబ్బకు అంతర్జాతీయ మార్కెట్లో కమోడిటీలు, ఇంధన ధరల పెరుగుదల అవకాశాలు, వరదలు, తుపాన్లు వంటి ప్రకృతి విపత్తులతో ధరలు మళ్లీ పెరిగే ప్రమాదం లేకపోలేదన్నారు.

**7 శాతానికి పైగా వృద్ధి సాధ్యమే..**

భారత్ 7 శాతానికి పైగా వృద్ధిని సాధించగలదని, మనం అందుకోసం ఆకాంక్షించాలని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతానికి పెరగవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. మెరుగైన రబీ దిగుబడితో పాటు పారిశ్రామికోత్పత్తిలో పునరుద్ధరణ ఇందుకు దోహదపడనున్నాయని మల్హోత్రా అన్నారు. అలాగే, ఈసారి బడ్జెట్లో ప్రకటించిన పన్ను ఊరటతో ప్రైవే టు వినియోగానికి ఊతం లభించనుందని, ఇది కూడా వృద్ధికి చోదకంగా పనిచేయనుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో మాత్రం వృద్ధి రేటు 6.4 శాతానికి పరిమితం కావచ్చని ప్రభుత్వం ఈ మధ్యనే అంచనాలను విడుదల చేసింది.

**బ్యాంకులకు ప్రత్యేక డొమైన్ నేమ్స్**

దేశీయ ఆర్థిక సేవల రంగంలో భారీగా పెరిగిన డిజిటల్ మోసాలకు మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. భారత బ్యాంకులకు 'బ్యాంక్.ఇన్', నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు (ఎన్‌బీఎఫసీ) 'ఫిన్.ఇన్' ప్రత్యే కడొమైన్ నేమ్‌లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ ఏప్రిల్ నుంచి బ్యాంకులకు బ్యాంక్.ఇన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుందని, ఆ తర్వాత ఎన్‌బీఎఫసీలకు ఫిన్.ఇన్ డొమైన్ నేమ్‌లను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. కాగా, కార్డు లేకుండా ఆన్‌లైన్‌లో జరిపే అంతర్జాతీయ చెల్లింపుల్లో అదనపు ధ్రువీకరణను ప్రవేశపెట్టాలని కూడా ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. భారత్‌లో జారీ చేసిన కార్డులతో జరిపే అంతర్జాతీయ చెల్లింపులకు అదనపు ధ్రువీకరణ ఇప్పటికే అమలులో ఉంది.

జలాన్ కమిటీ సిఫారసులపై అంతర్గత సమీక్ష

ఆర్‌బీఐ మిగులు నిధుల బదిలీకి సంబంధించి ఎకనామికల్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ)పై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ చేసిన సిఫారసులపై అంతర్గత సమీక్ష కొనసాగుతోందని మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం ఈ ఫ్రేమ్‌వర్క్‌లో ఆకస్మిక అవసరాలు, నష్టాల కోసం బ్యాలెన్స్‌షీట్‌లో గరిష్ఠంగా 6.5 శాతం వరకు నిల్వను కేటాయించవచ్చు. గత ఏడాది ఆర్‌బీఐ రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్ల మిగులు నిధులను ప్రభుత్వానికి బదిలీ చేసింది.

**కేవలం ఈసారే పాలసీ సడలింపు!**

ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కేవలం ఈ సమావేశంలో ద్రవ్య పరపతి విధానాన్ని కాస్త సడలించడం జరిగిందని, తద్వారా రెపో రేటును 0.25 శాతం తగ్గించగలిగామని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. ముమ్ముందు సమీక్షల్లోనూ ఇదే వైఖరి ఉండబోదన్నారు. వృద్ధికి మద్దతిస్తూనే ద్రవ్యోల్బణాన్ని లక్ష్యం మేరకు నియంత్రించే దిశగా పరపతి విధాన వైఖరి ఉంటుందన్నారు. దీర్ఘకాలం పాటు ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఆందోళనకరం
రూపాయి విలువ క్షీణత కూడా ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచుతోందన్నారు. రూపాయి విలువ 5 శాతం క్షీణిస్తే, దిగుమతుల భారం పెరిగి ద్రవ్యోల్బణం 0.30 శాతం మేర పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే, రూపాయి మారకం విలువలో హెచ్చుతగ్గుల కంటే అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఆర్‌బీఐ పాలిట అతిపెద్ద ఆందోళనకర అంశంగా మారిందన్నారు. ఎందుకంటే, అంతర్జాతీయ అనిశ్చితులు ఆర్థిక వృద్ధి, పెట్టుబడి నిర్ణయాలు, వినియోగంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయన్నారు.

బడ్జెట్ భళా..వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా బాగుందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. బడ్జెట్ ప్రకటనలు ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడంతోపాటు ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్యానికి తోడ్పడేలా ఉన్నాయన్నారు. భారీ పన్ను ఊరటతో మధ్యతరగతి వర్గాల చేతుల్లోకి అదనంగా రూ.లక్ష కోట్లు అందుబాటులోకి రానున్నాయని.. తద్వారా మార్కెట్లో వినియోగం పెరగనుందన్నారు.

## సుకన్య సమృద్ధి యోజనకు పదేళ్లు.. ఏకంగా 4 కోట్లకుపైగా అకౌంట్లు.. పాప పెళ్లి వయసుకల్లా చేతికి రూ. 69 లక్షలు!



**న్యూఢిల్లీ-నవభూమి:** సుకన్య సమృద్ధి యోజన .. అంటేనే దేశవ్యాప్తంగా ఎందరో ఆడపిల్లలు, మహిళల్లో ఆశల్ని రేకెత్తించే.. సాధికారత పెంపొందించే పథకంగా చెప్పొచ్చు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ స్కీమ్.. అంతలా జనాలకు చేరువైంది. 2015, జనవరి 22న ఈ పథకాన్ని ప్రారంభించగా.. గత నెల 22 నాటికి విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. బేటీ బచావో, బేటీ పడావో క్యాంపెయిన్‌లో భాగంగా.. మహిళలకు ఆర్థిక భద్రత, సామాజిక సాధికారిత కల్పించడమే లక్ష్యంగా సుకన్య సమృద్ధి పథకం అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా ఆడపిల్లల తల్లిదండ్రులు.. ఈ పథకంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా పిల్లల పైచదువులు, పెళ్లి సమయానికి పెద్ద మొత్తంలో రాబడి అందించడమే ఈ స్కీమ్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. 10 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ స్కీమ్ గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 2024 నవంబర్ నాటికి ఏకంగా 4.1 కోట్లకుపైగా సుకన్య సమృద్ధి అకౌంట్లు ఓపెన్ అయ్యాయి. సుకన్య సమృద్ధి యోజన పథకం కేవలం ఆడపిల్లల కోసమే ఉద్దేశించింది. పాప పుట్టిన సమయం నుంచి పదేళ్లు వచ్చే వరకు ఎప్పుడైనా ఇందులో చేరొచ్చు. ఇంట్లో గరిష్టంగా ఇద్దరు ఆడపిల్లల పేరిట ఖాతాలు తెరవొచ్చు. ట్విన్స్ లేదా ట్రిప్లెట్స్ ఉన్నట్లయితే అప్పుడు రెండుకు మించి అకౌంట్లు ఓపెన్ చేయొచ్చు. భారత ప్రజలు అయి ఉండాలి. దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు.

రెసిడెన్స్ ప్రూఫ్

**ఎంత డిపాజిట్ చేయాలి?**

పదేళ్ల వయసులోపు పాప పేరిట తల్లిదండ్రులు లేదా గార్డియెన్స్ ఖాతా తెరవొచ్చు. పోస్టాఫీస్ లేదా కమర్షియల్ బ్యాంకుల్లోకి వెళ్లి చేరొచ్చు. కనీసం ఆర్థిక సంవత్సరంలో రూ. 250 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. గరిష్ట పెట్టుబడి రూ .1.50 లక్షల వరకు ఉంటుంది. అకౌంట్ తెరిచినప్పటి నుంచి వరుసగా 15 ఏళ్లు డబ్బులు కట్టాలి. సంవత్సరంలో ఒకేసారి లేదా ఇన్‌స్టాల్‌మెంట్ల రూపంలో చెల్లించొచ్చు.

వడ్డీ రేట్లు..ప్రస్తుతం ఈ పథకంలో వడ్డీ రేటు జనవరి- మార్చి త్రైమాసికానికి గానూ 8.20 శాతంగా ఉంది. వడ్డీ రేట్లను కేంద్ర ప్రభుత్వం ప్రతి 3 నెలలకు ఓసారి సవరిస్తుంటుంది. వడ్డీ రేట్లు పెంచడం లేదా తగ్గించడం లేదా స్థిరంగా ఉంచడం చేస్తుంది. ప్రతి నెలా వడ్డీ లెక్కించి.. ఆర్థిక సంవత్సరం చివర్లో అకౌంట్లో జమ చేస్తారు.

**లాకిన్ పీరియడ్..**

పదేళ్ల లోపు వయసులో ఎప్పుడు చేరినా కూడా.. ఆడపిల్లకు 18 ఏళ్లు దాటితే అకౌంట్ తానే స్వయంగా వినియోగించవచ్చు. ఈ పథకం లాకిన్ పీరియడ్ అకౌంట్ తెరిచినప్పటినుంచి 21 సంవత్సరాలు ఉంటుంది. ఇక పదో తరగతి పాసైనా లేదా 18 ఏళ్లు దాటినా 50 శాతం వరకు డబ్బులు తీసుకోవచ్చు. 18 ఏళ్లు నిండాక పెళ్లి సమయంలో అకౌంట్ ముందే క్లోజ్ చేయొచ్చు. ఐదేళ్ల వయసులో చేరినట్లయితే.. పాపకు 26 ఏళ్ల సమయంలో అకౌంట్ మెచ్యూర్ అవుతుందన్నమాట.

**ఎంత ఇన్వెస్ట్ చేస్తే ఎంతొస్తుంది?**

ఈ పథకంలో చిన్న మొత్తాల్లో అంటే ఏడాదికి రూ. 5 వేలు, రూ. 10 వేల నుంచి గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు ఎంతైనా మీ స్థోమతను బట్టి డబ్బులు జమ చేయొచ్చు. అయితే మనం నెలకు రూ. 5 వేలు, రూ. 10 వేలు, గరిష్టంగా రూ. 12,500 చొప్పున డిపాజిట్ చేస్తే.. మెచ్యూరిటీకి ప్రస్తుత వడ్డీ రేటు ప్రకారం ఎంత వస్తుందో తెలుసుకుందాం.

నెలకు రూ. 5 వేలు, అంటే ఏడాదికి రూ. 60 వేల చొప్పున జమ చేస్తే.. 15 ఏళ్లకు మీ పెట్టుబడి రూ. 9 లక్షలపై వడ్డీ రూపంలోనే రూ. 18.71 లక్షలు వస్తాయి. మొత్తం మెచ్యూరిటీకి చేతికి రూ. 27.71 లక్షలు వస్తాయి.

ఇక నెలకు రూ. 10 వేల చొప్పున ఏడాదికి రూ. 1.20 లక్షల చొప్పున డిపాజిట్ చేస్తే.. మొత్తం పెట్టుబడి రూ. 18 లక్షలపై మెచ్యూరిటీకి చేతికి రూ. 55.42 లక్షలు వస్తాయి.

గరిష్ట పెట్టుబడి రూ. 1.50 లక్షలు అంటే నెలకు రూ. 12,500 చొప్పున చూస్తే.. పెట్టుబడి మొత్తం రూ. 22.50 లక్షలు కాగా.. వడ్డీ రూపంలోనే రూ. 46.77 లక్షలు.. మెచ్యూరిటీకి మొత్తం చేతికి రూ. 69.27 లక్షలు వస్తాయి.అయితే పాప పుట్టిన సమయంలోనే ఏడాదిలోపే ఇందులో చేరడం ద్వారా.. అమ్మాయి పైచదువుల కోసం అదే విధంగా.. పెళ్లి సమయానికి 21 ఏళ్లు దాటగానే పెద్ద మొత్తంలో డబ్బులు సమకూర్చుకోవచ్చు.


## గృహ రుణాలపై తగ్గనున్న భారం

**న్యూఢిల్లీ-నవభూమి:**ఐదేళ్ల తర్వాత ఆర్‌బీఐ గృహ రుణాలు తీసుకునే వారికి శుభవార్త చెప్పింది. శుక్రవారం జరిగిన భేటీలో రెపో రేటును 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. దీంతో బ్యాంకులు కూడా గృహ, ఇతర రిటైల్ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించనున్నాయి. రెపో రేటు తగ్గింపు ప్రభావం గృహ రుణాల ఈఎంఐలపై ఎలా ఉంటుందంటే? ప్రస్తుతం బ్యాంకులు మంచి పరపతి రేటింగ్ ఉన్న వ్యక్తులకు ఇచ్చే గృహ రుణాలపై కనీసం 9 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఇది 8.75 శాతానికి తగ్గనుంది. మంచి పరపతి రేటింగ్ ఉన్న ఒక వ్యక్తి 20 ఏళ్ల కాలానికి తాను తీసుకున్న రూ.30 లక్షల గృహ రుణంపై ప్రస్తుతం 9 శాతం వడ్డీ రేటు చొప్పున నెలకు రూ.26,992 ఈఎంఐగా చెల్లిస్తున్నారు. బ్యాంకులు ఈ వడ్డీ రేటును 8.75 శాతానికి కుదిస్తే ఈ ఈఎంఐ భారం రూ.26,551కు తగ్గనుంది. అంటే నెలకు చెల్లింపు భారం 1.78 శాతం (రూ.480) తగ్గనుంది.ఏఇఏది బెటర్: ప్రస్తుతం గృహ రుణాలు తీసుకున్న వారి ముందు రెండు మార్గాలున్నాయి. అందులో ఒకటి తగ్గే వడ్డీ రేటుకు అనుగుణంగా ఈఎంఐల భారం తగ్గించుకోవడం. రెండోది ఈఎంఐ చెల్లింపు మొత్తాన్ని అలాగే ఉంచుకుని రుణ చెల్లింపు కాలపరిమితి తగ్గించుకోవడం. రెండో ఆప్షన్‌తో గృహ రుణం త్వరగా తీరిపోయి ఇల్లు పూర్తిగా సొంతమవుతుంది.ఇది ఎలాగంటే: ఒక వ్యక్తి ఏడాది క్రితం 20 ఏళ్లల్లో చెల్లించేలా తొమ్మిది శాతం వడ్డీ రేటుతో రూ.50 లక్షల గృహ రుణం తీసుకున్నాడనుకుందాం. ఈ వడ్డీ రేటు ప్రకారం రుణ కాల పరిమితి తీరేసరికి అతడు చెల్లించాల్సిన ఈఎంఐల మొత్తం దాదాపు రూ.58 లక్షలు. ఇప్పుడు వడ్డీ రేటు అర శాతం తగ్గితే 20 ఏళ్లలో చెల్లించాల్సిన ఈఎంఐల మొత్తం రూ.50 లక్షలకు తగ్గుతుంది. పాత ఈఎంఐనే కొనసాగిస్తే చెల్లింపు కాలపరిమితి 240 నెలల నుంచి 222 నెలలకు తగ్గుతుంది. అదే వడ్డీ రేటు పావు శాతం మాత్రమే తగ్గి, పాత ఈఎంఐ కొనసాగిస్తే చెల్లింపుల కాలపరిమితి 240 నుంచి 230కి తగ్గుతుంది.పన్ను ఆదాను కూడా కలిపితే: వారం రోజుల క్రితం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో వేతన జీవులకు రూ.12 లక్షల ఆదాయంపై జీరో ఆదాయపు పన్ను ప్రయోజనం కల్పించడంతో పాటు అద్దెల ద్వారా వచ్చే ఆదాయంపై టీడీఎస్ పరిమితులు పెంచారు. దీనికి తోడు గృహ రుణాలపై వడ్డీ మినహాయింపులు కూడా పెంచారు. ఆర్‌బీఐ రెపో రేటు కోతతో ఈ ప్రయోజనాలను కూడా జోడించినట్టయితే వారికి కలిగే లాభం మరింత అధికంగా ఉంటుంది.బ్యాంకులు ఎప్పుడు అమలుపరుస్తాయి: ఆర్‌బీఐ రెపో తగ్గింపు చర్యకు స్పందిస్తూ బ్యాంకులు వడ్డీ రేటు తగ్గించడం అనేది ఆయా బ్యాంకులు అనుసరించే విధానాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా అయితే బ్యాంకులు కొత్త రెపో రేటుకు దీటుగా తమ రుణ, డిపాజిట్ రేట్లను సవరించేందుకు గరిష్ఠంగా రెండు వారాల వరకు సమయం పడుతుంది.

## తనిష్క్, జోయాలుక్కాస్, కల్యాణ్ జువెల్లర్స్.. ఎక్కడ గ్రాము గోల్డ్ ధర ఎంతుందంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే అన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రియమైన వారికి గిఫ్ట్స్ ఇస్తుంటారు. ముఖ్యంగా ప్రేమికులు, నూతన జంటలు ఇలా తమ ప్రేమను వ్యక్తపరిచేందుకు బహుమతి రూపంలో ఏదైనా ఇస్తుంటారు. ఇందులో ఎక్కువగా గోల్డ్ రింగ్స్, గోల్డ్ చెయిన్స్, నెక్లెస్ ఇలాంటివి కూడా ఉంటాయి. ముఖ్యంగా భారత్‌లో మహిళలకు బంగారం అంటే ఎంతో ఇష్టం ఉంటుంది. బంగారు ఆభరణాలు ధరిస్తే వారి అందం మరింత పెరుగుతుందని చెప్పొచ్చు. అందుకే.. గోల్డ్ జువెల్లరీని ఎక్కువగా భర్తలు.. తమ భాగస్వాములకు గిఫ్ట్‌గా ఇస్తుంటారు. ఈ క్రమంలోనే వాలెంటైన్స్ డే దగ్గరపడుతున్న వేళ.. దేశంలోని ప్రముఖ జువెల్లరీలలో గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయనేది తెలుసుకుందాం.అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న వేళ.. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయని చెప్పొచ్చు. దీంతో సంక్షోభ పరిస్థితుల్లో సేఫ్ హెవెన్‌గా (సురక్షిత పెట్టుబడి) బంగారాన్ని భావిస్తుంటారు. దీంతో పెట్టుబడులు పెరిగి.. గోల్డ్ రేట్లు పెరుగుతూ పోతున్నాయి. ఇప్పుడు ఆల్ టైమ్ గరిష్ట స్థాయిల్లోనే ఉన్నాయి. ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు గోల్డ్ ధరలు 10 శాతానికిపైగా పెరిగాయి.ఇంకా బంగారం ధరలు ప్రాంతాల్ని బట్టి మారుతుంటాయి. స్థానిక పన్ను రేట్లు సహా ఇతర అంశాలు ఇందుకు దోహదం చేస్తాయి. ప్రాంతాల్ని బట్టే కాకుండా ఇంకా షాపుల్ని బట్టి కూడా తేడాలు గమనించొచ్చు. ప్రస్తుతం దేశంలోని టాప్ జువెల్లరీల్లో గ్రాము గోల్డ్ రేటు ఎంత ఉందనేది చూద్దాం.కల్యాణ్ జువెల్లర్స్‌లో 22 క్యారెట్ల గోల్డ్ రేటు ఫిబ్రవరి 8న గ్రాముకు రూ. 7945 పలుకుతోంది. ఇక తనిష్క్ జువెల్లరీలో గ్రాము గోల్డ్ ధర రూ. 7990 గా ఉంది. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో గోల్డ్ రేటు గ్రాము రూ. 7945 వద్ద కొనసాగుతోంది. జోయాలుక్కాస్‌లో కూడా ఇదే రేట్లు ఉన్నాయి. అయితే ఇది వాస్తవ ధర కాదని గ్రహించాలి. గోల్డ్ జువెల్లరీ తీసుకుంటే.. అక్కడ మేకింగ్ ఛార్జీలు పడతాయి. ఇది గోల్డ్ ప్రైస్‌పై వర్తిస్తుంది. ఇది కూడా జువెల్లరీల్ని బట్టి మారుతుంది. సాధారణంగా 5 నుంచి 25 శాతం వరకు ఉంటాయి. తరుగు ఛార్జీలు కూడా వసూలు చేస్తాయి. ఇక జీఎస్టీ 3 శాతంగా ఉంటుంది. హాల్ మార్క్ ఛార్జీలు అదనంగా ఉంటాయి. అందుకే గోల్డ్ జువెల్లరీ కొనుగోలు చేసేటప్పుడు వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్లో కూడా బంగారం ధరలు ఇటీవల భారీగా పెరుగుతున్నాయి.






## అప్పుడిలా.. ఇప్పుడిలా.. ఐదేళ్లలో ఎంత మార్పు..?

**న్యూఢిల్లీ-నవభూమి:**బీజేపీ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. అప్పట్నుంచి అప్రతిహతంగా విజయాలు సాధిస్తూ దూసుకుపోతోంది. కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ అధికార పీఠాలను కైవసం చేసుకుంటోంది. ఈశాన్య రాష్ట్రాలతో పాటు దక్షిణాదిన కూడా విజయాలు సాధిస్తోంది. అయితే దేశ రాజధాని ఢిల్లీ పీఠం మాత్రం బీజేపీ కి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఢిల్లీ వాసులు మాత్రం కేజ్రీవాల్‌నే నమ్మారు. దాదాపు 26 ఏళ్లుగా బీజేపీకి ఢిల్లీ పీఠం దూరంగానే ఉండిపోయింది.గత ఎన్నికలు జరిగిన 2020లో కూడా బీజేపీ పెద్దలు చాలా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఢిల్లీని కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు చేశారు. అయితే ఆ సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో స్పష్టమైన విజయం సాధించి అధికారాన్ని నిలుపుకుంది. 2020లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీకి ఏకంగా 62 స్థానాలు లభించాయి. బీజేపీ మాత్రం కేవలం 8 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ఐదేళ్లు తిరిగే సరికి పరిస్థితి మారిపోయింది. మద్యం కేసులో కేజ్రీవాల్, అతడి పార్టీ నేతలు ఇరుక్కోవడం, ఢిల్లీ కాలుష్యం, యమునా నదిని క్లీన్ చేసే విషయంలో మాట నిలబెట్టుకోలేకపోవడం ఆప్ పాలిట శాపాలుగా మారాయి.పార్టీలోని కీలక నేతల మధ్య సమన్వయం లేకపోవడం, పార్టీలో లుకలుకలు, సీఎం కేజ్రివాల్, డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా అరెస్ట్ కావడం పార్టీని కోలుకోలేని దెబ్బ తీశాయి. దీంతో పరిస్థితి బీజేపీకి అనుకూలంగా మారింది.

## ఫిరాయించి పగ తీర్చుకున్నారు.. ఆ 8 నియోజక వర్గాల్లో బీజేపీకి ఎలా దక్కాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని ఢిల్లీలో దాదాపు 26 ఏళ్ల తర్వాత బీజేపీ అధికార పీఠం దక్కించుకుంది. పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిపక్షానికి పరిమితమైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంతో పాటు కార్యకర్తలు కూడా చెమటోడ్చి పని చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీలోని విభేదాలు కూడా రచ్చ కెక్కి ఓటమికి కారణమయ్యాయి. గతేడాది ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ చేసిన ఆరోపణలు తీవ్ర సంచలనం రేకెత్తించాయి. అలాగే ఆప్ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన 8 మంది ఎమ్మెల్యేలు కూడా బీజేపీ విజయం కూడా పని చేశారు. దీంతో ఆ మొత్తం 8 నియోజక వర్గాల్లోనూ బీజేపీ అభ్యర్థులే గెలుపొందారు.

ఢిల్లీలో పాలం, త్రిలోక్‌పురి, మదిపుర్, కస్తూర్బా నగర్, ఉత్తమ్ నగర్, బిజ్వాసన్, మెహ్రౌలీ, ఆదర్శ్ నగర్ అసెంబ్లీ స్థానాలను 2020 ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గెలుచుకుంది. అయితే తాజా ఎన్నికల్లో ఆప్ పార్టీ అధినాయకత్వం ఈ 8 నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చింది. మొత్తం 8 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను పక్కన పెట్టింది. దీంతో ఆ ఎనిమిది మంది ఆప్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిపోయారు. బీజేపీ వారిలో ఒక్కరికీ సీటు ఇవ్వలేదు. కానీ, వారి సేవలను వినియోగించుకుంది. దీంతో తాజా ఎన్నికల్లో ఆ 8 నియోజకవర్గాల్లోనూ బీజేపీ జయకేతనం ఎగురవేసింది.అలా 2020లో ఆప్ పార్టీకి కంచుకోటగా నిలిచిన ఆ 8 నియోజకవర్గాలు తాజా ఎన్నికల్లో బీజేపీ చెంతకు చేరాయి. తాజా ఎన్నికల్లో న్యూ ఢిల్లీ సీటు నుంచి పోటీ చేసిన కేజ్రివాల్ కూడా ఓడిపోయారు. అలాగే డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాతో పాటు పలువురు కీలక నేతలు కూడా ఓటమి పాలయ్యారు. పదేళ్ల అధికారంలో కొనసాగిన ఆప్ పార్టీలో అంతర్గత విభేదాలు కూడా బీజేపీ ఘనవిజయానికి తోడ్పాటునందించాయి.

## కాంగ్రెస్‌కు మళ్లీ హ్యాండ్ ఇచ్చిన ఢిల్లీ.. మరోసారి సున్నాకే పరిమితం..



**న్యూఢిల్లీ-నవభూమి:**నెగ్గేదేలే.. అంటూ కాంగ్రెస్ మరోసారి ఢిల్లీ లో చేతులెత్తేసింది. ఒకప్పుడు ఢిల్లీ కోటను అప్రతిహతంగా ఏలిన హస్తం పార్టీ వరుసగా మూడో సారి కూడా సున్నా సీట్లకే పరిమితమై రిక్త హస్తాలతో మిగిలింది. చివరకు ఢిల్లీలో ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారిపోయింది. పంతాలకు పోయి తాను అవమానం పాలవడమే కాకుండా ఆప్ పార్టీకి కూడా కష్టాలు తెచ్చిపెట్టింది. 2008లో చివరిసారిగా ఢిల్లీలో అధికారం సాధించిన కాంగ్రెస్ ఆ తర్వాత క్రమంగా బలహీన పడింది.ఢిల్లీ పీఠాన్ని 1998లో గెలుచుకున్న కాంగ్రెస్ వరుస విజయాలు సాధించి తనకు ఎదురు లేదనిపించుకుంది. షీలా దీక్షిత్ నాయకత్వంలో 1998, 2003, 2008 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించింది. అయితే ఆ తర్వాత ఢిల్లీలో పరిస్థితి మారింది. 2012లో దేశ రాజధానిలో జరిగిన నిర్భయ ఘటన దేశం మొత్తాన్ని ఉలిక్కి పడేలా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. ఆ తర్వాత అన్నా హజారే, అరవింద్ కేజ్రివాల్ అవినీతిపై చేసిన వ్యతిరేక పోరాటం ఢిల్లీలోనే కాదు, దేశం మొత్తం మీద కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించింది. అప్పట్నుంచి ఢిల్లీలో కాంగ్రెస్ కోలుకోలేకపోయింది. 2013లో ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం కాంగ్రెస్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టింది.2013 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ బ్యాంక్ చాలా వరకు ఆప్ వైపు మొగ్గింది. దీంతో కాంగ్రెస్ కేవలం 8 సీట్లకే పరిమితమైంది. ఇక, 2015 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆ ఎనిమిది స్థానాలను కూడా కోల్పోయి చేతులెత్తేసింది. అప్పట్నుంచి వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా సాధించలేక చతికిలపడింది. బీజేపీ విధానాలు, సిద్ధాంతాలు నచ్చని వారు ఇంతకు ముందు కాంగ్రెస్ వైపు ఉండేవారు. ఆప్ వచ్చిన తర్వాత ఢిల్లీ, సరిహద్దు రాష్ట్రాల్లో కాంగ్రెస్ మసకబారడం మొదలైంది. కాంగ్రెస్ సాంప్రదాయ ఓటు బ్యాంక్ ఆప్ వైపు మళ్లిపోయింది. అప్పట్నుంచి కాంగ్రెస్‌కు ఢిల్లీలో సరైన నాయకుడే లేకుండాపోయాడు.వ్యూహాత్మకంగా కాంగ్రెస్ చేసిన తప్పులు ఆ పార్టీతో పాటు ఆప్‌ను కూడా ఢిల్లీ ఎన్నికల్లో దెబ్బకొట్టాయి. ఇండియా కూటమిలో భాగస్వాములైన కాంగ్రెస్, ఆప్ పార్టీల మధ్యన కొరవడిన సమన్వయం బీజేపీకి కలిసి వచ్చింది. ఇన్నాళ్లూ ఆప్‌తో కలిసి బీజేపీని తిట్టిన కాంగ్రెస్, ఢిల్లీ ఎన్నికలకు వచ్చే సరికి ఆప్‌ను కూడా తీవ్రంగా విమర్శించింది. ఆ ద్వంద్వ నీతిని చాలా మంది హర్షించలేదు. అలాగే ఎన్నికల్లో నడిపించే నాయకుడు కూడా లేకుండా పోవడంతో కాంగ్రెస్ నామమాత్రపు పార్టీగా మిగిలిపోయింది.

## మోదీ ఈ జన్మలో తమను ఓడించలేరన్న కేజ్రీవాల్..

**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ఘన విజయం ఆప్‌కు గట్టి షాకిచ్చింది. బీజేపీ తమను ఓడించడం అసాధ్యమంటూ గతంలో ఆప్ అధినేత కేజ్రీవాల్ పలుమార్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అది 2023 నాటి వీడియో. లిక్కర్ కుంభకోణం కేసులో తన పేరు చేర్చిన సందర్భంగా కేజ్రీవాల్ ఓ సభలో మాట్లాడుతూ మోదీ తమను ప్రజాక్షేత్రంలో ఓడించలేరని ఘంటపథంగా చెప్పుకొచ్చారు.పార్టీ వర్కర్లను ఉద్దేశించిన ప్రసంగంలో కేజ్రీవాల్ బీజేపీని ఉద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "ఆప్ ప్రభుత్వం కూలదోయాలని వారు భావిస్తున్నారు. తద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని మోదీ గారు యోచిస్తున్నారు. కానీ నేను మోదీ గారికి చెప్పేదేంటంటే.. మీరు ఈ జన్మలో మిమ్మల్ని ప్రజాక్షేత్రంలో ఓడించలేరు. ఢిల్లీలో విజయం కోసం మీరు మరో జన్మ ఎత్తాలి" అని కేజ్రీవాల్ అప్పట్లో బీజేపీకి సవాలు విసిరారు.


## ఢిల్లీలో 'మినీ కేజ్రీవాల్'.. అందరి దృష్టిని ఆకర్షించిన 4 ఏళ్ల బుడ్డోడు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి.. 27 ఏళ్ల తర్వాత తిరిగి ఢిల్లీ పీఠాన్ని దక్కించుకుంది. ఇక 2013 నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతీ ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని దక్కించుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందు.. ఢిల్లీలో మినీ కేజ్రీవాల్ సందడి చేశారు. ఓట్ల లెక్కింపుకు ముందు ఈ మినీ కేజ్రీవాల్ అందరి దృష్టిని ఆకర్షించాడు. 4 ఏళ్ల అవ్యాన్.. అచ్చం అరవింద్ కేజ్రీవాల్ లాగా తయారై వచ్చి అందరి చూపును తనవైపు తిప్పుకున్నాడు. అయితే ఇలా అరవింద్ కేజ్రీవాల్ వేషం వేయడం ఇదే తొలిసారి కాదని.. గతంలోనూ పలుమార్లు అచ్చం కేజ్రీవాల్ లాగా తయారై వచ్చినట్లు అవ్యాన్, అతని తండ్రి వెల్లడించారు.ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఫ్యాన్ అయిన అవ్యాన్ తోమర్.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు ముందు రోజు ఆయన ఇంటికి వెళ్లారు. అయితే సాధారణంగా వెళ్లకుండా.. మొత్తం కేజ్రీవాల్ లాగే వేషం వేసుకుని.. కేజ్రీవాల్ ఇంటికి వెళ్లాడు. కేజ్రీవాల్ ఎప్పుడూ ధరించే బ్లూ కలర్ స్వెటర్, వైట్ కాలర్, గ్రీన్ పఫ్ జాకెట్ వేసుకున్న అవ్యాన్ తోమర్.. తన తండ్రి రాహుల్ తోమర్‌తో కలిసి కేజ్రీవాల్ ఇంటికి చేరుకున్నారు. అచ్చం కేజ్రీవాల్ లాగా కనిపించిన అవ్యాన్ తోమర్‌ను చూసి అక్కడ ఉన్న వారందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.అంతేకాకుండా మెడకు నల్లని మఫ్లర్ కూడా అవ్యాన్ కట్టుకుని కనిపించాడు. కేజ్రీవాల్ వలె కళ్లకు అద్దాలు పెట్టుకుని.. మీసాలు కూడా పెట్టుకుని రావడంతో అంతా మినీ కేజ్రీవాల్ అని పిలుస్తున్నారు. అయితే అవ్యాన్ తోమర్ ఇలా.. కేజ్రీవాల్ వేషధారణలో కనిపించడం ఇదేం తొలిసారి కాదని అతడి తండ్రి రాహుల్ తోమర్ వెల్లడించారు. ప్రతీ ఎన్నికల ఫలితాల వేళ తాము ఇక్కడికి వస్తామని వివరించారు. ఇక అవ్యాన్ తోమర్‌కు 'బేబీ మఫ్లర్ మ్యాన్' అని ఆమ్ ఆద్మీ పార్టీ పేరు కూడా పెట్టడం గమనార్హం.

## ఢిల్లీ సెక్రటేరియట్ సీజ్..

### ఫైల్స్, రికార్డ్స్ భద్రపరచాలని ఎల్జీ ఆదేశాలు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీలో బీజేపీ విజయం ఖరారు కాగానే.. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీలో అధికార మార్పు ఖాయం కాగానే.. సచివాలయాన్ని సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్‌లో ఫైల్స్, రికార్డ్స్ అన్నీ భద్రంగా ఉంచాలని సూచించారు. ఏ ఒక్క ఫైల్ కూడా సచివాలయం నుంచి బయటికి వెళ్లేందుకు వీలు లేదని తేల్చి చెప్పేశారు. ఆప్ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరుపుతామని.. ఎన్నికల ప్రచారంలో పేర్కొన్న నేపథ్యంలో తాజాగా సెక్రటేరియట్‌ను సీజ్ చేయడం గమనార్హం.ఢిల్లీలో ఆప్‌కు షాక్ ఇస్తూ.. బీజేపీ మెజార్టీ స్థానాలు సాధించి.. ఢిల్లీ పీఠాన్ని దక్కించుకుంది. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగానే.. ఢిల్లీలో బీజేపీ అధికారం ఖరారైపోయింది. అయితే అవినీతికి వ్యతిరేకంగా పుట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ.. అవినీతిలో కూరుకుపోయిందని.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దగ్గరి నుంచి ఢిల్లీ బీజేపీ నేతల వరకు అంతా.. ఎప్పటినుంచో విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే.. కేజ్రీవాల్ ప్రభుత్వం అవినీతిపై విచారణ జరిపిస్తామని.. అక్రమ చిట్టా విప్పుతామని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగానే.. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా కీలక ఆదేశాలు ఇచ్చారు.ఢిల్లీ సచివాలయాన్ని సీజ్ చేయాలని ఆదేశించారు. సెక్రటేరియట్‌లోని ఫైల్స్, రికార్డ్స్ భద్రపరచాలని ఆదేశాలు జారీ చేశారు. సెక్రటేరియట్ నుంచి ఏ ఒక్క ఫైల్ కూడా బయటకు వెళ్లడానికి వీలు లేదని ఎల్జీ ఆదేశించారు. గత 10 ఏళ్లుగా ఆప్ సర్కార్ అవినీతిపై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఇక ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో కాగ్ నివేదికలు ప్రవేశపెడతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా గతంలోనే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు విజయం ఖరారు కావడంతో.. యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన సాధారణ పరిపాలన శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. భద్రతా కారణాలు, రికార్డ్స్ రక్షణ కోసం.. ఢిల్లీ సచివాలయం కాంప్లెక్స్ నుంచి జీఏడీ అనుమతి లేకుండా ఒక్క ఫైల్ గానీ, డాక్యుమెంట్ గానీ, కంప్యూటర్ హార్డ్‌వేర్ సహా ఏది బయటికి వెళ్లకూడదని పేర్కొంది. దీంతో ఢిల్లీ సెక్రటేరియట్‌ను మూసివేసి.. అక్కడ భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఢిల్లీ సెక్రటేరియట్‌లోని పలు డిపార్ట్‌మెంట్‌ల పరిధిలోని రికార్డులు, ఫైల్‌లు, డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ ఫైల్‌లను భద్రపరుచుకోవడానికి అవసరమైన ఆదేశాలు జారీ చేయవచ్చని సంబంధిత బ్రాంచ్ ఇంఛార్జ్‌లకు సూచనలు చేసింది. సచివాలయ కార్యాలయాలకే కాకుండా మంత్రుల మండలి క్యాంప్ కార్యాలయాలకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు.

## ఢిల్లీలో ఆప్ ఓటమికి కారణాలేంటి..?

### ఆమ్ ఆద్మీని దూరం చేసిన 'లిక్కర్' మరకలు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీలో గత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీకి 2025 ఎన్నికల్లో బీజేపీ మాస్టర్ స్ట్రోక్ ఇచ్చింది. 27 ఏళ్లుగా ఢిల్లీలో అధికారం కోసం కష్టపడుతున్న బీజేపీ.. ఈసారి గెలవడం కోసం అన్ని రకాల అస్త్రాలను ప్రయోగించి విజయం సాధించింది. మరోవైపు అవినీతిని సహించేది లేదంటూ అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి అవినీతి ఆరోపణల కారణంగానే అధికారానికి దూరం కావాల్సి వచ్చింది.2012లో ఏర్పాటైన ఆమ్ ఆద్మీ పార్టీ.. 2013 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆశాజనక ఫలితాలు సాధించింది. ఆ ఎన్నికల్లో బీజేపీ 31 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచినప్పటికీ.. 28 సీట్లు గెలిచిన ఆప్.. 8 సీట్లతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ మద్దతుతో అధికారంలోకి వచ్చింది. అయితే సంకీర్ణ సర్కారు 49 రోజులే మనుగడ సాగించింది. ప్రభుత్వం కూలిపోవడంతో.. ఢిల్లీ రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది. 2015లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 67 స్థానాలు గెలిచిన ఆమ్ ఆద్మీ పార్టీ.. 2020 ఎన్నికల్లో 62 సీట్లు గెలిచి మరోసారి అధికారంలోకి వచ్చింది. అయితే ఈసారి ఆప్ సర్కారు ప్రయాణం సాఫీగా సాగలేదు, అవినీతి మరకలు కూడా అంటుకున్నాయి. ఫలితంగా కేజ్రీవాల్ పార్టీకి ఓటమి తప్పలేదు.2025 ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోవడానికి కారణాలేంటో చూద్దాం..

వరుసగా రెండు పర్యాయాలు తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ 2025 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంది. గతంలో మాదిరిగా ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్, బీజేపీలను నిందించే అవకాశం ఈసారి ఆప్‌కి లేకపోయింది. ఢిల్లీలో మౌలిక సదుపాయల కల్పన, కాలుష్య నియంత్రణ లాంటి అంశాలపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆప్ నెరవేర్చలేకపోయింది. ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది.

ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కేంద్ర బడ్జెట్లో ఆదాయపన్ను విషయంలో రిలీఫ్ ఇచ్చిన బీజేపీ తన ప్రత్యర్థికి మాస్టర్ స్ట్రోక్ ఇచ్చిందని చెప్పొచ్చు. ఇన్‌కమ్ ట్యాక్స్ లిమిట్‌ను ఏడాదికి రూ.12 లక్షలకు పెంచడం ద్వారా ఢిల్లీలోని మధ్యతరగతి ఓటర్లను బీజేపీ తనవైపు తిప్పుకుంది. అప్పటి వరకూ ఆప్‌కి మద్దతుగా నిలబడిన పట్టణ మధ్యతరగతి ప్రజలు 2025 ఎన్నికల్లో బీజేపీ వైపు మొగ్గారు.ఢిల్లీలో 27 ఏళ్లుగా అధికారంలోకి రాలేకపోవడంతో.. ఈసారి



ఎన్నికలను బీజేపీ సీరియస్‌గా తీసుకుంది. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం కోసం ఆరెస్సెస్ ముందుగానే బరిలోకి దిగింది. ఎన్నికల ప్రచారంలో 'ఆప్‌దా' లాంటి క్యాచీ స్లోగన్లు గణనీయమైన ప్రభావాన్ని చూపించాయి. ఎన్నికల ముగింట ఢిల్లీ వాసులు ఎదుర్కొంటున్న వాయు కాలుష్యం, ట్రాఫిక్ కష్టాలు, ఇండ్లు, పరిసరాల పరిశుభ్రత లేమి తదితర స్థానిక సమస్యలకు బీజేపీ అధిక ప్రాధాన్యం ఇచ్చింది. 'డబుల్ ఇంజిన్ సర్కారు' అంటూ ప్రచారం చేసిన బీజేపీ.. ఆయుష్మాన్ భారత్ పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్ లాంటి కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లింది.ఢిల్లీ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న పూర్వాంచలీలను బీజేపీ తమవైపు తిప్పుకోగలిగింది. ఈ బాధ్యతలను ఎంపీ మనోజ్ తివారీకి అప్పగించింది. 14 నియోజకవర్గాల్లో పూర్వాంచలీల ప్రాబల్యం ఎక్కువగా ఉండగా.. పది చోట్ల బీజేపీ విజయం దిశగా సాగుతోంది. మురికి వాడల్లో నివసించే వారిపైనా బీజేపీ ఫోకస్ చేసింది. ప్రధాని మోదీ స్వయంగా 1678 ఫ్లాట్లను జేజే క్లస్టర్ రెసిడెంట్స్‌కు అందజేశారు. డిజిటల్ క్యాంపెయిన్ విషయంలోనూ బీజేపీ దూకుడు కనబర్చింది. ఏఐతో రూపొందించిన కంటెంట్, డైలీ పోస్టర్లు, మీమ్స్‌తో ఆప్‌ను టార్గెట్ చేసింది.2013లో అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ అధికారంలోకి వచ్చిన ఆప్.. ఇప్పుడు అవినీతి ఆరోపణల కారణంగా ఓటమిపాలైంది. యూపీఏ హయాంలోని కుంభకోణాలు, నిర్భయ కేసుపై గళం వినిపించిన కేజ్రీవాల్.. అప్పట్లో కాంగ్రెస్ ఓటమికి కారణమయ్యారు. 12 ఏళ్ల తర్వాత ఆప్ సర్కారు కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అప్పటి పరిస్థితులను కేజ్రీవాల్ క్యాష్ చేసుకోగా.. ఇప్పటి పరిస్థితులను బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకుంది.ముఖ్యంగా లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా లాంటి కీలక నేతలు జైలుకు వెళ్లడ ఆప్‌కి మైనస్‌గా మారింది. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతున్నప్పటికీ.. ఆప్ ఇమేజ్ మాత్రం బాగా దెబ్బతింది. దీంతోపాటు శీష్ మహల్ వివాదంలోనూ బీజేపీతోపాటు కాంగ్రెస్ కూడా ఆప్‌ను టార్గెట్ చేసింది. కేజ్రీవాల్ నివాసం ఉండే బంగ్లాను పునరుద్ధరించే క్రమంలో.. దాన్ని విలాసవంతంగా మార్చడాన్ని ప్రతిపక్షాలు తప్పుబట్టాయి. అవినీతి ఆరోపణల వల్ల ఆప్ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. దీంతో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా లాంటి కీలక నేతలు సైతం ఓటమిపాలయ్యారు.గత పదేళ్లలో సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఆప్ సర్కారు.. ఢిల్లీ అభివృద్ధిని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లలేకపోయింది. ఇది కూడా ఆప్‌కు ప్రతికూలంగా మారింది.ఆప్ ఓటమికి కాంగ్రెస్ కూడా కారణమైంది. 2008 ఎన్నికల సమయంలో ఢిల్లీలో 40 శాతానికిపైగా ఉన్న కాంగ్రెస్ ఓటు బ్యాంకు 2013 తర్వాత గణనీయంగా పడిపోయినప్పటికీ.. 2025లో కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు పడిన ఓట్లు.. ఇతర అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేశాయి. బీజేపీ వ్యతిరేక ఓటును చీల్చిన కాంగ్రెస్.. చాలా చోట్ల పరోక్షంగా బీజేపీ విజయానికి తోడ్పడింది. ఏయే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎఫెక్ట్ ఆప్ మీద పడిందనేది తెలియడానికి కొంచెం టైం పట్టొచ్చు గానీ.. ఆప్ ఓటమికి కాంగ్రెస్ కారణమైందనేది మాత్రం కాదనలేని వాస్తవం. కాంగ్రెస్‌తో పొత్తు ఉండుంటే పరిస్థితిలో కొంత మార్పు ఉండేది.


## ఆ మంత్రం భలే పని చేసింది.. బీజేపీ గెలుపులో సగం మార్కులు దానికేనా..?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీలో మూడు దశాబ్దాల తర్వాత బీజేపీ ప్రభుత్వం ఏర్పడనుంది. అధికారంలోకి వచ్చేందుకు 1998 నుంచి ఎంత ప్రయత్నిస్తున్నా బీజేపీకి సాధ్యం కావడంలేదు. దేశ వ్యాప్తంగా తన ఇమేజ్‌తో చారిత్రాత్మక విజయాలు అందించిన ప్రధాని మోదీ సైతం 2015, 2020 ఎన్నికల్లో బీజేపీని ఢిల్లీ శాసనసభలో గెలిపించలేకపోయారు. ఆప్ దెబ్బకు బీజేపీ తోకముడిచింది. అదే 2025లో మాత్రం సీన్ రివర్స్ అయింది. బీజేపీ కొట్టిన దెబ్బకు ఆప్‌కు సౌండ్ లేకుండా పోయింది. 2015, 2020 ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ప్రధాని ప్రచారం చేసినా.. 2025 ఎన్నికల్లో చేసినంత ప్రచారం చేయలేదు. చిన్న రాష్ట్రం కావడంతో మోదీ పెద్దగా ఫోకస్ పెట్టలేదు. కానీ 2025లో మాత్రం టార్గెట్ ఫిక్స్ చేసుకుని మరీ మోదీ అనుకున్న లక్ష్యం సాధించారు. ఓవైపు ఉచిత హామీలతో పాటు.. గెలిచేందుకు ఏ అవకాశాన్ని విడిచిపెట్టలేదు. ముఖ్యంగా ఢిల్లీ ఎన్నికలకు ముందు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆ పార్టీకి కలిసొచ్చినట్లు చర్చ జరుగుతోంది. బీజేపీని ఓడించేందుకు ఆప్ విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ వాటిని కమలనాథులు సమర్థంగా ఎదుర్కొన్నారు. యమునా నీటిలో బీజేపీ విషం కలిపిందని కేజ్రీవాల్ స్థాయి నాయకుడు ఆరోపించారంటే ఈ ఎన్నికల్లో గెలుపు కోసం రెండు పార్టీలు ఎంత శ్రమించాయనే విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. బీజేపీ విజయంలో ఎన్నో సమీకరణలు పనిచేసినప్పటికీ ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయం ఆ పార్టీ గెలుపులో కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఇంతకీ ఆ నిర్ణయం ఏమిటో తెలుసుకుందాం.

గెలుపులో కీలకం..కేంద్రప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలను ఆకర్షించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా పన్ను మినహాయింపు విషయంలో కేంద్రప్రభుత్వం ప్రకటన బీజేపీ గెలుపులో ప్రధాన భూమిక పోషించిందనే చర్చ జరుగుతోంది. ఢిల్లీలో చాలామందికి నెలకు రూ.లక్ష వరకు జీతం ఉంటుంది. దీంతో ఎంత సంపాదించినా మధ్యతరగతి ప్రజలు పన్ను రూపంలో వేలకు వేలు కట్టాల్సి వస్తోంది. దీంతో పన్ను మినహాయింపు రూ.12లక్షల వరకు పెంచడంతో మధ్య తరగతి ప్రజలు బీజేపీకి జై కొట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీజేపీ గెలుపులో సగం మార్కులు పన్ను మినహాయింపుకేనంటూ ప్రచారం జరుగుతోంది.హోరాహోరీ..ఢిల్లీలో గెలుపుకోసం బీజేపీ, ఆప్ తీవ్రంగా ప్రయత్నించాయి. చివరి వరకు విజయం కోసం హోరాహోరీగా తలపడ్డాయి. సామాన్యుడినంటూ రాజకీయాల్లోకి వచ్చిన ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని, రాజభవనాల్లో ఉంటున్నారని బీజేపీ విమర్శిస్తూ వచ్చింది. తాము విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్న విషయాన్ని ఆప్ నేతలు ఖండించినప్పటికీ.. కొందరు నేతలు మాత్రం వంద కోట్లకు బీజేపీ హడావుడి చేస్తోందని, వేల కోట్ల రూపాయిలను బీజేపీ దోచుకుంటుందని కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆప్ మూల సిద్దాంతం అవినీతి రహిత ప్రభుత్వం కావడంతో.. ప్రజలు ఆప్ అవినీతిని సహించలేకపోయారని, దీనికి నిదర్శనం ప్రస్తుత ఫలితాలనే విశ్లేషణలు వెలువడుతున్నాయి.

## విసిగిపోయిన ఢిల్లీ ప్రజలు మార్పు కోసం ఓటేశారు: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖరారైపోయింది. ఫలితాల వెల్లడి మాత్రమే మిగిలింది. ఆప్ పార్టీ భారీ ఓటమి చవి చూడగా కాంగ్రెస్ ఖాతా కూడా తెరవలేదు. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ప్రియాంకా గాంధీ స్పందించారు. దేశ రాజధాని ప్రజలు ప్రస్తుత పరిస్థితులతో విసిగిపోయి మార్పు కోసం ఓటేశారని వ్యాఖ్యానించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్న విషయం ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సమావేశాల సందర్భంగానే స్పష్టంగా తేలిపోయిందని వ్యాఖ్యానించారు

"స్థానిక పరిస్థితులతో ప్రజలు విసిగిపోయారు. మార్పును కోరుకున్నారు. మార్పు కోసమే వారు ఓటేశారని అనుకుంటున్నాను. ఈ ఎన్నికల్లో గెలిచిన వారందరికీ నా శుభాకాంక్షలు. మిగిలిన వారు మరింతగా శ్రమించాలని ఈ ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజలు సమస్యలపై స్పందించాలి" అని ఆమె అన్నారు. కేరళ పర్యటనలో ఉన్న ప్రియాంకా గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికల కమిషన్ తాజా వివరాల ప్రకారం, ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ సీట్లలో కాషాయం పార్టీ ప్రస్తుతం 45 స్థానాల్లో ముందంజలో ఉంది. ఆప్ 21 స్థానాల్లో తొలి స్థానంలో ఉంది. ఇక కాంగ్రెస్‌కు మూడోసారి కూడా రిక్తహస్తాలు మిగిలే అవకాశం కనిపిస్తోంది.



## టైటిల్ కోసం కసరత్తులు మొదలు

మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న 'ఎస్-ఎస్ఎంబీ29' చిత్రం షూటింగ్ సైలెంట్‌గా మొదలైంది. ఇప్పటికే మహేష్ బాబు, ప్రియాంకా చోప్రాలపై ఓ కీలకమైన సన్నివేశాన్ని 5 రోజులపాటు అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్‌లో తీర్చిదిద్దారు. తదుపరి షెడ్యూల్ కూడా త్వరలోనే మొదలు కానుంది. ఈ సినిమాలోని ఓ కీలకమైన పాత్రలో నానా పటేకర్ కనిపించబోతున్నారని టాక్. ఆయనపై కూడా లుక్ టెస్ట్ నిర్వహించారని ఇన్ సైడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో మహేష్ తండ్రి పాత్రకు చాలా ప్రాధాన్యం ఉందట. ఆ పాత్ర కోసం ఎవరిని ఎంచుకొంటారా? అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. నానా పటేకర్‌ని తీసుకొంది మహేష్ తండ్రి పాత్ర కోసమా? కాదా? అనేది తెలియాల్సి ఉంది. మరో పక్క ఈ సినిమా టైటిల్ కోసం రాజమౌళి అన్వేషణ మొదలైంది.'మహారాజ్' , 'గరుడ' అనే టైటిల్స్ ఈ సినిమా కోసం పరిశీలించారని టాక్ నడిచింది. ఇవి రెండూ ఇప్పుడు ఓల్డ్ టైటిళ్లు అయిపోయాయి. కాబట్టి వాటి జోలికి వెళ్లకుండా 'జనరేషన్' అనే అర్థం వచ్చేలా ఓ పాన్ వరల్డ్ టైటిల్ కోసం అన్వేషిస్తున్నారని తెలుస్తోంది. ఈ కథకు తరతరాల లింక్ ఉంది. అందుకే అలాంటి టైటిల్ యాప్ట్ అని భావిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఏ విషయాన్నీ రాజమౌళి బయటకు రానివ్వడం లేదు. ప్రియాంక చోప్రాని ఎంచుకున్న సంగతి కూడా అధికారికంగా ప్రకటించలేదు.





## శ్రీలీల 'మంగళవారం' ఏం చేస్తుంది..?

'పెళ్లి సందడి' సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ శ్రీలీల. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. స్టార్ హీరోల సినిమాల్లో నటించడం ద్వారా భారీ పారితోషికం దక్కించుకుంటుంది. అంతే కాకుండా టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గానూ ఈ అమ్మడు నిలిచింది. గత ఏడాది చివర్లో ఈ అమ్మడు అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'పుష్ప 2' సినిమాతో వచ్చింది. పుష్ప 2 లో శ్రీలీల చేసిన కిస్సిక్ ఐటెం సాంగ్‌కి మంచి స్పందన వచ్చింది. అల్లు అర్జున్‌తో శ్రీలీల చేసిన డాన్స్‌కి పాన్ ఇండియా రేంజ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అంతర్జాతీయ గాయకుడు 'ఊర్వశి ఊర్వశి' ఆలాపన టాలీవుడ్‌లో ప్రస్తుతం ఈ అమ్మడు దాదాపు ఆరు సినిమాలు చేస్తోంది. అవి మాత్రమే కాకుండా కోలీవుడ్‌లో శివ కార్తికేయన్ సినిమా 'పరాశక్తి'లోనూ ఈ అమ్మడు నటిస్తున్న విషయం తెల్సిందే. ఒక తెలుగు హీరోయిన్ ఒకేసారి ఇన్ని సినిమాలు చేయడం అరుదుగా చూస్తూ ఉంటాం. ప్రస్తుతం చేస్తున్న సినిమాలు మాత్రమే కాకుండా తాజాగా మంగళవారం సినిమా సీక్వెల్‌లోనూ శ్రీలీల నటించబోతుందనే వార్తలు వస్తున్నాయి. 2023లో వచ్చిన మంగళవారం సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంతో పాటు కమర్షియల్‌గా సినిమాకు మంచి వసూళ్లు నమోదు అయ్యాయి. అందుకే మంగళవారం సీక్వెల్ రూపొందబోతుంది. అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ ముఖ్య పాత్రలో నటించిన 'మంగళవారం' సినిమాకు సీక్వెల్ రూపొందబోతున్నట్లు అధికారిక ప్రకటన వచ్చింది. ఇటీవలే పాయల్ రాజ్‌పుత్ మంగళవారం సీక్వెల్‌ను కన్ఫర్మ్ చేసింది. అయితే సీక్వెల్‌లో తాను నటించడం లేదని ఇండైరెక్ట్‌గా చెప్పింది. మంగళవారం 2 సినిమా పూర్తిగా కొత్త కథతో ఉంటుందని తెలుస్తోంది. అందుకే పాయల్ రాజ్‌పుత్ కాకుండా మరో హీరోయిన్‌తో సినిమాను రూపొందించేందుకు గాను దర్శకుడు అజయ్ భూపతి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఒక వేళ అవసరం అయితే చిన్న గెస్ట్ రోల్‌లో పాయల్ రాజ్‌పుత్ నటించే అవకాశాలు ఉన్నాయి. మంగళవారం సీక్వెల్‌లోనూ కథను విభిన్నంగా చూపించేందుకు అజయ్ భూపతి స్క్రిప్ట్ రెడీ చేశారట. పలువురి పేర్లను పరిశీలించిన తర్వాత తన స్క్రిప్ట్‌కి శ్రీలీల అయితే బాగుంటుంది అనే నమ్మకంకు వచ్చాడనే పుకార్లు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు అజయ్ భూపతి నుంచి ఎలాంటి క్లారిటీ రాలేదు. అలాగే శ్రీలీల సైతం ఈ విషయం గురించి స్పందించలేదు. కానీ వీరిద్దరి మధ్య చర్చలు జరిగాయి అనేది మాత్రం నిజం అంటూ వార్తలు వస్తున్నాయి. త్వరలోనే మంగళవారం సినిమా సీక్వెల్‌పై క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ మంగళవారం 2 సినిమాలో నటిస్తే కచ్చితంగా పెద్ద ఛాలెంజింగ్ రోల్‌గా శ్రీలీల కెరీర్‌లో నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభం కాబోతున్న మంగళవారం 2 సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

## బామ్మర్ది పెళ్లిలో నిక్ జోనాస్ ఏం చేశాడంటే..!

గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా చాలా కాలం తర్వాత ఇండియాకు వచ్చింది. బాలీవుడ్ సినిమాల్లోనూ నటించేందుకు ఆసక్తి చూపించని ఈ అమ్మడు ఈ మధ్య హైదరాబాద్ వచ్చింది. రాజమౌళి - మహేష్ బాబు సినిమా షూటింగ్‌లో దాదాపు వారం రోజుల పాటు పాల్గొన్నట్లు వార్తలు వచ్చాయి. హైదరాబాద్ నుంచి ఇటీవలే ముంబై చేరుకుంది. తన సోదరుడు సిద్దార్థ్ చోప్రా పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు గాను ప్రియాంక చోప్రా ముంబై వెళ్లింది. యూఎస్ నుంచి ఇటీవలే ప్రియాంక చోప్రా భర్త నిక్ జోనాస్ సైతం వచ్చారు. బామ్మర్ది పెళ్లిలో నిక్ జోనాస్ చేసిన సందడి ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత రెండు మూడు రోజులుగా ప్రియాంక చోప్రా సోదరుడి పెళ్లికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. హల్దీ మొదలుకుని ప్రతి ప్రత్యేక సందర్భాలకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంది. కజిన్స్‌తో కలిసి ప్రియాంక డాన్స్ చేసిన వీడియోలు సైతం అందరి దృష్టిని ఆకర్షించాయి. ముఖ్యంగా బామ్మర్ది సిద్దార్థ్ చోప్రా పెళ్లి వేడుకలో నిక్ జోనస్ పాడిన పాటల ప్రత్యేకంగా నిలిచాయట. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బ్యాండ్ మెంబర్ అయిన నిక్ జోనస్ పాటల కోసం కోట్లాది మంది ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు.



అలాంటి నిక్ జోనస్ పెళ్లిలో పెర్ఫార్మెన్స్ ఇవ్వడంతో చాలా స్పెషల్‌గా వేడుక మారిందట. నిఖిల్ నిక్ జోనస్ పాట పాడిన వీడియోను ప్రియాంక చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. ఆ వీడియోకు మంచి స్పందన దక్కింది. నిక్‌ను వివాహం చేసుకున్న సమయంలో ప్రియాంక చోప్రా గురించి తీవ్రమైన విమర్శలు వచ్చాయి. కేవలం డబ్బు కోసం అతడిని వివాహం చేసుకుంది అంటూ కొందరు కామెంట్స్ చేశారు. తనకన్నా పదేళ్లు చిన్నవాడిని చేసుకోవడం వల్ల వీరి వైవాహిక బంధం సవ్యంగా ఉండక పోవచ్చు అని అంతా భావించారు. కానీ వీరి వివాహం అయ్యి ఏడు సంవత్సరాలు అవుతుంది. వీరి వైవాహిక జీవితం చాలా సంతోషంగా సాగుతుంది. వీరి పాపతో సంతోషకరమైన జీవితాన్ని సాగిస్తున్నారు.అంతర్జాతీయ గాయకుడు 'ఊర్వశి ఊర్వశి' ఆలాపన తాజాగా సిద్దార్థ్ చోప్రా వివాహంలో వీరిద్దరు చేసిన సందడి చూసి చాలా మంది భార్య భర్త అంటే ఇలా ఉండాలని అభినందించారట. ఇద్దరూ కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా కలిసి ఉండేందుకు ఎక్కువ సమయం లభించకున్నా ఉన్నప్పుడు చాలా సంతోషంగా జీవితాన్ని సాగిస్తారు. ప్రియాంక చోప్రా చాలా కాలం తర్వాత ఇండియన్ మూవీలో నటించబోతుంది. అది కూడా మన తెలుగు సినిమా, మహేష్ బాబు సినిమా కావడం విశేషం. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న మూవీలో ప్రియాంక చోప్రా హీరోయిన్ కాదని, కీలక పాత్ర అనే వార్తలు వస్తున్నాయి. అసలు విషయం ఏంటి అనేది రాజమౌళి క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. రెండు పార్ట్‌లుగా విడుదల కాబోతున్న మహేష్ బాబు - రాజమౌళి సినిమా కోసం ప్రియాంక చోప్రా బల్క్ డేట్లు ఇచ్చిందని సమాచారం. పెళ్లి తర్వాత మరో రెండు వారాల పాటు ప్రియాంక చోప్రా ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

## అక్కినేని ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకోండి..!



అక్కినేని హీరోలకు గడ్డు కాలం నడుస్తోంది. ఒకప్పుడు వరుస విజయాలను సొంతం చేసుకున్న నాగార్జున గత కొన్ని సంవత్సరాలుగా ఫ్లాప్స్‌తో సహవాసం చేస్తున్నారు. గత ఏడాది నా సామి రంగ సినిమాతో వచ్చిన నాగార్జున ఆకట్టుకోలేకపోయారు. అంతకు ముందు ఏడాది 2023లో నాగార్జున నుంచి సినిమాలు రాలేదు. నాగ చైతన్య సైతం సక్సెస్ కొట్టి చాలా కాలం అయ్యింది. గత ఏడాది చైతన్య నుంచి సినిమాలే రాలేదు. ఇక అఖిల్ అక్కినేని సైతం సక్సెస్ కోసం కిందా మీదా పడుతున్నాడు. గత ఏడాది అఖిల్ నుంచి సినిమా రాలేదు. 2023లో వచ్చిన ఏజెంట్ బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. దాంతో అక్కినేని ఫ్యాన్స్ సక్సెస్‌ను ఎంజాయ్ చేసి చాలా కాలం అయ్యింది. నందమూరి, మెగా ఫ్యామిలీ హీరోలు వరుసగా సినిమాలతో వస్తూ అప్పుడప్పుడు అయినా సక్సెస్‌లు దక్కించుకుంటూ ఉంటే, అక్కినేని హీరోల సినిమాలు రావడమే తక్కువ అయ్యాయి, అందులో ఎక్కువ శాతం ఫ్లాప్‌లు ఉంటున్నాయి. దాంతో ఫ్యాన్స్ తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. ఏయన్నార్ లెగస్సీని ప్రస్తుత హీరోలు మెయింటెన్ చేయలేక పోతున్నారు అని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు అక్కినేని ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకునే విధంగా నాగ చైతన్య సక్సెస్ దక్కించుకున్నాడు. నిన్న విడుదలైన నాగ చైతన్య తండేల్ సినిమాకు మంచి టాక్ దక్కింది. అంతే కాకుండా మొదటి రోజు దాదాపు రూ.20 కోట్ల వసూళ్లు నమోదు అయ్యాయి. %ూశ్రీంశీ =ఋం% - యుద్ధ వీరుడి లుక్ కోసం 8 నెలల పాటూ అన్నీ మానేశా: నిఖిల్ నాగ చైతన్య కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనింగ్ కలెక్షన్స్. అంతే కాకుండా అక్కినేని హీరోల సినిమాల్లోనూ ఇదే అత్యధిక ఓపెనింగ్ డే గా టాక్ వినిపిస్తుంది. అక్కినేని హీరోల టైం స్టార్ట్ అయ్యిందని, ఇక నుంచి వరుసగా పెద్ద సినిమాలు, వరుస హిట్స్ పడటం ఖాయం అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తండేల్ తో టాలీవుడ్‌లో అక్కినేని హీరోల సక్సెస్ జర్నీ తిరిగి ప్రారంభం అయినట్లే అని, ఇదే ఏడాది అఖిల్ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే ధీమాతో ఫ్యాన్స్ ఉన్నారు. నాగార్జున ప్రస్తుతం ధనుష్ తో కలిసి 'కుబేరా' సినిమాలో నటిస్తున్నారు. ఆ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. మొత్తానికి అక్కినేని ఫ్యాన్స్ గత కొన్ని సంవత్సరాలుగా నిరాశ నిస్పృహతో ఉన్న సమయంలో వచ్చిన తండేల్ సినిమా వారికి జోష్ నింపింది. ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకునే విధంగా తండేల్ సినిమా టాక్ ఉంది. చందు మొండేటి దర్శకత్వంలో బన్నీ వాసు నిర్మించిన తండేల్ సినిమాను అల్లు అరవింద్ సమర్పించారు. సాయి పల్లవి హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో రియల్ స్టోరీని ప్రేమ కథ నేపథ్యంలో చూపించి దర్శకుడు చందు మొండేటి సక్సెస్ అయ్యారు.

## వార్2 మేకర్స్‌పై తారక్ ఫ్యాన్స్ గుస్సా



దేవర తర్వాత మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నుంచి రాబోతున్న సినిమా వార్2. బాలీవుడ్ లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాతోనే ఎన్టీఆర్ మొదటిగా బాలీవుడ్ లో అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో తారక్, హృతిక్ రోషన్‌తో కలిసి నటిస్తున్నాడు. స్పై యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై అందరికీ భారీ అంచనాలున్నాయి.ఇద్దరు హీరోలనూ ఒకే స్క్రీన్ పై చూడాలని అటు టాలీవుడ్, ఇటు బాలీవుడ్ ఫ్యాన్స్ అంతా ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటోంది. ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తైందని మేకర్స్ చెప్తున్నారు. అయినప్పటికీ వార్2 నుంచి ఎన్టీఆర్ కు సంబంధించిన ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో ఆయన ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. ఇప్పటికైనా వార్2 నుంచి తారక్ పాత్రకు సంబంధించిన అప్డేట్ ఇస్తే బావుంటుందని ఎన్టీఆర్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో మేకర్స్ ను రిక్వెస్ట్ చేస్తూ ఈ విషయాన్ని ట్రెండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే వార్2 లో ఎన్టీఆర్ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని బాలీవుడ్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే ఎన్టీఆర్ యాక్టింగ్‌లోని మరో యాంగిల్ ను వార్2 లో చూడొచ్చు. దీంతో వార్2 లో నెగిటివ్ రోల్ లో ఎన్టీఆర్ ఎలా కనిపించబోతున్నాడో చూడాలని ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ బర్త్ డే మేలో ఉండటంతో అప్పటివరకు ఆగకుండా దానికంటే ముందే ఓ పోస్టర్ ను రిలీజ్ చేసి సినిమాపై బజ్ పెంచాలనే ఆలోచనలో వార్2 మేకర్స్ ఉన్నట్టు తెలుస్తోంది.

నూతన, నటీ, నటులు కావలెను
కోకిల క్రియేషన్స్ బ్యానర్లో నిర్మించబోయే చలనచిత్రంలో నటించుటకు హీరో, హీరోయిన్ పాత్రలకు నూతన నటీనటులు కావలెను.
కోకిల క్రియేషన్స్ లో, ఫోక్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌లో, నటించుట కొరకు నూతన నటీనటులు కావలెను.
Kokila Creations MOVIE
ఆసక్తి కలవారు ఈ క్రింది నంబరు మరియు మెయిల్ ఐడి కి మీ యొక్క వివరాలు ఫోటోలు పంపించగలరు. వాట్సప్ నంబరు : 9246919390
మెయిల్ ఐడి : rk.neega@gmail.com

## అంధుల క్రికెట్‌కు అజయ్ వీడ్కోలు




**హైదరాబాద్-నవభూమి:** అర్జున అవార్డు గ్రహీత, భారత అంధుల జట్టు మాజీ కెప్టెన్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 34 ఏళ్ల అజయ్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుజిల్లా మాచర్ల. అజయ్ క్రికెట్ కెరీర్‌లో వన్డే, టీ20ల్లో కలిపి 101 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అజయ్ కెప్టెన్సీలో టీమిండియా 2016 ఆసియా కప్, 2017 టీ20 వరల్డ్‌కప్, 2018 వన్డే ప్రపంచకప్, 2022 టీ20 వరల్డ్‌కప్ సాధించింది. ఇక, 28 రాష్ట్రాలు పాల్గొన్న నగేష్ జాతీయ టీ20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం బెంగళూరు వేదికగా ఢిల్లీతో జరిగిన ఫైనల్లో ఆంధ్ర 67 పరుగుల తేడాతో నెగ్గి, ట్రోఫీ సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 20 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 251 పరుగులు చేసింది. అజయ్ 45 బంతుల్లో 104 పరుగులతో తన చివరి మ్యాచ్‌లో సెంచరీ కొట్టి కెరీర్‌ను ఘనంగా ముగించాడు. ఛేదనలో ఢిల్లీ 9 వికెట్లకు 184 పరుగులే చేసి ఓడింది. 19 ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌లో సహకరించిన కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు అజయ్ కృతజ్ఞతలు తెలిపాడు.

## సినిమా చూస్తుండగా.. ఫోనొచ్చింది



**నాగ్‌పూర్-నవభూమి:** ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీకి గాయం కావడంతో అనూహ్యంగా బరిలోకి దిగిన శ్రేయాస్ అదిరే ఆటతో ఇంగ్లండ్ బౌలర్లను చెడుగుడు ఆడాడు. హాఫ్ సెంచరీతో జట్టు విజయంలో కీలకమయ్యా డు. అయితే ఈ మ్యాచ్‌లో ఆడడం వెనుక ఓ ఆసక్తికర విషయాన్ని శ్రేయాస్ పంచుకున్నాడు. 'తొలి వన్డేలో ఎలాగూ చోటు దక్కదని తెలుసుకాబట్టి మ్యాచ్‌కు ముందు రోజు నేను హాయిగా సినిమా చూస్తు న్నా. ఆ సమయంలో కెప్టెన్ రోహిత్ నుంచి ఫోనొచ్చింది. విరాట్‌కు మోకాలిలో వాపు వచ్చింది. నీకు మ్యాచ్ ఆడే అవకాశం రావచ్చు. సిద్ధంగా ఉండమని చెప్పాడు. అంతే.. వెంటనే నా గదికి వెళ్లి పడుకున్నా. అలా విరాట్ దూరం కావడంతోనే నాకు అవకాశం దక్కింది' అని శ్రేయాస్ తెలిపాడు.చాలా రోజులుగా శ్రేయాస్ అయ్యర్‌ను సెలెక్టర్లు జట్టు ఎంపికలో పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అన్నాడు. గతేడాది ఆరంభం నుంచి వన్డేల్లో.. 2023 చివర నుంచి టీ20ల్లోనూ శ్రేయాసకు భారత జట్టులో చోటు దక్కలేదు. మరోవైపు శ్రేయాసలాంటి సమర్థుడైన బ్యాటర్‌ను పక్కనబెట్టడం మానుకోవాలని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా సూచించాడు. వన్డే వరల్డ్‌కప్‌లో నాలుగో నెంబర్‌లో ఆడి 500ం పరుగులు సాధించిన తొలి భారత ఆటగాడిగా శ్రేయాస్ నిలిచిన విషయం మరువరాదని గుర్తుచేశాడు.కోహ్లీ ఫిట్‌నెస్‌పై ఆందోళన అవసరం లేదని వైస్-కెప్టెన్ గిల్ స్పష్టంజేశాడు.

## ఫేవరెట్ ముంబై



**కోల్‌కతా-నవభూమి:** రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లకు వేళైంది. మొత్తం..నాలుగు మ్యాచ్‌లు దేశంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ప్రారంభం కానున్నాయి. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై..హరియాణాతో అమీతుమీ తేల్చుకోనుంది. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే చేరికతో ముంబై అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. మేఘాలయతో గత మ్యాచ్‌లో సిద్ధేష్, ఆకాష్, షామ్స్ ములానీ సెంచరీలు చేశారు. ఈ నేపథ్యంలో ఫేవరెట్‌గా బరిలో దిగుతున్న ముంబైని ఎదుర్కోవడం హరియాణాకు సవాలే. ఇక ఇతర మ్యాచ్‌ల్లో..రాజ్‌కోట్‌లో గుజరాత్-సౌరాష్ట్ర, నాగ్‌పూర్‌లో విదర్భ-తమిళనాడు, పుణెలో కేరళ-జమ్మూ కశ్మీర్ జట్లు తలపడతాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**